
జూన్ 1963 వెల 60 N.P

06 - 1963

63





శ్రీ రాజరాజేశ్వరి ఫిలిం కంపెనీ వారి
ఆప్తమిత్రులు
ఎన్. టి. రామారావు కాంతారావు రేలంగి మిక్కిలినేని పెరుమాళ్లు
కృష్ణకుమారి రాజసులోచన కన్నాంబ గిరిజ ఋష్యేంద్రమణి
రచన సముద్రాల జూనియర్ దర్శకత్వం కె. బి. నాగభూషణం సంగీతం ఘంటసాల
మే నెలలో విడుదల

తొలిమాట

నీలవేణి + ముగ్గురు గుమాస్తాల కథ + పద్మ నవ్విన కారణం + గెలవని పందెం + హౌస్ పార్లమెంటు = 52 పేజీలు = ఢోకాలేని అయిదు చక్కని కథలు.

అంత మాత్రాన మీరు మిగతా పేజీలు చదవకుండా వదిలేయడానికి వీల్లేదు. వదిలేస్తే మీరే తరవాత నాలిక్కరుచుకుంటారు, మాకేం?

"నారద" గారు పెట్టిన "మీలో మీకు పోటీ" ఫలితాలు, కొత్త పోటీ ప్రకటన 108 — 109 పేజీలలో వున్నాయి.

"జోకుల పోటీ"కి మంచివేమీ రాలేదు. అందుచేత ఫలితాలను ఈ నెల ప్రకటించలేకపోయినందుకు చింతిస్తున్నాము. వచ్చే నెలకు ఇంకా మంచివి పంపించడానికి ప్రయత్నించమని మనవి.

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట పోస్టు : : విజయవాడ-2

మేనేజింగ్ ఎడిటర్: వి. వి. రాఘవయ్య
విడిప్రతి వెల: 60 న. పై. ఏడాది చందా ఏడు రూపాయలె
సంపుటి 1 జూన్ 1963 సంచిక 5

పాఠకమహాశయా ! ఈ నెల

ఇదీ వరస....

Edited and Published by V. V. Raghavaiah and
Printed by him at Andhra Printers Ltd.,
Buckinghampet post Vijayawada-2.



ఎందుకా సంతోషం?

ఏమా కథ?

48 వ పేజీనుంచి చూడండి



కాశ్మీర్ చర్చల వైఫల్యం

సఫలమైతే ఆశ్చర్యపడవలసిందేగాని. విఫలమైనందుకు ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. పాకిస్తాన్ వైఖరిని మొదటినుంచి-చర్చలు మొదటిసారిగా డిసెంబరులో ప్రారంభమైనప్పటినుంచి-గమనిస్తున్నవారికి అవి విఫలంకాక తప్పదని అనిపిస్తూనే వుంది. ఢిల్లీ, రావల్పిండి, కలకత్తా, కరాచీ నగరాలలో మొత్తం ఆరు నెలలపాటు ఆరు ఘట్టాలలో చర్చలు జరిగాయి. ఇండియా-పాకిస్తాన్‌లమధ్య విభేదాలకు కారణమైన సమస్యలన్నీ చర్చనీయాంశాలే అయినా, ప్రధానంగా కాశ్మీర్ సమస్యపైనే ఉభయ దేశాల ప్రతినిధులు-ఇటు సర్దార్ స్వర్ణ సింగ్, అటు భుట్టో-కేంద్రీకరించారు.

చైనా దురాక్రమణ తరవాత ఇండియా సైనిక శక్తిని పెంపొందించుకొనడానికి ఆయుధ సహాయం చేయవలసిందిగా మిత్ర రాజ్యాలన్నిటిని, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్‌లను భారత ప్రభుత్వం కోరింది. మొదట కొంత తక్షణ సహాయాన్ని అందజేసినా, దీర్ఘకాలిక సహాయాన్ని ఇవ్వడానికి అమెరికా, బ్రిటన్‌లు తటపటాయిస్తున్నమాట నిజం. మిలిటరీ వ్యూహం దృష్ట్యా మొత్తం భారత ఉపఖండాన్ని ఒకే యూనిట్‌గా పరిగణిస్తే, సహాయం చేయడం సుకరమవుతుందని, ఇందుకు పాకిస్తాన్‌ను కూడా కలుపుకు రావాలని, పాకిస్తాన్, ఇండియాల మధ్య విభేదాలు సమసిపోయి మైత్రి ఏర్పడాలని అవి భావించాయి. ఈ సూచనకు ఇండియా అంగీకరించింది. కాశ్మీర్ విషయమై ముఖాముఖి చర్చలు జరపడానికి సమ్మతించింది.

అయితే, పాకిస్తాన్ ధోరణిలో ఇస్సెళ్ళుగా ఒక్క పిసరైనా మార్పు రాలేదు. కాశ్మీర్‌లో ప్లెబిసైట్ జరపాలనే వితండవాదాన్ని వదలుకున్నదనుకోండి. కాని, అంతకంటె అన్యాయమైన ప్రతిపాదనలు చేయడం మొదలుపెట్టింది. జమ్మూ, కాశ్మీర్‌లో మూడువేల చదరపుమైళ్ళ భూభాగం మినహా,- శ్రీనగర్ లడఖ్‌లతో సహా-మొత్తం తన ఆధిపత్యానికి అప్పగించాలని అది పట్టుబట్టింది.

నిజానికి, కాశ్మీర్‌లో పాకిస్తాన్‌కు సూదిమొన మేరపైకూడా హక్కులేదు. అయి

రాజకీయ వాతావరణం



అమెరికన్ విదేశాంగ మంత్రి డీన్‌రస్క్, ప్రధాని నెహ్రూ.

ప్పటికి, ఈ వివాదాన్ని ఇప్పటికైనా పరిష్కరించుకొనాలనే ఉద్దేశంతో వున్నందున ఇండియా ఒక రాజీప్రతిపాదన చేసింది. ఇప్పటి యుద్ధవిరమణ రేఖనే స్వల్పమైన మార్పులతో ఖాయం చేయడానికి అంగీకరించింది. దీనిప్రకారం మొత్తం 85,000 చదరపు మైళ్ళ జమ్మూ - కాశ్మీర్ భూభాగంలో 34 వేల చదరపుమైళ్ళ మేర పాకిస్తాన్‌కు దక్కుతుంది. అయితే, ఈ ప్రతిపాదన దానికి రుచించలేదు. కొద్దిభాగం మినహా మొత్తం తనకే రావాలని భీష్మిస్తున్నది. ఈ పరిస్థితిలో చర్చలు విఫలం కావడంకంటె జరిగే దేమున్నది?

ఇంతకంటె మనకు బాధ కలిగిస్తున్న మరొక అంశం మనపట్ల పాకిస్తాన్ అనుసరిస్తున్న శత్రుత్వవైఖరి. ఇండియాతో సఖ్యతను అది కోరడంలేదు. కేవలం సైనిక శక్తిని వృద్ధిచేసుకొనడానికే ఇండియా చైనా బూచిని చూపెడుతున్నదనీ, చైనా ఎన్నడూ ఇండియాపై దాడి చేయదని, ఇదివరకు చేయలేదని అది ప్రచారం చేస్తున్నది. చైనాతో తనకు కొత్తగా ఏర్పడిన మైత్రిని మనకే


కాక, అమెరికా, బ్రిటన్‌లకు కూడా బెదిరింపుగా అది ప్రయోగిస్తున్నది. ఇండియాకు ఆయుధసహాయం కొనసాగిస్తే తాను సియాటో, సెంటో కూటాలనుంచి తప్పుకోగలనని బెదిరిస్తున్నది.

ఏమైనా, ఒకటిమాత్రం హర్షించదగినది. అమెరికా, బ్రిటన్‌లు మొదటినుంచి పాకిస్తాన్‌పట్లనే ఎక్కువ సానుభూతిని చూపుతున్నాయి. కాశ్మీర్ విషయంలో దాన్నే సమర్థిస్తున్నాయి. ఏదోవిధంగా పాకిస్తాన్‌తో రాజీ పడవలసిందిగా ఇండియాపై ఒత్తిడి తెచ్చాయి. కాని ఇటీవల అమెరికన్ విదేశాంగ మంత్రి డీన్‌రస్క్, బ్రిటిష్ కామన్వెల్తు సంబంధాలశాఖ మంత్రి డంకన్ శాండ్సు న్యూఢిల్లీ వచ్చినప్పుడు ప్రధాని నెహ్రూ వారితో ఖండితంగా చెప్పివేశారు- ఎట్టిపరిస్థితులలోను కాశ్మీర్‌ను మొత్తంగా పాకిస్తాన్‌కు అప్పగించటం జరగబోదని.

ఈ వైఖరిని అమెరికా, బ్రిటన్‌లుకూడా ఆమోదించాయని ప్రధాని లోకసభ సమావేశం ఆఖరిరోజున ప్రకటించారు. అంటే, కాశ్మీర్ సమస్యా పరిష్కారంతో సంబంధం లేకుండా ఇండియాకు దీర్ఘకాలిక సహాయం చేయడానికే అవి ఒప్పుకున్నాయన్నమాట. శ్రీ టి. టి. కృష్ణమాచారి ఇటీవల అమెరికన్ ప్రెసిడెంట్ కెనెడీతో ఈ విషయమై సంభాషణలు జరిపారు. మన సమస్యలను కెనెడీ సానుభూతితో అవగాహన చేసుకున్నట్టు, త్వరలోనే ఒక నిర్ణయం . మనకు హర్షకారణం కాగల నిర్ణయం- వెలువడగలదని ఆశిస్తున్నట్టు శ్రీ టి. టి. కె. ప్రకటించారు.

అమెరికా, బ్రిటన్‌ల సహాయం సంగతి ఎలా వున్నా, ఇండియా వీలైనంత స్వల్పవ్యవధిలో తన సైనికశక్తిని ఇనుమడింపజేసుకొనక తప్పదు. చైనా ఈనాడు యుద్ధ విరమణను పాటిస్తూవుండవచ్చు. యుద్ధ ఖయిదీలను విడిచిపెడుతూవుండవచ్చు. కాని ఏనాటికైనా అది మనకు పక్కలో బల్లెమే. గుండెలపై కుంపటే. నేఫానుంచి లదఖ్‌వరకు సరి

అరబ్ రిపబ్లిక్ ప్రధాని ఆలీసబ్రీ, భారత ప్రధాని నెహ్రూ



హద్దు పొడుగునా అది సేనలను సమీకరిస్తున్నది. సైన్యం రాకపోకలకు గాను మన సరిహద్దువరకు రోడ్లు నిర్మిస్తున్నది. వివిధ దేశాలలో ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాలలో మనపై దుష్ప్రచారం చేస్తున్నది. శాంతిని వాంఛించనిది మనమేనని నమ్మించ జూస్తున్నది. అన్నిటిని మించి కొలంబో రాజ్యాలు చేసిన ప్రతిపాదనలను అది తిరస్కరించింది. ఆ ప్రతిపాదనలను చైనా చేత ఆమోదింప జేయాలని ఆఖరిసారిగా ప్రయత్నం చేసిన అరబ్ రిపబ్లిక్ ప్రధాని అలీ సబ్రీ పెకింగ్, ఢిల్లీల పర్యటన అనంతరం తన యత్నం విఫలమైందనే దాదాపు అంగీకరించారు. కొలంబో ప్రతిపాదనలు న్యాయనిర్ణేతల తీర్పులవలె వున్నాయని, కనుక వాటిని మొత్తంగా ఆమోదించలేనని చైనా చెబుతున్నది. అవి తీర్పులు కావేకావని, దురాక్రమణకు ముందు పరిస్థితిని దాదాపు పునరుద్ధరించడమే వాటి ఉద్దేశమని, వాటిని ఆమోదిస్తే ఆ తరవాత సరిహద్దు వివాదంపై సంభాషణలు ప్రారంభించవచ్చునని ఇండియా వాదం.

కనుక, ఇప్పటిలో ఈ వివాదం తెగే సూచనలు కనబడడంలేదు. అందుచేత చైనా ప్రమాదం మనకు పెనుభూతంలా మరికొన్ని సంవత్సరాల వరకు కట్టెదుట వికటనాట్యం చేస్తూనే వుంటుంది. ఈ నిజంతో కలిసి జీవించడానికి మనం అలవాటు పడాలి. ఇతర దేశాల సహాయం—మన ఆత్మగౌరవానికి, మన విదేశాంగ నీతికి, జీవనవిధానానికి భంగం కాని పద్ధతిలో—లభించినంతవరకు తీసుకుని, మిగతా బరువును మనమే భరించి చైనాకు దీటుగా సైనికంగా బలపడాలి. ఇది మింగక తప్పని చేదుమాత్రలాంటి నిజం.

కాశ్మీర్ సమస్యతో ముడిపెట్టకుండా ఆయుధ సహాయం చేయడానికి పశ్చిమ రాజ్యాలు అంగీకరించడం మన విదేశాంగ నీతికి ఒక ఘనవిజయం కాగా, బొకారో ఉక్కు కర్మాగారానికి ఆర్థిక, సాంకేతిక సహాయం చేయడానికి అమెరికా ప్రెసిడెంట్ సమ్మతించడం మరొక ఘనవిజయం.

రూర్కెలా, భిలాయ్, దుర్గాపూర్ ఫ్యాక్టరీల వలెనే బొకారో ఫ్యాక్టరీ కూడా ప్రభుత్వ రంగంలోనే నిర్మితమవుతుంది. దీనివిషయమై పరిశీలన జరిపిన అమెరికా ఉక్కు కార్పొరేషన్ కొన్ని అంచనాలు తయారు చేసింది. మొదటి దశలో 14 లక్షల టన్నులు, రెండవ దశలో 25 లక్షల టన్నులు, మూడవదశలో 40 లక్షల టన్నులు ఉక్కు తయారు చేయవచ్చు. 1980 నాటికి మూడుదశలు పూర్తి అవుతాయి. మొత్తం వెయ్యికోట్ల రూపాయల ఖర్చు కాగలదు. కొన్ని సాంకేతికమైన చిక్కులను ఇండియా ప్రభుత్వం అధిగమించ గలిగితే ఫ్యాక్టరీ నిర్మాణం లాభసాటి కాగలదు.

అయితే, అమెరికా ఆర్థిక సాంకేతిక సహాయం చేయనిదే ఫ్యాక్టరీ నిర్మించడం సాధ్యం కాదు. సహాయం చేయడానికి అమెరికన్ ప్రభుత్వం- కెనెడీ హామీ ప్రకారం అంగీకరించినట్టే. ఇక అమెరికన్ కాంగ్రెస్ ఆమోదమే తరవాయి. బొకారో ఫ్యాక్టరీ ప్రభుత్వ రంగంలో వుంటుంది కనుక, సహాయం చేయరాదని కాంగ్రెస్ నిర్ణయించితే అంతకంటే శోచనీయం మరొకటివుండదు. అలా జరగదనే ఆశిద్దాము.

దాదాపు మూడు నెలలపాటు జరిగిన మొన్నటి పార్లమెంటు సమావేశాలు చారిత్రాత్మకమైనవి. ఇవి వాకౌట్‌తో ప్రారంభమై, దాదాపు వాకౌట్లతోనే ముగిశాయి. ఇదివరకెన్నడు ఎరగనంత పెద్ద బడ్జెటు, రక్షణ బడ్జెట్టు, పన్నుల పెంపు, ముఖ్యంగా నిర్బంధపు పొదుపు పథకం, బంగారం కంట్రోలు, మంత్రులపై అవినీతి ఆరోపణలు మొదలైన ఎన్నో వివాదాస్పదమైన అంశాలు చర్చింప బడ్డాయి. చివరి



భారత రక్షణ మంత్రి శ్రీ వై. బి. చవాన్,
బ్రిటిష్ కామన్వెల్తు శాఖమంత్రి డంకన్ శాండ్స్


ఘట్టంలో అతిముఖ్యమైన రెండు బిల్లులు ఆమోదింప బడ్డాయి. ఒకటి అధికార భాషలబిల్లు. రెండవది విభజన వాద నిరోధక శాసనం. మొదటి దాని ప్రకారం 1965 తరవాత హిందీ మనకు ప్రధాన అధికార భాష అవుతున్నది. ఇంగ్లీషు స్థానాన్ని క్రమంగా హిందీ ఆక్రమిస్తుంది. అయితే ఇంగ్లీషుకూడా—హిందీ బాగా అభివృద్ధి చెందేవరకు అధికార వ్యవహారాలన్నిటికీ వాడబడుతూనే వుంటుంది. 1975 తరవాత ప్రెసిడెంట్ ఒక పార్లమెంటరీ కమిటీ నియమించి హిందీ అభివృద్ధిని పరిశీలింప జేస్తారు. అవసరమైతే ఇంగ్లీషు ఇంకా కొనసాగిస్తారు. నాన్—హిందీ ప్రాంతాల వారి ఉద్యోగాది విషయాలలో హిందీ రాకపోవడం ఒక ప్రతిబంధకంగా వుండబోదని ప్రధాని నెహ్రూ, హోం మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి హామీ నిచ్చారు.

ఈ హామీలు మద్రాసుకు చెందిన డి. ఎమ్. కె. పార్టీకి మినహా మిగతా నాన్—హిందీ ప్రాంతాల వారికి సంతృప్తి కరంగానే వున్నట్టు కనిపిస్తుంది.

డి. ఎమ్. కె. ప్రతికూలించిన మరొక బిల్లు వేర్పాటు ధోరణులను అరికట్టడానికి ఉద్దేశించింది. ఇండియన్ యూనియన్ నుంచి ఏ ప్రాంతమైనా విడిపోవాలని ఏ రాజకీయ పక్షంగాని, వ్యక్తిగాని ప్రచారం చెయ్యడం ఈ బిల్లు ప్రకారం నేర మవుతుంది. ద్రవిడస్తాన్ వేర్పాటును కోరుతూ మద్రాసు రాష్ట్రంలో కొంతవరకు పలుకుబడిని సంపాదించుకున్న డి. ఎమ్. కె. పార్టీ చర్యల దృష్ట్యా ఈ బిల్లు ఆవశ్యకమైంది, హర్షించ దగింది.

కూనలమ్మ పదాలు

ఆరుద్ర



అజ్ఞులగు కాకవులు
అయిరి కాకాకవులు
మూసుకో నీ చెవులు
ఓ కూనలమ్మ!

పిలిచినప్పుడు రాదు
వెడలగొట్టిన పోదు
వనిత తీయని చేదు
ఓ కూనలమ్మ!



కొత్తదంటే రోత
చెత్త పాతకు జోత
మనిషి ప్రగతికి ఘాత
ఓ కూనలమ్మ!

అడ్డుతగిలిన కొలది
అమిత శక్తులు గలది
అబల అగునా వెలది?
ఓ కూనలమ్మ!



పిలువ కున్నా పెళ్ళి
చెరుపజాలును పిల్లి
పలు శుభమ్ముల పెళ్ళి
ఓ కూనలమ్మ!


ఎపుడొ పరిణయమైన
ఈడ వుండదు కాన
ఆడ దనబడె చాన
ఓ కూనలమ్మ!

మంచి నడవడి లేక
మరులు ఎడదను లేక
మనిషి చేయడు రూక
ఓ కూనలమ్మ!



భార్య పుట్టినరోజు
భర్త మరచిన రోజు
తగ్గెననుకో మోజు
ఓ కూనలమ్మ!

తేరగా సీతులొచ్చి
తెలివి తేటలు చచ్చి
పెరుగు పదవుల పిచ్చి
ఓ కూనలమ్మ :



కురులు దువ్వ విధాన
చెలుని దువ్వెడి చాన
నిజముగా నెరజాణ
ఓ కూనలమ్మ ।

గద్య సుమములనుండి
కావ్య మధువులు పిండి
పంచి పెట్టెను దండి
ఓ కూనలమ్మ ।

పాదరసమును గెలుచు
పడతి చపలత వలచు
గుండె లందున నిలుచు
ఓ కూనలమ్మ ।



మూగ చూపుల సంజ్ఞ
మొదటి ప్రేమ కనుజ్ఞ
తెలుసుకొనుటే ప్రజ్ఞ
ఓ కూనలమ్మ ।



ఎర్రటేపు

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

పరిపాలనా యంత్రంలో పదిమందీ ఆడిపోసుకుంటున్న అంశం, ఎర్రటేపు. ఈ ప్రపంచంలో ఎర్రటేపుని గురించి వున్న అపోహలు, విమర్శలు మరే విషయాన్నిగురించి లేవేమోనని నా అనుమానం. ఎవరిపని ఏకారణంచేత జరక్కపోయినా, లేదా అది ఆలస్యంగా, మజిలీలు చేసుకుంటూ జరిగినా, దానికంతా కారణం ఎర్రటేపేనని అక్కసు వెళ్ళబుచ్చడం పరిపాటి అయిపోయింది. నల్లేరుమీద బండిలా జోరుగా, ఎర్రటేపుమీద లేచిపోతారు. ఉప్పెన కెరటంలా విరుచుకుపడతారు. ఇంతమందిదృష్టి దానిమీద పడింది గదా, నిజానికి దిష్టితగిలి క్షీణించవలసిందేనా? కాని అది మొండిఘటం. అందరి తిట్లూ, బెదిరింపులూ తుడిపేసుకుని బహుశా దీవెనలకింద దిద్దేసుకుని మరింత బలిష్ఠమై విశ్వవిహారం చేసేస్తూవుంటుంది. అదృశ్యశక్తులేవో దానికి హమేషా దిష్టి తీసి పారేస్తూ

కొపాడుతున్నారు కాబోలు. దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే నన్నట్టు ఎర్రటేపు సంస్కరణకి అందరూ నాయకులైపోయి సలహాలు విసిరిపారేస్తున్నారు. వానరరాజు వాలి సంగతి మీకందరికీ తెలిసిందేగా. ఎదటబడి ఎవడు యుద్ధంచెయ్యబోయినావాడిశక్తికూడా వాలికే సంక్రమించేది. అదేవిధంగా ఈ ఎర్రటేపు కూడా వొచ్చిన సలహాలన్నీ జీర్ణంచేసుకుని, పూర్వం మేనాలో మెల్లిగా మెసిలేది. ఇప్పుడు కవాతుగుర్రమెక్కి సవారిచేస్తోంది.

నిజానికి కాశీమజిలీలో మాంత్రికుడిలాటిది యెర్రటేపు. మాంత్రికుడి ప్రాణం వాడి దగ్గర వుండదు. సప్తసముద్రాలూ దాటగా మధ్య ఓదీవిలో ఒంటిస్తంభం మేడమీద బంగారు పంజరంలోవున్న చిలకలోనో, గోడవంకలోనో వుంటుంది. బ్రహ్మరాక్షసులూ, భూతాలూ ఆ పక్షిని కాస్తూవుంటాయి. ప్రాణం ఎక్కడుందో కూపీతియ్యకుండా మాంత్రికుడిమీద పడి ఎన్నికత్తులు విసిరితేయేం, ఎన్ని ఫిరంగులు పేలిస్తేయేం? ఎర్రటేపు ఆ మాంత్రికుడికి పెద్దన్నగారు. కృశ్చెవ్, కెనెడీలు దాచిపెట్టిన అటంబాంబులన్నీ ఒక్కమాటు దానిమీద పడేసినా దానిపీపు విరగదు. అలాటి సందర్భంలో విషయం గ్రహించకుండా మన నాయకులు దాని సంహారానికి నడుంకట్టి, ఈటెలూ, బల్లాలూ ప్రయోగిస్తే ప్రయోజన మేముంది?

మొన్న ఓ మినిష్టరుగారికి చాలా కోపమొచ్చింది. ఆయన ఎక్కడికి వెళ్ళినా నెరవేని వాగ్దానాలే యెత్తిచూపించడం ప్రారంభించారు ప్రజలు; అవన్నీ చెసెయ్యమని ఆయన అధికారులకే ఒకమాటుకాదు, అరడజనుమాట్లు ఆర్డరు వేశారుట! ఎర్రటేపు పని జరక్కపోవడానికి కారణమంటూ అందరూకలిసి ఎర్రటేపుమీద విరుచుకుపడ్డారు. ఈ ఎర్రటేపంతా వెంటనే తీసి పారెయ్యవలసిందని ఆయన మరో ఆర్డరు వ్రాసేశారు. ఇది ఎలా తియ్యాలో ఆలోచించడానికి ఒక కాన్ఫరెన్సు ఏర్పాటు చేశారు. ఎర్రటేపువల్ల ఎన్ని అనర్థాలు వొస్తున్నాయో, ప్రభుత్వంపేరు, అందులో ముఖ్యంగా అయనపేరుఎలా చెడిపోతోందో ఆయన గంభీరోపన్యాసంలో విడమర్చి చెప్పారు. తరువాత ఉపకమిటీలు ఏర్పడి విషయాలన్నీ చర్చించాయి. చివరికి చెడ్డపేరు తెస్తున్న ఎర్రటేపంతా తీసిపారేసి, అన్ని ఆఫీసులలోనూ తెల్లటేపే ఉపయోగించాలని తీర్మానించారు. ఇది కేవలం భౌతిక దృష్టినించేగాక, భారతీయ సంస్కృతికి ఆధారమైన ఆధ్యాత్మిక దృష్టికి అనుగుణంగా వుంటుందని తీర్మానించారు. ఎర్రటేపు రజోభావాన్ని సూచిస్తుంది. తెల్లటేపు సాత్వికభావాన్ని సూచిస్తుంది. కనక టేపు బదలాయింపు, రాజకీయ, ఆర్థిక, పురోభివృద్ధిని సాధించడానికేగాక ఆధ్యాత్మికసాధనకికూడా దోహదమిస్తుందని మెచ్చుకుంటూ మినిష్టరుగారు అంత్యోపన్యాసం చేశారు.

అయితే బస్తాలకొద్దీ వున్న ఎర్రటేపుని ఏమిచెయ్యాలన్న ప్రశ్న వొచ్చింది. పూర్తిగా పారెయ్యమన్నారు కొందరు. చైనావాడి దుండగంవల్ల ఏర్పడిన అత్యవసర పరిస్థితిలో ఆ దూబరా పనికిరాదు కనుక ఆ టేపుకే తెల్లరంగు వేయించాలని మరొకరు సూచించారు. సీటీరంగా, నూనెరంగా అని మరికొంత తర్జనభర్జన. తీరా

దేశంలో జనాభా పెరిగినదానికంటె ఎక్కువగా ఆఫీసులో ఉద్యోగుల సంఖ్య పెరగుతూండడం మామూలుగా జరుగుతున్నదే. దీనికి కారణం పని పెరగడమే నని మనలాంటి పామరు లనుకుంటారు. అదికాదుట. ఉద్యోగుల సంఖ్య పెరగడంవల్లనే పని పెరుగుతుందిట. ఈ విషయమై పార్కిన్‌సన్ అనే దొర ఆ మధ్య పరిశోధనలు జరిపి "రిలెటివిటి" కంటె జటిలమైన ఒక సూత్రం కనిపెట్టాడు. "ఏ పనినైనా పూర్తిచేయడానికి లభించే కాలాన్నిబట్టి పని పెరుగుతుంది" అని. దీన్నే "పార్కిన్‌సన్స్ లా" అంటారు.

అలాగే, మన ప్రభుత్వ కార్యాలయాలలో ఎర్రటేపునుగురించి పరిశోధించి సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు ఈ వ్యాసం వ్రాశారు. సృష్టికి మూలకారణాన్నయినా కనుక్కోవచ్చు, గాని ఎర్రటేపు ఎవరిసృష్టి అనేది కనుక్కోలేమని ఆయన సూత్రీకరించారు, వీరు బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తుండడమేకాక, హాస్య రచయితగాకూడా ప్రసిద్ధికెక్కారు.

అది నిర్ధారణ చేసుకునేసరికి, ఆ రంగు కొనడానికి ప్రస్తుతం గ్రాంటులేదని తేలింది. తెల్లరంగు కొనడానికి అదనపుగ్రాంటు కావాలని మినిష్టరుగారు ప్రొపోజలుపెడితే ఫైనాన్సు డిపార్టుమెంటులో ఏ రూలుకింద యిది మంజూరు చెయ్యవచ్చునో ఆరాలు తీస్తున్నారు. ఈలోపుగా దాచిపెట్టిన ఎర్రటేపు ఎలుకలు తినివెయ్యకుండా కాపలావాళ్ళని పెట్టవలసొచ్చింది. ఎర్రటేపు రంగు ఫిరాయించుకుని తెల్లటేపుకింద ఎప్పుడో ఒకప్పుడు బయట పడవచ్చును, సందేహం లేదు. కాని ప్రస్తుతం ఆర్డరు అమలు జరగలేదని కోపగించుకోడానికి మరో అవకాశం లభించిందేతప్ప మరేమీ జరక్కుండా పోయింది. ప్రయోజనంవున్నా లేకపోయినా టేపురంగు ఫిరాయించడానికే యింత తతంగమయితే....

కనకనే ఎర్రటేపు విషయమై పరిశోధన చేసి, ఎర్రటేపు అంటే ఏమిటి? దాని స్వరూపం, స్వభావం, పరిణామం ఏమిటి అన్న విషయాలు, సూత్రాల్లోనూ, కథల్లోనూ చెప్పగలిగే పరిజ్ఞానం సంపాదించాను. నా పరిశోధనా ఫలితాలని సూత్రాలుగా అవగాహన చేసుకోడం మీకు కష్టం గనుక నేను మొత్తంమీద కథల్లోనే చెప్పవచ్చు. అంతా అర్థంచేసుకున్న తరవాత సప్త సముద్రాలూ దాటి, దాని ప్రాణం దాచిన కీలకొన్ని సంపాదించి సంహరించడానికి నడుం కడతారో, లేదా, నారాయణాస్త్రానికి నమస్కారమొక్కటే ప్రతిదానమయినట్టు దూరంనించే ఎర్రటేపుకి నమస్కరించి తప్పుకుంటారో మీ చేవనిబట్టి మీరే

నిర్ణయించుకోవాలి. జ్ఞానులు పో వెరిచే చోటికి మూర్ఖులు దూకుతారని ఓ ఇంగ్లీషు సామెత వుంది చూడండి.

ఎర్రటేపుకి ఆధారాలు రెండు. మొదటిది. రూల్సులేక రెగ్యులేషన్సు అనబడే నిబంధనావళి. రెండోది సంప్రదాయం.

ప్రతి ఆఫీసులోనూ, రూల్సూ రెగ్యులేషన్సూ నమిలి జీర్ణంచేసుకుని, ఈ నిబంధనల్లో ప్రాణం పోయి అవి పీనుగులయిపోయినా, వాటిని వొదిలిపెట్టక కంటికి రెప్పలా కాచుకుని వుండే కాసబియాంకాలు వుంటారు కొంతమంది. వాళ్ళ చేతిలో పుటుక్కున తెగిపోయే పురికొస పెట్టినా లంకాదహన మప్పుడు హనుమంతుడు తోకని పెంచినట్టు, మాంచి బలిష్టమైన నవారుపట్టీ నేసెయ్యగలరు. వాళ్ళు అల్లిన అల్లికని, సాలీడు గూడుకోసం అల్లుకున్న దారంలా పుటుక్కున తెంచి పారెయ్యగలమని ఎవరైనా అనుకుంటే, వాళ్లు సావకాశంగా కూర్చుని అఘోరించవలసిందే తప్ప, యితరమేమీ జరగదు. పైగా అలాటి వాళ్ళకి లోకంలో అందరిమీదా అనుమానం. ప్రతిప్రపోజలులోనూ ఏదో అంతరార్థం వుండి తీరుతుందని వారికి గట్టి నమ్మకం. కనక ఏదో మడత పేచీ తగిలిస్తేనే గాని, వారిచేతిలో బడిన ఏ కాగితాన్ని కదల్చరు. విక్టోరియా మహారాణి కాలంలో జారీ చేసిన సర్క్యులర్లతోసహా అన్నీ వారికి కంఠగతం కావడంవల్ల ఏ ప్రొపోజలులో ఎవరెవరు ఎక్కడెక్కడ ఏమేమి మరిచిపోయారో, తప్పు వ్రాశారో సునాయాసంగా వేలెత్తి చూపించగలరు. వారు వ్రాసిన నోటుకి సమాధానం చెప్పుకుంటే గాని కాగితం పైకి కదలడానికి వీల్లేదు. ఆ సమాధానం చెప్పుకోలేక గిజ గిజ మంటూ ఎర్రటేపు మీద విరుచుకు పడతారు ప్రొపోజలుపెట్టిన పెద్ద మనుష్యులు.

ఉదాహరణకి చూడండి. ఓ యింజనీరు గారు ఏదో అర్జెంటుగా ఓ ప్రోజెక్టు చేసెయ్యాలి. పంచవర్ష ప్రణాళికలో మూడో యేట ఈ పని పూర్తిచెయ్యాలని నిర్ణయం. ఈ నిమిషం, ఈ క్షణంనించే విశ్రమం లేకుండా శ్రమిస్తేనేగాని అది సాధ్యపడదు. కాని, పనికి ఉపక్రమించాలంటే కొన్ని పరికరాలు అత్యవసరంగా కావాలి. కొలుచుకునే టేపు అందులో ముఖ్యం. కనక మూడు మెటల్ టేపులు కొనడానికి శాంక్షన్ కావాలని ఇమీడియేట్ జెండా తగిలించి ఓ కాగితాన్ని ఫైలు రూపేణా పైకి పంపిస్తాడు. అది రిజిస్ట్రేషన్, డిస్పాచి అనే మజిలీలు దాటి గుమాస్తాగారిని చేరిన తరవాత వారు దాని విషయమై క్షుణ్ణంగా ఆలోచించి, మూడుపేజీల ప్రశ్నలు తయారు చేస్తారు.

ఆ ప్రోజెక్టు, డిటేల్డు ఎస్టిమేట్లు తయారయి అప్రోప్రియేటు అధారిటీల శాంక్షన్ పొందిందా? ఆ శాంక్షన్‌లో కొలతటేపులు ఇంక్లూడ్ అయివున్నాయా? ఇవి ఒకటైను ప్రశ్నలు. ఇంజనీరింగు డిపార్టుమెంటు లోగడ అనేక ప్రోజెక్టులు చేసింది. అప్పుడు చాలా టేపులు కొనివుండాలి. అవన్నీ ఏమయాయి? రాష్ట్రంలో అన్ని ప్రోజక్టులకీ, మీదగ్గర యేమన్నా ఖాళీగా టేపులు వున్నాయా? అవి మీరు ఎందుకివ్వలేరు? అని సర్క్యులర్లు పంపించారా లేదా? అలాటి సర్క్యులర్ పంపించి దానిఫలితం తేలినతరవాతనే ఏవస్తువయినా కొనాలని నిబంధన తెలియదా?

ఈ సందర్భంలో పంతొమ్మిదివందల పదిహేనులో జారీచేసిన ఆర్డరు ఇంకా అమలులోనే వుందిట - దానితరవాత మరో సంగ్రామం జరిగి దేశానికి స్వాతంత్ర్యమొచ్చినా.

ఇవి రెండోటైను ప్రశ్నలు.

ఒక ప్రోజెక్టుకి మూడు టేపు లెందుకు? ఈ టేపులు డ్రాయర్లలో వుండిపోకుండా హమేషా ఉపయోగించబడతాయని గ్యారంటీ యివ్వగలరా? టేపులు ఏవిధంగా ఎప్పుడు, ఎవరు ఉపయోగించేదీ, వివరమైన ప్రోగ్రాము తయారుచేసి పంపిస్తే పరిశీలించి, ఈ టేపులు కొనడానికి శాంక్షన్ ఇవ్వవచ్చునో, లేదో రిమార్కులు ఇవ్వబడును. ఇవి మూడోటైను ప్రశ్నలు.

ముందు వెనుకలు ఆలోచించకుండా పొర్ప్రోజలులు పెట్టి, కొలవడానికి టేపు లేక, ప్రోజెక్టులు పోస్టుపోను చేయించి, ఇంజనీర్లు ఎర్రటేపుని ఆడిపోసుకోడం న్యాయమా?

నిబంధనలు తిన్నగా తెలుసుకోవి ఇంజనీర్లేకాదు. నిబంధనలుచేసే అధికార్లే ఒక్కొక్కప్పుడు బోల్తా కొట్టెయ్యవలసొస్తుంది. ఫైనాన్సు డిపార్టుమెంటు కార్యదర్శిగారి సెలవ జీతం సంగతి మీరు వినేవున్నారేమో. లేకపోతే క్లుప్తంగా చెబుతాను. అనగా అనగా, అంటే పూర్తిగా కట్టుకథ అనుకునేరు. కొంత అక్షరాలా నిజముంది—ఓ మాటు ఫైనాన్సు డిపార్టుమెంటు కార్యదర్శిగారు రెండు నెలలు సెలవమీద వెళ్ళారు. ఆయన ఏవూళ్ళోనూ




కాలు నిలవక, తిరుగుతూ వుండడంచేత నెలవరోజుల జీతం ఎక్కడికీ తెప్పించుకోలేకపోయాడు. తిరిగి డ్యూటీలో చేరిన తరవాత నెలవజీతానికి బిల్లు తయారుచేసి పంపించాడు. ఆయన నిబంధనలు అమలు జరిపించడంలో కాకలుతీరిన బంటు. ఆయన ఆధ్వర్యంకింద ఆ డిపార్టుమెంటులో యోధానయోధులు తయారయారు. ఒక మహా యోధుడి చేతిలో ఆయన బిల్లు పడింది. జీతం రాళ్ళకోసం ఎదురుచూస్తున్న ఫైనాన్సు డిపార్టుమెంటు కార్యదర్శిగారి నెత్తిమీద పిడుగు రాయిలా ఆ బిల్లు తిరుగు టపాలో తిరిగొచ్చింది.

"అయ్యా ! ఇది మీరు నెలవలో వున్న నెల జీతానికి బిల్లు. పందొమ్మిదో నిబంధన ప్రకారం శలవమీద వున్న జీతగాడు బతికి వున్నట్టు మేజస్ట్రేటునించి సర్టిఫికేట్ కూడా బిల్లుకి జతపరిచి వుండాలి. ఈ బిల్లులో తమరు కిందటినెలలో జీవించి వున్నట్టు సర్టిఫికేట్ లేదు. కనక జీతం ఇవ్వడానికి వీల్లేదు. సదరు సర్టిఫికేట్ జత చేయించి, బిల్లు తిరిగి సమర్పించుకుంటే జీతము ఇవ్వబడును" అని దానిమీద ఎండార్సుమెంటు. ఎవరైనా శలవమీద వుండి అక్కడ పరమపదించేసినా, వారిపేరు చెప్పి జీతం మరెవరో కొట్టేసెయ్యకుండా కాపాడుకునే నిమిత్తం ప్రభుత్వం ఈ షరతు పెట్టిందట. ఈ షరతు బతికే వుండి ఆఫీసులో తిరిగి చేరిన వారికి వర్తించదని కార్యదర్శిగారు వాదించి చూశారు గాని, ఈ వాదోపవాదాలతో కాగితం షటుల్ కాక్ లా తిరగడం ప్రారంభించేసరికి, తను క్రితం నెలలో బతికేవున్నట్టు సర్టిఫికేట్ సంపాదించి జీతం పుచ్చుకోడానికి తయారయాడు. ఫైనాన్సు డిపార్టుమెంటు కార్యదర్శి అయితే మాత్రం కిందటి నెలలో తను బతికున్నట్టు సర్టిఫికేట్ ద్వారా రుజువు చేసుకోకుండా, శలవజీతం వసూలు చేసుకుందామని ప్రయత్నిస్తాడా? రూలంటే రూలే !

ఇక ఎర్రటేపుకి రెండో ఆధారమయిన సంప్రదాయాన్ని గురించి క్లుప్తంగా చెబుతాను. మన జీవితాల్లో సంప్రదాయం ఎంత ప్రముఖపాత్ర వహిస్తుందో అందరికీ తెలిసిన విషయమే. మన పవిత్ర భారతదేశంలో ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క సంప్రదాయముంది. పెళ్ళిళ్ళలోనూ వియ్యాలవారి తగవుల్లోనూ సాధారణంగా యివి బయటపడుతూ వుంటాయి. కొత్తగా కాపురానికొచ్చిన పెళ్ళికూతురు ఏంచేసినా "ఇదేమిటోనమ్మా, ఇది మా సంప్రదాయం కాదు" అనాలనిపించడం పరిపాటే. ఒక వ్యక్తి అలవాటు, ఓ యింట్లో అలవాటుగానూ, కుటుంబానికి సంప్రదాయంగానూ పరిణమించవచ్చును. మాటవరసకి పళ్లు తోముకోకుండానే కాఫీ తాగడం. ఇప్పుడు కొన్ని కుటుంబాల్లో అదే సంప్రదాయ మయిపోయింది. కొంతకాలానికి వారింట్లో పుట్టినవారెవరైనా పళ్ళుతోముకు గాని కాఫీతాగము అని అంటే వారిని వెలివెయ్యొచ్చును కూడాను. అవకాశం దొరికింది కనక, ఈ ప్రిసిడెంటు ఆఫీసులో ఎలా విహరిస్తోందో వివరించక మునుపు, నిత్య జీవితంలో మనుష్యుల్ని ఎలా పట్టేసుకుంటోందో ఒక్క సంఘటన చెప్పాలనిపిస్తోంది. మా వూళ్లో ఓ అత్తరు సాయిబున్నాడు. మాతాతగారి హయామునించీ

అతను మా యింటికి వొచ్చి కొంత అత్తరు, వాసననూనె ఇచ్చి వెళ్లేవాడు. మొన్నీమధ్య మావూరెళితే మళ్ళీ మా ఇంటిదగ్గిర కనిపించాడు. చాలాకాలానికి కనిపించాను గనుక వెంటనే ఆ వాసననూనె కొనాలని పట్టుపట్టాడు. "నన్ను చూస్తున్నావుగదా. మన శిరోజాలకి వాసననూనె వాడవలసిన అవసరం తీరిపోయి అప్పుడే కొన్ని సంవత్సరాలయింది." అంటే వినిపించుకోడే. 'అయ్యా మీ తాతయ్యగారికి ఇంతకంటె పెద్దబట్టతలే వుండేది. అది చాలా దర్జాఅయిన బట్టతల. నా వాసననూనెతో ఎప్పుడూ ఘుమఘుమలాడుతూ వుండేది' అని నామీద మా తాతయ్య ప్రిసిడెంటు విసిరాడు. ఏం చెయ్యను. బట్టతలకి సాయిబుగారి వాసననూనె కొనకతప్పింది కాదు.

కొంతమంది ఆఫీసర్లు ప్రిసిడెంటు చూపిస్తేగాని ఏమీ ఒప్పుకోరు - శకునం, వర్జ్యం చూస్తేనేగాని బయటకి కాలుపెట్టని మనుష్యుల్లాగ. శ్రావణ మంగళవారానికి శలవ మంజూరుచేసిన దొరవారిసంగతి మీకందరికీ తెలిసేవుంటుంది. శ్రావణ మంగళవారంనాడు శలవ ఇవ్వవలసిందని ఓ ఆఫీసులో గుమాస్తా పెట్టిన అర్జీమీద "కిందటి సంవత్సరం ఈ శలవయిచ్చారా ? ప్రిసిడెంటు ఏమిటి" అని దొరగారు అడిగితే "అయ్యా క్రితం సంవత్సరం శ్రావణ మంగళవారం ఆదివారంనాడు రావటంవల్ల శలవ శలవలో కలిసిపోయి. వేరే శలవ ఇవ్వలేదు" అని జవాబు యిచ్చారుట. ఈ ప్రిసిడెంటుతో తృప్తిపడి ఆ దొరగారు వెంటనే శ్రావణ మంగళవారానికి శలవ మంజూరుచేశారుట.



ప్రిసిడెంటు చూస్తేనేగాని దేనినీ మంజూరుచెయ్యని ఆఫీసర్లకంటె గొప్పవారు - ప్రిసిడెంటు వుంటేనేగాని ఏపనీ చెయ్యడానికి వీలులేదని అడ్డుతగిలే గుమాస్తాలూ, యితర ఆఫీసు సిబ్బందీని.

ఈ మధ్య ఓ ఆఫీసులో పనిచేస్తున్న ఓ ప్యూన్ యింట్లో రాత్రి దొంగలుపడి, వాడు కట్టుకున్న, చిరిగిన పంచ, బనియను మినహా అన్నిగుడ్డలూ యెత్తుకుపోయారుట. బట్టలు కొనుక్కోడానికి ఓ నెలజీతం అడ్వాన్సుగా యిప్పించమని వాడు అర్జీపెట్టు

కున్నాడు. ఆఫీసరుగార్ని స్వయంగా దర్శించుకుని తను కట్టుకున్న బట్టకి వున్న చిరుగులన్నీ చూపించి మరీ ఆ అర్జీ ఆఫీసరుగారి చేతులో పెట్టాడు. ఆయన తప్పకుండా "విచారిస్తా"మని అర్జెంట్ రిమార్కులకోసం కాగితం కిందకి తోలారు. బట్టలు దొంగలు ఎత్తుకుపోతే, కొనుక్కునేందుకు అడ్వాన్సు యివ్వవచ్చునని స్పెసిఫిక్ రూలు యేమీలేదు కనక ప్రిసిడెంటు కావలసొచ్చింది. రూలేవుంటే ఆ రూలు లోగడ ఎప్పుడైనా ఉపయోగించబడిందా అని ప్రిసిడెంట్లు వెతకొచ్చును. అది వేరే సంగతి. ఆ ఆఫీసులో ఎవరింట్లోనూ దొంగలుపడి బట్టలుఅన్నీ ఎత్తుకుపోయినట్టు కాని, ఒకవేళ యెత్తుకుపోతే, ఫిర్యాదుచేసినట్టుగాని, నోటివాకబుకి వైనం అందలేదు. కనక "మీ ఆఫీసుతో ఏ ప్యూను యింట్లోనయినా దొంగలుపడి బట్టలు అన్నీ యెత్తుకపోయారా? ఎత్తుకుపోతే యేంచేశారు." అని ఒక సర్క్యులర్ డ్రాఫ్టుచేసి ఆఫీసరుగారి సంతకం పుచ్చుకుని అన్ని శాఖలకీ పంపించారు. ఈ సర్క్యులర్ భావం తిన్నగా అర్థంకాలేదు. "ఎత్తుకుపోతే యేంచేశారు" అన్నదాని-కిబట్టలు దొంగిలించబడినప్యూన్ ఏమిచేశాడు అనా అర్థం? లేకపోతే ఆఫీసు ఏంచేసింది అనా? ఇది విడమర్చితేనేగాని సరిఅయిన జవాబు పంపించలేము అని ఒక శాఖనించి క్లారిఫికేషన్ కోరితే "ఆఫీసు ఏం చేసింది" అనే దీని భావం. అని మరో సర్క్యులర్‌కూడా పంపించారు. వొచ్చిన సమాధానాలు క్రోడీకరించడానికి ఒక గుమాస్తాకి ఓవర్‌టైము యిచ్చి పనిచేయించవలసి వొచ్చింది. ఫలితంగాతేలింది ప్యూనుల యిళ్ళల్లో దొంగతనాలు జరిగి వస్తువులూ, బట్టలుకూడా పోగొట్టుకున్న సంఘటనలు వున్నాయిగాని, కట్టుకున్న చిరిగిన పంచె ఒక్కటీ మినహా బట్టలన్నీ ఎత్తుకుపోయిన దొంగతనం లోగడ ఎక్కడా జరగలేదు. ఏ ప్యూనూ అడ్వాన్సుకోసం దరఖాస్తుపెట్టుకున్నట్టులేదు. ఒకవేళ పెట్టుకున్నా అది రికార్డుల్లో కేవలం ఫైలయిపోయింది గాని మంజూరు చెయ్యబడలేదు." దాంతో వ్యవహారం మళ్ళీ ముందుకొచ్చింది. ఆరు వారాలుగా ఈ విచారణ జరుగుతోంది. రోజు విడిచి రోజు ఆ ప్యూను ఆఫీసరుగారికి చిరుగులు చూపిస్తున్నాడు. ఆఫీసరుగారి హృదయం దహిస్తూనేవుంది. తలకూడా తిరగడం ప్రారంభించేసరికి ఆయన హెడ్డుగుమాస్తాగారిని పిలిచి ఏలాగయినా ఈ ప్యూనుకి కొంతపారేసి వొదిలించుకోవాలని చెప్పవలసొచ్చింది. అందరూ తలలు గోక్కొని అత్యవసర (ఎమర్జన్సీ) నిబంధనలు తిరగేసి దీనికి అన్వయించడానికి వీలైన ఒక రూలు కనిపెట్టి, ఇది ప్రిసిడెంటుగా ఆ ప్యూను మరెప్పుడూ దొంగతనం జరిగించుకుని బట్టలన్నీ పోగొట్టుకుని జీతం అడ్వాన్సు అడగని షరతుమీద వాడి అర్జీ మంజూరుచేశారు. ప్రిసిడెంటు చూడకుండా అర్జీ మంజూరుచేసివుంటే అందరి యిళ్ళల్లోనూ దొంగతనాలు పెరిగిపోతాయని అందరికీ నమ్మకం. మరీ అవసరమొచ్చి ప్రిసిడెంటు లేకుండా ఏమన్నా చెయ్యవలసొస్తే, కాపాడుకోడానికి ఇది ప్రిసిడెంటు కాకూడదని ఒక షరతు జమాయించవలసొస్తుంది.

ఆఫీసు సిబ్బంది టైములో సహానికి పైగా ఈ ప్రిసిడెంట్లు వెతకడానికే సరిపోతుంది. ఎన్నెన్ని పాతఫైళ్ళు కిందకిదింపి దుమ్ము దులిపి పరిశీలించాలి! ఎంత సూక్ష్మ పరీక్ష చెయ్యాలి. ఇదంతా ఏదో ఎర్రటేపు-పుటుక్కున తెంపెయ్యగలమనుకోడం ఎంత భ్రమ?

ప్రిసిడెంటు సోదరి "ఆఫీసు పద్ధతి." స్త్రీలింగం ప్రయోగించానని సోదరీమణులు కోపగించుకుంటారేమో. మొగాళ్లు కొంచెం మొరటు. అందంగా ఆభరణాలు—రెగ్యులేషన్ ప్రకారం పద్నాలుగు కారట్లవే లెండి—తగిలించడానికి అవకాశం లేదు. ఆఫీసు పద్ధతులు బహుసున్నితంగా, నాజూకుగా కూడా వుండగలవు కాబట్టి స్త్రీలింగం ప్రయోగించాను. మా ఆఫీసులో ఏదైనా కాగితం, ఒక సెక్షన్ నించి, మరో సెక్షన్‌కి వెళ్ళాలంటే—అంటే, ఎదురెదురుగా మూడడుగుల దూరంలో వున్న ఒక టేబుల్‌మీద నించి మరో టేబుల్‌మీదికి వెళ్ళాలంటే మొదట రిజిస్ట్రేషన్ సెక్షన్‌కి వెళ్ళి,అక్కడినించి డిస్పాచి సెక్షన్‌కివెళ్ళి, మళ్ళీ రిజిస్ట్రేషన్ సెక్షన్‌కి ప్రయాణించిగాని రెండో బల్లమీదికి రావడానికి వీల్లేదు. ఫైలు పట్టా తప్పితే యెంత ప్రమాదమో, ఈ పద్ధతి తప్పించి పక్క బల్లమీదికి ఫైలు దూకితే అంత ప్రమాదమూను. ఈ పరిస్థితిలో ఎంత పరుగెత్తినా కనీసం రెండు రోజులు పడుతుందిగదా, మూడడుగుల ప్రయాణానికీని. మినిస్టరుగారు సంతకం పెట్టినా ఆఫీసులో కాగితాలు కాళ్ళమీద నడిచే ప్యూనుద్వారా వెళ్ళాలిగాని. ఆకాశ మార్గాన అందజెయ్యడానికి అవకాశం లేదుగా!

నిర్ణీతమయిన పని అందరికీ అప్పజెప్పడం ఆఫీసుపద్ధతిలో ఓ ప్రధాన భాగం కనక "ఇది నా పనిగాదు" అని గుమాస్తా మొదలు, ఆఫీసర్లదాకా చెప్పడం కూడా, ఆఫీసుపద్ధతిలో ఓ ప్రధాన భాగమే. కొన్నికొన్ని అర్జీలు "ఇది మా శాఖకి సంబంధించినదికాదు" అన్న ఎండార్సుమెంటులతో ఆఫీసులు తిరుగుతూ వుంటాయి. ఎవరికి సంబంధించనిదో మటుకే తెలుస్తుంది కాని,ఎవరికి సంబంధించిందోఎవరికీ తెలీదు. కోపగించుకుని ఏం ప్రయోజనం? పోజిటివ్ దృక్పథంతో పనిచెయ్యాలని ఆఫీసు సిబ్బందికి ఉపన్యాసాలు దంచి ఏం లాభం? పరబ్రహ్మస్వరూపాన్ని గురించి కూడా "నేతి" "నేతి" అన్నారేగాని, "ఇతి" అని నిర్ధారణగా చెప్పలేకపోయారు గదా! మా ఆఫీసులో ఇంజనీర్లందరూ అకౌంట్ డిపార్టుమెంటూ, ఆడిట్ డిపార్టుమెంటూ తప్పులు పట్టడానికి నెగెటివ్ దృక్పథంతో పనిచేస్తారేగాని, పోజిటివ్ దృక్పథంతో సహాయం చెయ్యరని గోల. వేదాంతంచెప్పి ఓదార్చడం తప్ప నేనేం చెయ్యగలను చెప్పండి.

ఆశాజనకంగా లేదుకదూ? కనుకనే మళ్ళీ ఓమాటు ఆలోచించుకోమంటున్నాను. ఎర్రటేపు మీద ధ్వజమెత్తాలంటే దాని ప్రాణం ఎక్కడ భద్రపరచి వుంచబడిందో గ్రహించండి, అప్పుడు తేల్చుకోండి. సప్త సముద్రాలూ దాటి, దాని ప్రాణం దాచిన కీలకాన్ని సంపాదించి సంహరించడానికి సాహసిస్తారో, నమస్కారంపెట్టి కూర్చుండిపోతారో!

గెలవని పందెం

ఆచంట శారదాదేవి



మునిగిట్లో అరుగుమీద కూర్చున్నాడు మునయ్య నోట్లో పందుంపుల్ల పెట్టుకుని నింపాదిగా నములుతూ. అప్పుడే తెల తెల్లవారుతోంది. యింకా చీకటి పూర్తిగా విడిపోలేదు. చెట్లసందుల్లో నించి వెలుగు కొద్ది కొద్దిగా వ్యాపిస్తోంది. తొలి వెలుగు తెల్లని మబ్బులా అన్నింటినీ మెల్లగా కప్పుతోంది. చలి ఇంకా ఎక్కువగానే ఉంది. మునయ్య ముడుచుకు కూర్చున్నాడు.

ఎదురుగుండా ఆవు గడ్డిపరకలు నములుతూ నిర్లక్ష్యంగా దోమలు తోలుకుంటోంది. దూడ మెడ ముందుకు చాచి తాడు తెంపుకోవాలని ప్రయత్నిస్తోంది. తాటాకు దడికి దగ్గరగా కోళ్లు మెడలు నిక్కబొడుచుకొని పచార్లు చేస్తున్నాయి. దడికి అవతలి మురుగుకాల్వలో నించి ఉండి ఉండి గాలి కదలినప్పుడల్లా దుర్గంధం వ్యాపిస్తోంది.

వేపచెట్టుకు కట్టిన కోడె దూడ కొమ్ములతో గాలిని కుమ్మి కుమ్మి రాబొయ్యే పండగ పందాల్లో పాల్గొనడానికి ప్రాక్టీసు చేస్తున్నట్లుంది. ఆ దృశ్యం చూస్తున్న మునయ్యకు పరమానందమైంది. ఈ సారి పందాల్లో తన కోడె తప్పకుండా గెలుస్తుంది. అది తప్పదు. ఆ మాట చెరగని అక్షరాలతో రాసిపెట్టుకోవచ్చు. ఈ సారి వీరిగాడి పని బయటపడక తప్పదు. ఎంత గర్వం! ఏం అహంభావం! ఈ ఏడు తెలుస్తుంది!

పక్క పాకలో కాపురం వీరన్నది. మునయ్యకు ఇల్లూ, వాకిలీ, పొలమూ, పుట్రా, తల్లీ, దండ్రీ, అత్తా, మామా అంతా ఉన్నారు. వేళకువెళ్ళి భోంచేయడం తప్ప వేరే ఆదుర్దాలేదు. అల్లాగే రోజులు గడిచాయి. తల్లీ, భార్యా ఇంటిపనీ, గొడ్లపనీ చూసుకుంటారు. తండ్రీ, వీరన్నా పొలంపని చూస్తారు. ఒక్కడే కొడుకు కావడంతో మునయ్యకు గారాబం ఎక్కువైంది. తల్లిదండ్రీ ఏపనీ చెప్పరు. నాలుగో క్లాసుతో బడిమానేసినా ఎవరూ ఏమీ అనలేదు. అంచేత నోట్లో పందుంపుల్ల పెట్టుకు దిక్కులు చూస్తూ ఎంతసేపు కూర్చున్నా అడిగేవాళ్ళు లేరు.


ఏపనీ చెయ్యని ఈ భర్తను చూస్తే భార్య లక్ష్మికిమాత్రం కాస్త చిరాకు. తను గొడ్లను కడుగుతున్నప్పుడు గాని, వాటిని అవమాయించి గుంజలకు కట్టలేక పెనుగులాడుతున్నప్పుడుగాని ఇతను తనకేమీ సంబంధించనట్లు, తాను ఈ లోకానికే అతీతుడైనట్లు శూన్యదృక్కులు ప్రసరిస్తూ కూర్చుంటే చూసి చూసి లక్ష్మి మండి పడుతుంది. కొడుకుమీద మమకారంతో అత్తగారు చంద్రమ్మ కోడల్ని అదమాయిస్తుంది. మునయ్య నవ్వుకుంటాడు.

ఈ మధ్య మునయ్యను రాత్రింపగలు వేధిస్తున్న సమస్య ఒక్కటే : ఈ సారి పందాల్లోనైనా తన కోడెదూడ గెలవాలి. వీరిగాడిది ఓడిపోవాలి : అది తప్పదు. ఏడాదినుంచి దృష్టిఅంతా దానిమీదే. ఏపనీ ఎన్నడూ చేయనివాడు కోడెదూడను శ్రద్ధగా మేపడం, పొలం తీసికెళ్ళడం ఈ పనులు మాత్రం చేస్తున్నాడు. గంటలు గంటలు దాన్ని నిమురుతూ కబుర్లుచెబుతూ కాలం గడుపుతాడు. దగ్గరగావెళ్ళి వీపు నిమురుతూ దాని చెవిలో "ఈ సారి వీరిగాడి కోడెను గెలవాలిసుమా" అంటాడు. అది ఒక్కసారి తల ఊపి చెవులు విదలిస్తుంది. మునయ్య సంతోషిస్తాడు.

వీరిగాడు పుట్టగానే తల్లినీ, దండ్రినీ దూరం చేసుకున్నాడు. దిక్కులేని వాడిని మునయ్య తండ్రి వెంకటయ్య చేరదీసి పెంచాడు. అప్పుడు అతనికి సంతానంలేదు. తరువాత అయిదారేండ్లకు గాని మునయ్య పుట్టలేదు. వీరన్న చిన్నప్పటినుంచి వెంకటయ్యను చుట్టుకు చుట్టుకు తిరిగేవాడు. అతనికి అన్నిపనులకు వీరన్నే ఆసరా : నా అన్నవాళ్ళు లేని వీరన్నకు పెంచిన వెంకటయ్యే సమస్తమూ : అతను అడిగితే చాలు ప్రాణాలైనా ఇద్దామన్నంత మమకారం వీరయ్యకు. వెంకటయ్యకు మాత్రం కొడుకు మునయ్యను చూస్తే మురిపెమూ, తనతో కూడా తిరిగే వీరన్నను చూస్తే నిర్లక్ష్యమూ : ఎంత ప్రయత్నించినా మునయ్య స్థానాన్ని తాను ఎప్పుడూ ఏమాత్రమూ ఆక్రమించుకోలేడని వీరన్న ఏనాడో గ్రహించాడు. అప్పటినుంచి అతని హృదయంలో మునయ్యంటే ఏదో ద్వేషమూ, అసూయా రగిలాయి. కాని ఆ భావాలు ఎప్పుడూ మనస్సులోనే అణగిపోయేవి. మునయ్యకూ చిన్నప్పటినుంచీ వీరన్నంటే సరిపడలేదు. ఎప్పుడూ ఆటల్లో, పనుల్లో అతనిదే పై చేయిగా ఉండటం గిట్టలేదు. వీడెవడూ : దిక్కులేనివాడు అన్నింట్లో తనకు పోటీ అని అసూయ పడేవాడు. కాని అది పైకి చూపించటానికి మాత్రం అవకాశం ఉండేదికాదు. అంచేత లోలోపలే దాచుకొని బాధపడుతూ ఉండేవాడు. ఈఏడు పండగ సందట్లో కోడెదూడల పందాల పేరుతో వారి వారి ద్వేషాలు వెళ్ళబోసుకోడానికి ఇద్దరికీ మంచి అవకాశం దొరికింది. అది పట్టుకు ప్రాకులాడేకొద్దీ అసూయ లెక్కువైనాయి.

లక్ష్మి కాపురానికి వచ్చాక వీరన్న పక్క స్థలంలో పాకా వేసుకుని వేరే వుంటానన్నాడు. వెంకటయ్య కాదనలేదు. వీరన్న పగలంతా అతనితో పొలంలో పనిచేస్తాడు. రాత్రికి తిండితిని తన పాకలో పడుకుంటాడు.

ఒకసారి పొలాలదగ్గర షంశగా అతనికి పొరుగూరినించి పారిపోయివచ్చిన కోడెదూడ దొరికింది. బాగా ఏపుగా పెరిగింది. అతను మురిసిపోయాడు. దాన్ని తెచ్చుకొని తన పాక ముందర కట్టుకున్నాడు. నాలుగు రోజులు దానికోసం ఎవరైనా వస్తారేమోనని చూశాడు. ఎవరూ రాలేదు. తనదీ అని ప్రత్యేకంగా ఒక వస్తువు దొరికినందుకు సంతోషించి ప్రేమతో దాన్ని పెంచుకున్నాడు. రెండేళ్ళగా పండగ పందాల్లో దానిదే విజయం. అదే అతనికి మహానందమూ, మహా



గర్వమూ. అదే మునయ్యకు మహాగ్రహమూ, మహావమానమూ.

అది భరించలేక అతనూ ఒక కోడెను సంపాదించుకున్నాడు. ఈ సారికి పందాల్లో తనూ పాల్గొనాలి. వీరిగాడ్ని ఓడించాలి. ఇదే ధ్యాస. మునయ్య కోడెదూడ నెందుకు తెచ్చాడో వీరన్నకు తెలుసు. అతనికి పుండు రేపినట్లయింది. తనమీద అంత పగ ఎందుకో మునయ్యకు? తనకు జీవితంలో ఏమున్నదీ? ప్రేమించి భారంవహించే తల్లిదండ్రులు, ప్రేమతో లాలించే భార్యా, ఇల్లూ, వాకిలీ, ఏమీ లేవుకదా! వెంకటయ్య దయతో ఒక పాకవేసుకుని తనని అనుకుంటున్నాడు. దారితప్పిన ఓ దూడను చేరదీసి తనదీ అనుకుంటున్నాడు. అంతేకదా! అంతకన్న ఏమున్నదీ? ఆ దూడ పందాల్లో గెలిస్తే కాస్త తానూ మనిషినేనని నలుగురిలో తలెత్తుకుని ఆనందిస్తున్నాడు : ఈ మాత్రానికే అసూయ దేనికో! ఇంతమాత్రం ఆనందానికికూడా తాను అర్హుడుకాడా! అతనికీ పౌరుషం వచ్చింది. ఈ సారి తనకోడె తప్పకుండాగెలవాలి. ఏంచేస్తాడేం మునయ్య! ఎల్లా గెలవదో చూద్దాం, అనుకున్నాడు. కోడెను మునుపటికన్నా బాగా మేపాడు. పైకి ప్రశాంతంగాఉన్నా లోలోపల పట్టుదలతో రగిలిపోయాడు. పందెంరోజు దగ్గర కొచ్చేకొద్దీ ఇద్దరిమధ్య ద్వేషాలు అవధులు అందుకున్నాయి.

పందెంపుల్ల నములుతూ, మునయ్య పందాలు గురించే ఆలోచిస్తున్నాడు. ఇంకా మూడురోజులేగా! ఈ లోగా ఇంకా బాగా తయారుచెయ్యాలి. అనుకున్నాడు.

లోపల్నుంచి అతని భార్య లక్ష్మి వచ్చింది. వాకిట్లో కల్లాపు చల్లడానికి. భర్తను చూసినప్పుడల్లా ఆమెకు కాస్త విసుగూ విసురూ ఎక్కువవుతాయి. ఆ విసురుతో ఆమెచల్లిన కల్లాపునీళ్ళు అరుగుమీద కూర్చున్న మునయ్య ఒంటినిండా పడ్డాయి. మునయ్యకు కోపంవచ్చింది.

"కళ్ళు కనబడడంలేదా?" అన్నాడు.

"అవును. ఇంకా నిద్దరమైకం వదల్లేదు" అన్నది లక్ష్మి వెటకారంగా.

మునయ్య ముఖం ముడుచుకున్నాడు. లక్ష్మి మళ్ళాఅన్నది.

"ఎందుకల్లా ఊరికే కూచుంటారు. లేచి ఏదైనా పని చూసుకోకూడదూ! మామగారితో పొలం పోరాదూ ? ఎంతసేపు ఆ కోడెదూడను చూసుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూ కూచుంటారు! ఆవీరయ్య మీద అంతకక్ష దేనికీ! మీరెంత ప్రాకులాడినా అతనిదూడే గెలుస్తుందిలెండి. ఈ ఏడూను." అని ఈసడిస్తూ.

మునయ్య మండిపడ్డాడు.

"నీ నోరు కాస్త కట్టిపెడతావా ? నీ సలహాలెవరూ అడగలేదులే! ఊరుకునేకొద్దీ' మాట సగంలో తుంచేశాడు కోపం పట్టలేక.

లక్ష్మి ముఖము కోపంతో జేవురించింది. పెడుతున్న ముగ్గు మానేసి అన్నది.

"ఏమో మీ ఇద్దరి హడావిడి నాకు నచ్చలేదు. ఒక్క ఆవరణలో ఒకే కుటుంబంగా ఉండి ఎందుకీ ద్వేషాలూ, పట్టుదలలూ? అంతగా అయితే మీరూ మీరూ పందాలు వేసుకొని కుస్తీలు పట్టుకోరాదూ! ఒక్కసారితో తేలిపోతుందీ. నోరులేని జీవాల్ని ఊరికే ఉసిగొల్పి ఎందుకూ చంపడం? ఏం పందాలో. ఏం ఆనందమో! నురుగులు కక్కుతూ అవి కుమ్ముకుంటూ వుంటే ప్రాణం ఉడికిపోతుంది" అని.

మునయ్య గట్టిగా నవ్వి పరిహాసంగా అన్నాడు. "పోనీలే! ఆంతకష్టంగా వుంటే నువ్వు చూడ్డానికి రావద్దులే! నిన్నెవరు రమ్మన్నారు! మహాసలహా చెప్పొచ్చావు. ఎక్కడైనా మనుషులకు పందాలు పెడతారేమిటి?"

లక్ష్మి విసుగ్గా జవాబుచెప్పింది. "ఎందుకు పెట్టగూడదూ? ఇదివరకు కోడెదూడలకు మాత్రం పందాలు పెట్టారేమిటి? ఒక ఏడాది ప్రారంభిస్తే, మరోఏడాదికి అదే ఆలవాటవుతుంది. అయినా నేనిప్పుడు మిమ్మల్నిద్దరినీ కుస్తీలు పట్టమనడంలేదు లెండి. అసలీ పోటీలూ, ద్వేషాలే వద్దంటున్నాను."

మునయ్య ఉషారుగా అన్నాడు. "నోరులేని జంతువు లంటున్నావు. అవెంత పట్టుదలతో పౌరుషంతో ఉడికిపోతున్నయో తెలుసా? ఒకరిపొడ ఒకరికి గిట్టడంలేదు. ఊరికినే బుసలుకొడుతున్నాయి."

లక్ష్మి పకాలున నవ్వింది. గొడ్లచావిడి వేపు చేయిజాపుతూ అన్నది వ్యంగ్యంగా.

"ఆహా! అటుచూడండి! ఎంతమంది పడుతున్నాయో! పచ్చరంగు అద్దాలు పెట్టుకుంటే లోకమంతా పచ్చగానే ఉంటుంది."


దూరంగా చెట్టుక్రింద రెండు కోడెదూడలూ ప్రశాంతంగా ఒకదాని నొకటి ఐరాసుకుపడుకుని గడ్డిపరకలు నములుతున్నాయి. మూతులు పైకెత్తి పలకరించుకుంటున్నాయి.

మునయ్య మాట్లాడలేదు. లక్ష్మి ముగ్గు పూర్తిచేసి గొడ్లచావిడి బాగుచెయ్యడానికి వెళ్ళింది. మునయ్య దంతధావనం ముగించి లేచి తన కోడెను దూరంగా మరొకచెట్టుకు కట్టుకున్నాడు. లక్ష్మి నవ్వుకుంది.

వీరన్న పండగరోజు పొద్దున్నే లేచి తన కోడెను తీసుకుని పొలం వెళ్ళిపోయాడు. అక్కడే దాన్ని అలంకరించుకున్నాడు. కొమ్ములకు రంగులుపూసి, పువ్వులు చుట్టి ముఖానికి పసుపుపూసి కుంకుమ పెట్టాడు. ఇంటిదగ్గర మునయ్య హడావిడికి అంతులేదు. దూడను రుద్దిరుద్ది కడిగి తుడిచి కుంకుమబొట్టు పెట్టి సింగారించాడు. ఆ రోజు అతనికి అన్నంకూడా పట్టలేదు. కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ ఉండిపోయాడు. వెంకటయ్యకు ఈ గొడవేమీ పట్టలేదు. ఏదో కుర్రతనం వాళ్ళ సరదాలు వాళవి అని ఉపేక్షగా ఊరుకొన్నాడు. లక్ష్మి మౌనంవహించి తన అయిష్టాన్ని లోలోపలే అణచుకుని ఊరుకొంది. మునయ్య తల్లి చంద్రమ్మ మాత్రం కొడుకుతోపాటు సంబరపడ్డది. మధ్యాహ్నం మునయ్య దూడను తోలుకొని పందాలకు పొరుగూరు వెళ్ళాడు. చూడ్డానికి కూడా చంద్రమ్మ వెళ్ళింది.

సాయంత్రం ప్రొద్దు వాలుతూఉండగా వెంకటయ్య పొలంనుంచి వచ్చి వేన్నీళ్ళ స్నానంచేసి కోడలు వడ్డించినది తిని మంచంవాల్చుకు పడుకున్నాడు. గిన్నెలు సర్ది మూతలుపెట్టి భర్తరాకకోసం, అత్తగారికోసం ఎదురుచూస్తూ కూర్చుంది లక్ష్మి. రాత్రి చాలా ప్రొద్దుపోయింది. ఊళ్లో సందడిలేదు. చాలామంది పందాలు చూడ్డానికి పక్కఊరు పోయారు.

వసారాలో వెంకటయ్య నిద్రపోయాడు. లక్ష్మికి కళ్ళు మూతలుపడుతున్నాయి. అంతలో చంద్రమ్మ మునయ్య వచ్చారు. మునయ్య ముఖం వెల వెల పోతోంది. వస్తూనే ఉసూరుమంటూ అరుగు మీద కూర్చున్నాడు. చంద్రమ్మ విచారంతో గబ



గదా చెప్పింది కోడలికి వార్తలు.

"రెండు కోడెలు ఎంత చక్కగా పోట్లాడాయి. చూడ్డానికి రెండుకళ్లూ చాలలేదు. మునయ్యా, వీరన్న ఉసిగొల్పేకొద్దీ మరీ మరీ శివమెత్తినట్లు కలియబడ్డాయి. ఏం లాభం! రెండింటికి మెడమీద బాగా గాయాలు తగిలాయి; రక్తం ధారలు కట్టింది. పాపం పడిపొయ్యాక మాత్రం ప్రేమతో ఒక దానినొకటి నాకుతూ ప్రాణాలు విడిచాయి. గెలుపూలేదు, మన్నూలేదు గాని రెండు ప్రాణాలు నిలువునా బలిఅయ్యాయి" అన్నది.

లక్ష్మి నిస్పృహతో నిట్టూర్చి కళ్ళు తుడుచుకుంది. చంద్రమ్మ అన్నం వడ్డించి కొడుకును పిలిచింది. మునయ్య మాట్లాడకుండా రెండుముద్దలు తిని లేచివెళ్ళి పడుకున్నాడు.

లక్ష్మి వీరన్నను తలుచుకుంది. ఏమైనాడో ఎంత బాధపడుతున్నాడో అనుకుంది. పక్క పాకలోకివెళ్ళి చూసింది: వీరన్న గోడకానుకుని చీకట్లో బొమ్మలా కూర్చుని ఉన్నాడు. లక్ష్మి ఉలిక్కిపడింది.

"ఎప్పుడు వచ్చావూ? చప్పుడే కాలేదే? రా. అన్నం తిందువుగాని" అన్నది ఆప్యాయంగా.

వీరన్న మాట్లాడలేదు. అక్కర్లేదని తల ఊపాడు. వాడికి లోపలా బయటా అంతా శూన్యం కమ్ముకున్నట్లుంది. దిక్కు తోచలేదు.

లక్ష్మి వెళ్ళిపోయింది. కాస్సేపటికి ఒక చేత్తో లాంతరు, మరొక చేత్తో కంచంలో అన్నం పట్టుకువచ్చింది. రెండూ వీరన్న ముందర పెట్టి ఎదురుగుండా చతికిలపడింది. నువ్వు తింటేనే గాని నేను కదలను అన్నట్లు. వీరన్న కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రెండు చేతుల్తో ముఖం కప్పుకుని ఏడ్చాడు. లక్ష్మి కళ్ళు తుడుచుకుంటూ అన్నది. "ఏం చేస్తాం వీరయ్యా. ఆ రెండు మూగజీవాలూ నశించేవరకు మీ ఇద్దరు అన్నదమ్ములకూ నిద్ర పట్టలేదు" అని.

అన్నదమ్ములన్న పదం విని వీరయ్య అదరిపడ్డాడు. అప్పుడే గుమ్మంలో విచారంతో అడుగు పెట్టిన మునయ్య ఆమాట విని విప్పారినముఖంతో లోపలికి వచ్చాడు. వీరయ్య కళ్ళు తుడుచుకుని అన్నం కలుపుకున్నాడు. లక్ష్మి సంతోషంతో లేచి తన చోటు మునయ్యకిచ్చి వెళ్ళిపోయింది. ●

● తాను చూచే ప్రతి చిత్రంమీదా "ప్రజాభిప్రాయం" రాసి, పత్రికలకు పంపటం అలవాటయిన, ఒక ఔత్సాహిక విమర్శకుడు-ఒక చిత్రంమీద ఈ విధంగా విమర్శ రాశాడు: ఈ చిత్రంలోని తారలందరూ అద్భుతంగా నటించిరి. సౌండు ఫరవాలేదు. దర్శకత్వంలో అచ్చటచ్చట లోపములున్నాయి, గాని ప్రశంసనీయం. ఫోటోగ్రఫీ నాకేమాదిరిగా యున్నది. కళ ఫరవాలేదు. ఎడిటింగ్‌లో లోపములు గలవు. సంభాషణలు మంచి పాకముగయున్నవి. సంగీతము కన్నులపండువగా యున్నది. ఈ చిత్రము రెండవదఫా చూడవలెనని అనిపించుచున్ననూ, చూచుటకు బాగుండును. కాని, ఏది ఎట్లున్ననూ. ఈ చిత్రంలోని స్టిల్స్ మాత్రం పూర్తిగా చెడిపోయినవి."

ప్రకటనలు చూసి
మోసపోకండి

అంతటా
దొంగలున్నారు
ఇంకెక్కడి
జాగ్రత్త!

నిన్నటి
భోజనము
ఇప్పుడు
తయారు!

అనుమతిలేనిదే
లోనికి రాకూడదు
లోనికి రానిదే అనుమతి దొరకదు

పొగ
త్రాగరాదు!
పీల్చవలెను!

ప్రయాణీకురాలి మెడలో బంగారపు
గొలుసులాగిన
బండి ఆగును



అవును. వారంరోజులుగా పగలూ రాత్రీ అనక ఆయన తిరగడం-ఆయనవచ్చేటంతవరకూ కళ్ళల్లో జ్యోతులు వెలిగించుకుని - వచ్చిన ఆయన కళ్ళల్లోనే వెళ్ళినపని తేలిపోతూ కన్పిస్తూంటే, శారదకు "యేమయిం"దనే ప్రశ్న వెయ్యవలసిన అవసరం వుండేది కాదు.

కాని, యీరోజు 'యేమండీ' వెనుక కొండంత ఆదుర్దా, ఆవేదనా పలికిస్తూ పలకరించింది. ఎల్లుండి యీపాటికి కూతురు సుగుణ, పసుపుబట్టలతో పతీసమేతంగా తమదగ్గరకు దీవెనలకోసం వచ్చే శుభఘడియలు కళ్ళలో తేలి కన్పిస్తున్నాయి- ఇంటినిండా బంధువులు - అయినవాళ్ళు కానివాళ్ళు వచ్చారు. దొడ్లో గాడిపొయ్యిమీద కాగే పులుసులోంచి ములక్కాడల వాసన - వుడుకుతున్న బియ్యం-వుద్రేకంగా - సముద్రపు నురగల్లా మూతలు తన్నుకు వస్తున్నాయి...."అమ్మా.... పచ్చడికి కొబ్బరికాయలు కావాలిట. ఆ గది తాళాలివ్వు" అంటూ వచ్చిన పెళ్ళికూతురు సుగుణ మౌనంగావున్న తల్లిదండ్రుల్ని చూసి మరేం మాట్లాడలేకపోయింది. "చినబామ్మ దగ్గర వున్నాయ్" అంది కూతురువైపు చూడకుండానే తల్లి. సుగుణ వెళ్ళిపోయింది. వచ్చిన మాట్లాడిన, వేగంలేదు తిరిగి వెళ్లేటప్పుడు. "నాకేం తోచడంలేదు" అన్నాడు దీనంగా సుబ్బారావుగారు. "అలా అంటే యెలా అత్తయ్యని పిలవనా" అంది శారద తనకి యేం తోచకపోవడంతో.

తనేం చెయ్యగలడు? ఇప్పటికి ముగ్గురాడపిల్లల పెళ్ళి చేశాననిపించుకున్నాడు. 'పరవాలేదు. పెళ్ళిళ్ళు వున్నంతలో ఘనంగా చేశాడని' చెప్పుకున్నారు బంధువులు. 'స్తోమతకు మించిన సంబంధాలు తెచ్చాడు పాపం - వంటలు చాలా బావున్నాయ్' అన్నారు వూళ్లోమిత్రులు. ఎవరు యెలా అనుకున్నా సుబ్బారావుగారు మాత్రం పది జన్మల అనంతరంకూడా ఆడపిల్లల నివ్వద్దని దేవుణ్ని ప్రార్థించాడు.

ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళ తరువాత చూసుకుంటే తాతలనాటి రెండెకరాల పల్లపు భూమి, భార్యమెళ్లో కంటే, కాసులపేరు - తనఖానుంచి అమ్మకంలోకి జారిపోయాయి. ఇవన్నీజరిగి ఐదేళ్ళుకూడా కాలేదు.

మూడేళ్ళక్రితం - సుగుణ కీరోజు పెళ్ళి చెయ్యాల్సివుంటుందని తెలిసినా-పెళ్ళి ఇంత కష్టతరమని, గుండెలమీద అగ్నిపర్వతం అవుతుందని గుర్తుకొచ్చినా, సుబ్బారావుగారు చాలా రకాలుగా సంపాదించేవారు.

రెండేళ్ళనాడు కాంట్రాక్టర్ వీరయ్య పదివేలు తనచేతిలో పెడుతూంటే, ఆత్మాభిమానం, నిజాయితీ పేరన తిరస్కరించేవాడు కాదు. ఆఖరిపిల్ల సుగుణని దత్తత ఇమ్మని పిన్నత్తగారు వస్తే, లేమిని మెత్తిపొడుస్తోందని బాధపడేవాడూ కాదు.

అసలు తనకి అనుమానా లెక్కువ.

బ్రతుకు కొందరినిజంటరూళ్ళమ్మట పొంది కైన అక్షరాల్లా నడిపిస్తుంది. తన బ్రతుకంతా నలిగిన కాగితంమీద వొకటో క్లాసు కుర్రాడి వ్రాతలాగే గడిచిపోయింది. కారణాలు యెన్నో వున్నాయ్. పెంచినవాళ్ళు రక్త సంబంధీకులు, ఆప్తులు, ఆఖరికి రూమ్ మేట్ అందరూ తను-తన్ని-నచ్చకుండావే ప్రభావం సంపాదించారు. తనకు వాళ్ళతప్పనిజానికి యెవరూ తెలియనూ తెలియరు.

ఎందుకో అంత అలసటలోనూ - మనోగ్లానిలోనూ అయనకు పద్మగుర్తుకువచ్చింది. తను బి. ఏ. ప్యాస్ అయినవారం తరువాత జరిగిన సంఘటన.

యథాలాపంగా అన్నగారితో కలసి బజారుకు వెళ్ళాడు. కాఫీ తాగి బయటకు వచ్చే లోపున యెవరో తెలియనివ్యక్తి వచ్చి అన్నయ్యతో నవ్వుతూ మాట్లాడి - ఆ తరువాత భుజాలు చరవడంవరకూ వెళాడు. మధ్య మధ్య తనని - నిలువుగా, వాలుగా చూడ్డం చేస్తున్నాడు. వాళ్ళ సంభాషణలు ఒక కొలిక్కిరాకపోవడంతో బయటకువెళ్ళి మిత్రులతో వుండిపోయాడు. కొంచెంసేపటికి అన్నయ్యా, ఆయనా బయటకువచ్చారు. "వెళతాను మరి. మా ఇంటికిరండి." అని అన్నయ్యతో అని "నువ్వూ రావోయ్" అన్నాడు తనతో.

ఎక్కడికో యెందుకో తనకి తెలియదు. అన్నయ్యతో బయలుదేరి వోయింటికి వెళ్ళాడు. అన్నగారూ, తనూ హాల్లో కూర్చున్నారు.

నలుగురైదుగురు ఆడవాళ్ళతలుపుపక్కలనుంచి, కిటికీవారలోంచీ చూడ్డం - వ్యర్థ ప్రయత్నంమీద ఆపుకుంటున్న మాటలు.

ఓ పదిహేనేళ్ళకుర్రాడు కాఫీలు తీసుకు వచ్చి ఇచ్చాడు. మరో ముసలాయనవచ్చి కుశలప్రశ్నలు వేయడం మొదలుపెట్టాడు. ఈలోపునే పెద్దావిడ వో పదహారేళ్ళఅమ్మాయిని తీసుకువచ్చి హాల్లో చాపమీద కూర్చోపెట్టింది. అన్నయ్య ఆ అమ్మాయిని యేవో అడుగుతున్నాడు. హోటల్లో కన్పించినాయనకూడా వచ్చి కూర్చుని తిరిగి యెత్తాలావునుంచి చదువువరకూ రకరకాలుగా ప్రశ్నల పరంపరలు కురిపించాడు. అన్నయ్య ఆమెని పేరేమిటని అడిగితే 'పద్మ' అంది తలెత్తి తనవైపు చూస్తూ.

తను చూశాడు. పేరులాగేవుంది. రెండు కాళ్ళూ ముడుచుకుని కూర్చుంది. పువ్వుల సిల్కు పరికిణీ కాళ్ళమీదకు జరుపుకునే ప్రయత్నం చేస్తోంది. చెవులరింగులు ఆగిపోయేముందు ఫేన్‌లా కదులుతున్నాయి. మనసులో వుల్లాసాన్ని, మాటలప్రవాహాన్ని ఆపాలని వృథాప్రయత్నంచేసే చిన్నినోరు. పట్టుతడిలో సువాసననూ నెలోకలిసి-పక్కపాపిడిమధ్య వొత్తైనజుట్టు ముదతలు పడ్డ ముఖమల్‌లా వుంది. చూడగానే కన్పించే కాటుకపెట్టుకున్న పెద్దకళ్ళు. వాటిమధ్య నించిచూస్తున్న - అరిగిపోయిన బాణం మొనలాంటిముక్కు. కంఠంనుంచి కోపంగా రెండువైపులా విడిపోయి జారిన నునుపయిన భుజాలు గుండ్రనయిన చేతులుగాదిగిపోయాయి. మెళ్లో వొకేవొక రెండుపేటల చంద్రహారం. సిల్కుకండువాలోంచి మెరిసే గుండెలఘామామావం. చీరకట్టుకున్న శిల్పంలా వుంది.

బయటకు రాగానే 'యెలావుందిరా' అని అడిగాడు అన్నయ్య. తన కదంతా కలలో జరిగినట్లు యథార్థంకాని భ్రమలా వుంది.

తను ఇంతత్వరగా పెళ్ళిచేసుకోవల్సి వుంటుందని - ఇలా వో అమ్మాయి తన ముందు కూర్చుని 'నీ భార్యగా - నాలో నీకు నచ్చిన అర్హతలు వెదుక్కో మంటుం'దని తెలియలేదు.

పెళ్ళిచూపులు.... మొదటకు యీ అనుభవం కొత్తదీ, రుచికరమయిందీ అయినా వూహించంది.తను కాదంటే.కాదు-ఇప్పుడు కాదంటే.—

పద్మ గుర్తుకొచ్చింది. ఇంటికి వచ్చిన తరువాత - అంతవరకూ వ్యతిరేకత ప్రదర్శించిన ఆలోచనలు-పరిమళాలుగా మారి-ఆ సువాసనలు యే పుష్పానివో తెలుసుకోవాలనే జిజ్ఞాసతో తిరగసాగాయి.

తను వుద్యోగం-భార్యా - పిల్లలూ-చిన్నయిల్లు-సాయంకాలం మెటినీలో రోజూ చూసే జంటల్లో తామూ వో జంటగా మారడం. పక్కనున్న భార్యకు అర్థంకాంది- తనకే అర్థంకాని భాషలో చెబుతూ ఆమె వొత్తైన జుట్టులో దాగిన నక్షత్రాలనీడల్ని వెదకడం - కళ్ళవెనుక సముద్రపు ప్రతిబింబం-కాదు అలల యెత్తు కొలవడం. ఆలోచనలు చాలాదూరం చెదరిపోతున్నాయి.

వదిన-తల్లి - అన్నయ్య - వొకటికి పదిసార్లు అడిగారు 'యెలావుంది అమ్మాయి' అని. వారందాటింది. అందరూ తిరిగి మామూలుగా వుంటున్నారు. అమ్మా-వదినా మాటలమధ్య పద్మగురించి తనని ప్రశ్నించాలని ప్రయత్నపూర్వకంగా వాళ్ళదగ్గరగా తిరిగేవాడు. వాళ్ళ యేగిన్నెల చప్పుడులోనో, కుంపటి విసరడంలోనో మునిగిపోయేవాడు.

ఆ రోజు పాలీస్ కార్నర్ బస్‌స్టాప్‌లో తనవెనుక క్యూలో దూరంగా వుంది పద్మ. ఆమెవెనుక స్నేహితురాలై వుంటుంది - భుజంమీద చెయ్యేసి మాట్లాడుతోంది.

ఆ రోజు అందంగా కన్పించాలని ప్రయత్నపూర్వకంగా నెగ్గిన పద్మ - యిప్పుడు - అప్రయత్నంగా మరింత ఆకర్షణీయంగా వుంది. ఆరోజు అందం బుద్ధిమంతురాలిలా తనముందు కూర్చున్నమూలంగా యీ ఆకర్షణ యేకళ్ళవెనుక తెల్ల తెరల్లోనో దాగి వుండి వుంటుంది.

మగవాళ్ళు గుర్తిస్తున్నారనుకునేటప్పుడు కంటే యథాలాపంగా వున్నప్పుడే స్త్రీలు అందంగా ఆకర్షిస్తారు. బస్‌స్టాప్ అని తెలిసినా తనకి మాట్లాడాలని అన్పించింది.

"మీరు" అన్నాడు అందుకే. ఆ అమ్మాయి గమనించలేదు. నిజానికి అప్పటికే వో సిటీబస్ వచ్చి ఖాళీలేదని చెప్పి వెళ్ళిపోవడంతో క్యూలో మనుష్యులందరూ నిరాశతో వంకరటింకరగా, గుంపులుగా విడిపోయారు. తనపిలుపు పద్మకు తప్పకుండా వినపడాలి.

"చూడండి"

"నిన్నేనే. ఆయనెవరో పిలుస్తున్నారు" అంది స్నేహితురాలు పద్మవైపు చూసి.

"యెవరూ" అని ఇటుతిరిగి చూసింది. తనవైపునుంచి చూపుని అరక్షణంలో స్నేహితురాలిమీదకు తిప్పి "నాకు తెలియదు ఆయనెవరో. నన్నుకాదు" అంది గట్టిగా, కోపంగా.

కావాలని ప్రయత్నపూర్వకంగా ఆ మాట పద్మ అందని తనకు తెలుసు. పద్మవైపు జాలిగానో కోపంతోనో చూసినట్టు - శరీరంలో యౌవనంలో విషాదమూర్తి ఆక్షణంలో ప్రవహింపచేసే గుర్తులేదు. జీవితంలో-ఆడ స్త్రీనోటివెంట అలాంటి మాటలు వినడం తనకు కొత్త. ఆ చూపులో కోతే కొత్త. మోసంచెయ్యడం-వ్యంగ్యంగా నవ్వడం, మాట్లాడటం, పళ్ళు బిగించి కళ్లు చిట్లించిచూడ్డం ఇలాంటి పనులు చేసేవాళ్ళంటే తనకుజాలి-అంతకుమించిన కోపం.

అయినా పద్మమాట-ఆమెనుంచి తన్ను తప్పించలేకపోయింది. తిరిగిచూశాడు. ఆమె చెప్పింది - మార్చుకుని కొత్తమాట అనాలనే ఆశతో.

బస్‌స్టాప్‌బోర్డు కిందనుంచుని తనవైపు చూపిస్తూ స్నేహితురాలితో ఏదో చెప్పి బిగ్గరగా నవ్వింది. చాలామంది ఆమెను చూశారు. అంతకు పూర్వంనుంచీ తమ ఇద్దర్నీ గమనిస్తున్నవాళ్ళేమో ఖైదీని చూసినట్టు చూశారు తనవైపు.

ఆనవ్వు తనలో అగ్నిపర్వతం రేపింది. అవమానప్రవాహమే తెచ్చింది. తీసుకువెళ్ళి అగాధాల లోయలో పడవేసింది.

అయినా మనిషిలో నిద్రపోయే మెతక భావం ఏదో వుంటుందేమో. అదే తనని ఆ పరిసరాలనించి దూరంగా తీసుకువెళ్ళింది. పద్మ నవ్వు వెంటాడుతూనే వుంది. నిద్రలో మెలకువలో-కలలో శతసహస్ర కంఠాలతో ధ్వనితరంగాలై తిరిగేది. ఎందుకో-పద్మతో పెళ్ళిగురించినమాటలు తిరిగి రేగుతాయేమోనని భయపడ్డాడు. ఆ నవ్వు గుర్తున్నంత కాలం, ప్రేమని జయించే ఆ నవ్వు- కాదు- ఆశను తననుంచి బలంగా వేరుచేసిన ఆ నవ్వు-తను పద్మను పెళ్ళిచేసుకోగలడా.

కాలం తనపక్షానేవుంది. శారదకూ పద్మకూ పోలిక లేకపోవచ్చు. శారద తన భార్యగా ఇన్నియేళ్ళజీవితంలో పద్మ తలపు రానీకుండానే సంసారం సాగించింది. అప్పుడప్పుడు కలలోవలె కన్పించే పద్మగుర్తులు శారద తన నడకతో - మాటలతో మైమరపించేది.

వాలుకుర్చీలో పడుకున్న సుబ్బారావుగారి మెదడు ఆలోచనలనుంచి విశ్రాంతికి పయనించింది. నవ్వొచ్చింది చిన్నగా. ఎల్లుండి పుదయం కూతురుపెళ్ళి పెట్టుకుని- తను యెదుర్కోవలసిన సమస్యలు కొండలన్నివుండగా యీ గతతార్కికమేమిటి. బంధువులు, మగపెళ్ళివారు అందరూ వచ్చారు. పెళ్ళి పందిట్లో తను కట్నం యివ్వకపోతే యేంజరుగుతుంది. ఇంతవరకూచేసినప్రయత్నాలన్నీ వ్యర్థమౌతూనే వచ్చాయి. "క్షమించండి కట్నం త్వరలో సర్దుబాటుచేస్తా"నంటే సానుభూతిచూపేవాళ్ళ సంఖ్యకంటే నవ్వేవాళ్ళజాబితాఎక్కువుంటుంది. ఆ తరువాత సుగుణపెళ్ళి అవుతుందా? వియ్యంకుడు శేషగిరిరావుగారిని వెళ్ళిప్రాధేయపడితే? కన్నీళ్ళతో కాళ్ళయినా కడగాల్సిన సమయంయిది. వుహూ, ఆయన భార్యచేతిలో కీలుబొమ్మని చెప్పుకుంటారు. వియ్యపరాలు మహాగడసరి అని వుదయం నుంచీ శారద చెబుతూనేవుంది. ఆ అన్నట్టు వియ్యపురాలిపేరు పద్మావతిట. పద్మ!

ఆయనలో ఆలోచనలు తిరిగి కెరటాలు వేశాయి. ఆవిడ రూపంవచ్చి కళ్ళముందు నుంచుంది. సుబ్బారావుగారు వాలుకుర్చీలోంచి నడుంలేపి కూర్చున్నాడు.

అవును. అదేరూపం. కళ్ళలోకాంతి కొంచెం పళ్ళలోకలిసింది. యవ్వనాన్ని జయించిన కౌమారం. అయినా అందం తాలూకు గుర్తులు శరీరం నలుమూలలా - గాయపడి గుర్తుకోసం బలవంతంగా వోపిక తెచ్చుకుని మూలిగేసైనికుడి ప్రయత్నాల్లా వున్నాయి. పద్మని వయసు పద్మావతిగా మార్చివేసినట్టుంది. బహుశా నలభైపైనే వుండచ్చు వయసు.

అయితే పద్మావతి తన్ను గుర్తుపట్టిందా. ఆయనకు కంగారుకలిగింది. ఏనాడో యెవరికీ అర్థంకాకుండా కారణాలు తెలియకుండా విడిపోయినమనిషి. మనసు వ్యతిరేకించిన రూపాన్ని భగవంతుడు బాంధవ్యంరూపంలో దగ్గరచేస్తున్నాడేమో. ఒకవేళ ఆ పద్మ ఈ పద్మావతిగారు కాదేమో. అయితే?

"అలా కూర్చున్నావేరా భోంచెయ్యవా" తల్లి వచ్చింది.

"వాళ్ళంతా కూర్చున్నారు. మిమ్మల్ని అడుగుతున్నారు" వెనకవచ్చిన శారద అంది.

"అమ్మా! యింతకీ యేం చేద్దాం.... నాకేం తోచడంలేదు...."

" మా వియ్యపురాలు వచ్చింది.... మనసు ఆగింది కాదురా బాబూ....ఆవిడని చూస్తే-పార్వతీదేవిలా వుంది... నేనూ యిదీ కలిపి చేతులు పట్టుకుని గట్టెక్కించమని అడిగేశాం...". తన్ను మాట్లాడనివ్వలేదు శారద.

"రాజమహేంద్రవరం వెళ్ళిన మనిషి యింతవరకు రాలేదు... సమయానికి అందుతుంది, అందకపోతుంది..పీటలమీద గొడవ రాకుండా వుండడంకోసం...."

"మీకేమన్నా మతిపోయిందా....డబ్బు లేదని కాబోయే వియ్యపురాలిదగ్గర యేడ్చిపోయారా.."



"చావుందిరా..నువ్వేం మాట్లాడవాయే.. ఆడపీనుగులం మా దిగులు నీకేం తెలుస్తుంది..."

"వాళ్ళిప్పుడు పెళ్ళొద్దని లేచి చక్కాపోతే..యింతకన్నా చావు నయం.."

సుగుణ వచ్చింది యీ గందరగోళం లోకి..ఆ అమ్మాయి చూపులే - అడుగుల ధ్వనే ఆయన్ని ఆవేశంలోంచి వాస్తవం లోకి తెచ్చాయి.

" నాన్నా..పద్మావతమ్మగారు నిన్ను విడిదికి రమ్మని కబురుచేశారు.."

ఆయన తువ్వాలు భుజంమీద వేసుకుని-వో సారి భార్యనీ తల్లినీ చూసి బయటకు నడిచాడు.

గ్యాస్ లైట్ వెలుతురులో మామిడి తోరణాలు నిద్రరాక అలజడిచేస్తున్నాయి. పందిరి రాటల్ని కొబ్బరాకులు కౌగలించుకుని తాదాత్మ్యం పొందుతున్నాయి. అరుగుల మీదనుంచి సగం జారిన జంపఖానాలమీద



కుర్రాళ్ళు నిద్రపోతున్నారు. ఓ మూల అలంకారాలు తీసేసిన అతివలా పల్లకి... వీధి గదితలుపులు వోరగా వేసి లోపల యెవరో పేకాట ఆడుకుంటున్నారు. సావడిలో ఆడవాళ్ళు చెల్లాచెదరయిన కదంబం దండల్లా నిద్రపోతున్నారు. పక్కన గది.

"రండి" అంది వియ్యపరాలు..మడత మంచంమీద కూర్చున్న చోటనుంచి మర్యాద చిహ్నంగా జరిగి కుర్చీ చూపిస్తూ.

ఆయన అందులో కూర్చున్నాడు.

"భోజనం చెయ్యకుండా వచ్చేశారేమిటి"

"లేదు.."

"అంటే భోజనం చెయ్యలేదనా..నా మాట కాదనా.?" పరకాయించి చూస్తున్నాడు సుబ్బారావుగారు.

ఎర్రరంగు చీరలో ప్రకృతికి భయపడి పారిపోయి వచ్చి దాగిన సంధ్యాదేవిలా వుంది పద్మావతి. తెల్లటి గ్లాస్కో రవిక జబ్బలమీద వయసు చేసిన యెత్తు పల్లాల్ని దాచలేకపోతోంది. తలలో వెన్నెల్ని మింగాలని ప్రవేశించిన మబ్బురేకల్లా అక్కడక్కడ నల్ల వెంట్రుకలు. పల్చబడి జారిన చెవులకు యెర్రటి యేడు పొళ్ళ దుద్దులు... చెమటతో తడిసినమూలంగా దశమిచంద్రుడిలాంటి బొట్టు...

"ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యడంలో చాలా యిబ్బందులు వున్నాయి. మా పిల్లల పెళ్ళిళ్ళకి - యిన్ని అవస్థలూ మేమూ పడ్డాం.." ఎందు కివన్నీ చెబుతుంది యీావిడ...

"విడిది కొంచెం యిరుకు గానీ బాగానే వుంది. సాయంకాలం గాలి చూసి వర్షం వస్తుందేమోనని భయపడ్డాను, నాకు వర్షం అంటే భయం."

"పెళ్ళిళ్ళరోజుల్లో వర్షం వస్తే యెంత చేస్తే రాణింపు వుంటుంది?. మీకు అన్ని సదుపాయాలు నచ్చేటాటుగా వున్నాయాండి?." సుబ్బారావు అన్నాడు.

ఆవిడ అంది.." దానికేమిటిలెండి. మీ వాళ్ళంతా బాగా కంజాయింపు తెలిసిన మనుష్యులు. యెంత అందంగా వుంటారో మనసూ అంత నిర్మలంగానూ అనిపిస్తుంది మాటలు వింటూ వుంటే..." ఆగి అంది.

"మా కోడలు బాగానే వుంది. పెళ్లిచూపులరోజున యేమో అనుకున్నాను..ఆడపిల్లకి తండ్రిపోలిక రావడం అదృష్టం అంటారు" క్షణం ఆగి, "అదేమిటి మాట్లాడరేం" అని-తిరిగి "నేను గుర్తు వున్నానా" అంది గమ్మున.

నిశితంగా చూస్తున్న సుబ్బారావుగారు "మీరూ" అన్నాడు.

అవును. ఆ శరీరంమీదనుంచి పాతిక సంవత్సరాల్ని - అనుభవాల్ని - తొలగించి చూస్తే వాటికింద - ఆరోజు తనముందు చాపమీద కాళ్ళు ముడుచుకొని కూర్చున్న పద్మ కన్పిస్తోంది.

తనా వయసులోకి వెళ్ళలేకపోతున్నాడు. వెళ్ళకూడదనుకున్నాడు గట్టిగా లోపల ..తెలుసునని చెబితే యిద్దరికీ నష్టంలేదు. వో వయసులో భయాలు వార్థక్యంలో స్వేచ్ఛని పొందుతాయి. అయినా తనిప్పుడా పరిస్థితిలో లేడు. అందుకే నెమ్మదిగా "గుర్తు రావడంలేదు" అన్నాడు.

"పద్మని" అంది పద్మావతిగా మారిన పద్మ.

"నేను మిమ్మల్ని గుర్తు పట్టలేకపోయాను." అబద్ధం ఆడడం అవసరం అనిపించింది.

"పోనీలెండి..నేను గుర్తుచేస్తే జ్ఞాపకం వచ్చాంనా"

"వూ"

"శారదాంబ చాలా బావుంటుంది... చిన్నప్పుడు యింకా బావుండివుండాలికదూ" అంది దూరంగా యెవరికీ చెప్తోన్నట్టు... వెంటనే చూపు కిటికీ వైపు తిప్పి.

శారదాంబ..శారదను తనిన్ని రోజులుగా ఆ పేరుతో వూహించి చూడలేదు. నవ్వొచ్చింది. అలా పిలవాలని హెచ్చరికలా వుంది.

వయసుముదిరిన గోదుమవన్నెతాచు-చుట్టుకుని పడుకున్నట్టుగా వుంది సిగ. ఆ సిగలో మల్లెలూ కనకాంబరాలూ కలిసిన దండ,

"ఇలా కూర్చుంటే చిన్నప్పటి రోజులు గుర్తొస్తున్నాయి. మీరు మద్రాసునుంచీ వెంటనే వచ్చేశారా"

రెండు ప్రశ్నలమధ్యా అగాధాల తేడా వుంది. ప్రళయం పుట్టే సముద్రంలోంచి ప్రశాంతమయిన లోయలోకి - ప్రవాహం దూకినప్పుడు కలిగే అలసటలోని ఆనందపు నిట్టూర్పు—ఆకాశంనుంచి అప్రయత్నంగా కాలుజారిన నక్షత్రం ఆ క్రిందను రెండింటినీ సోకే స్వరంతో ఆవిడ మేళవించింది.

"అప్పుడే వచ్చేశాను" అన్నాడు. ఆవిడ మాటల ప్రభావం తన మెదడుమీద తెచ్చిన పరిణామాన్ని తెలుసుకోలేక శరీరం చిన్నరకం మగతను తింటోంది.

" మిమ్మల్నెందుకు కబురుపంపించానో చెప్పలేదు. ఇప్పుడే వస్తాను" లోపలికి వెళ్ళి - వెళ్ళినంత త్వరగా వచ్చింది. చేతిలో చిన్నసైజు బేగ్ వుంది.

"ఇది శారదాంబగారికి యివ్వండి. కాదు లెండి తెరిచి చూడండి. దారిలో మాత్రం తెరిచేరు సుమా. నన్ను చంపుకు తిన్నట్టే మరి"

"అసలేమిటి యిది...."

"మిఠాయి" అంది నవ్వుతూ. ఆ నవ్వులో చిలిపితనంలేదు. సాదాగా నవ్వింది." దారిలో చూడరుగా. వట్టేనా"

"మరి వుంటాను."

"అదేమిటి — వుంటానని చెప్పి వెళ్ళి పోతున్నారు. ఆ. నాకు జవాబు చెప్పేరు కాదేం."

ఆలోచనగా చూశాడాయన. ఆవిడలో భావం దొరకని నవ్వు. పాతికేళ్ళక్రితం నవ్విన నవ్వులాంటిది అనిపించని నవ్వు-మందినవ్వు-వెన్నెలలాంటి నవ్వు.

"అదే. శారదాంబగారు చిన్నప్పుడు యెలా వుండేవారో" ఆయనకు మాటలు దొరకలేదు. చేతిలో అనూహ్యమైన రహస్యాన్ని దాచుకున్న సంచీ. శరీరాన్ని ప్రశ్నార్థకాలతో, ఆశ్చర్యార్థకాలతో స్నానం చేయించే నవ్వు. ఆయనకీ నవ్వొచ్చింది.

"రేపు దాన్నే అడగండి" అన్నాడు బయటకు నడుస్తూ.

"చాల్లెండి." అంది వెనుక నవ్వుతూ పద్మావతి.

గదిలోకి ఆత్రుతగా వెళ్ళాడు. సంచీ తెరిచాడు. వూహించందీ - ఆలోచించలేనిదీ చూశాడు. ఆ క్షణంలో భగవంతుడి దర్శనమయినా ఆశ్చర్యపడడేమో ఆయన.

మనిషి భగవంతుణ్నే మించిపోతాడని కథల్లో చదివినప్పుడు అబద్ధానికి నవ్వుకున్నా - యీ రోజు ఆ సత్యం - యీ విధంగా ప్రాణంపోసుకుని యెదురవుతూంటే నిజమే అనిపిస్తోంది. అందులో వున్నది డబ్బు. బహుశా రెండువేలుండచ్చు. సుగుణ పెళ్ళికి తనివ్వవలసిన కట్నం. బయట అడుగుల చప్పుడు విన్పిస్తోంది. శారదేమో. పద్మావతి మాటలు గుర్తుకొచ్చి నవ్వుకున్నాడు. శారదను తనెందుకు పిలవలేదు. యే రహస్యం యిందులో వుంటుందని తను భయపడ్డాడు?

నిజానికి పద్మావతికూడా మనస్ఫూర్తిగా ఆ మాట అనుండదని దారిపొడుగునా చర్చిస్తూనే వచ్చాడు. "భార్యకుకూడా చూపకండేం" అనే మాటల్లో "రహస్యం మీ రొక్కరే చూడాలి సుమా" అనే ధ్వని కల్పించుకున్నాడు దారిలో.

"దేనికండి-ఆవిడ కబురు పంపుతా."

డబ్బును దాచిపెడుతూ అన్నాడు ఆయన."వట్టినే యేదో ఆవిడా, భర్తా కబుర్లు చెబుతూ కూర్చోపెట్టారు"

"బాగా మాట్లాడింపా ఆవిడ"

"ఏం నన్ను తిట్టి పోస్తుందనుకున్నావా" అంతలోనే ఆయన స్వరంలో గర్వం తలెత్తింది. అది ప్రేమించిన మగవాడు. ప్రేమించబడ్డ పురుషుడు ఆ ప్రేమగురించి ఉన్నత వూహల్లో వూరేగేటప్పుడు కలుగుతుంది. స్త్రీ తలపు తీయని గుర్తులు - ఆడది గుర్తుచేసినప్పుడు గుండెల పొదుల్లో పూసిన గుమ్మడి పూలశోభ అది.

పెళ్ళయిన వారం తరువాత శారద భర్తకు భోజనంలోకి పెరుగు వడ్డిస్తూ అడిగింది.

"వో సంగతి అడుగుతాను నిజం చెబుతారా"

"వూ"

"వియ్యపురాల్ని చిన్నప్పుడు మీకిస్తామన్నారుటగా"

"వూ"అని తలెత్తి "నీకెవరు చెప్పారు" అన్నాడు.

మనుగుడుపుల రోజుల్లో ఆవిడే మాటల్లో చెప్పింది.

"వుహూ?"

"మరెందుకు చేసుకోలేదు."

"అది ఆవిడ చెప్పలేదేమిటి"

"చెప్పింది. మీరు మొదట కట్నం దగ్గర పేచీపెట్టి - దానికీ వాళ్ళు సరేనంటే- తిరిగి మీకు ఆవిడ నచ్చలేదన్నారుటగా"

"యేమిటీ" కొత్తగా అడిగాడు. ఆవిడ తిరిగి చెప్పింది.

"నేను నచ్చలేదన్నానా"


"అవును. కొంచెం బొంగురు కంఠం అనీ. మెల్లకన్ననీ - యేవో లేని వొంకలు పెట్టారుటగా. అయినా తెలియక అడుగుతానూ" నవ్వేసి తిరిగి ఆపుకుంటూ, "ఆవిడకేమండీ యీ వయసులోనే బావుంది. చిన్నప్పుడు మరీ బావుండి వుంటుంది. అయినా మీరుపెద్దబాగున్నట్టు. పెళ్ళిరోజుల్లో సన్నగా నల్లగా వుండేవారు. అందరూ నన్నేడిపించుకు తినేవారు తెలుసా" అంది శారదాంబ. గతంలోకి వెళ్ళి తిరిగి వాస్తవంలోకి నవ్వుతూ వచ్చి, "కొంచెం పెరుగు వడ్డించేదా" అంది.

ఆయన వాస్తవంలోంచి వూహలోకి, వూహలోంచి గతంలోకి ప్రయాణం చేశాడు. ఏరోజూ యీ సంఘటన జరిగిన గుర్తులేదు. మరి పద్మావతి యెందుకనివుంటుంది.

పద్మ తనని చూసి నవ్విన రోజు ముందు-వారంక్రితం - అన్నయ్య వాళ్ళ గుమ్మంలో కన్పిస్తూ వుండేవాడు. ఆ క్రితంరోజు వరకూ పెళ్ళిప్రస్తావన తెచ్చే అన్నయ్య అప్పటి నుంచీ మౌనం వహించాడు, పద్మావతి బాగుండకపోవడం, మెల్లకన్ను. యివన్నీ యెలా సృష్టిజరిగాయో ఆలోచించేకన్నా ఆరోజు బస్‌స్టాప్‌లో పద్మ నవ్వును గుర్తు చేసుకుంటోంది- మెదడు. పాపం పద్మ నవ్వడంలో తప్పులేదు అనుకున్నాడు ఆఖరిసారిగా,

నవ్వుకు కారణం యిన్ని సంవత్సరాల తరువాత అర్థమయిన-విలువయిన -క్షణంలో ఆయన పొందనిదానికి సహజమైన నిట్టూర్పు - ఆ తరువాత యేదో అర్థమయినట్టుగా వేదాంతలీల ఛాయగా మెదుల్తూ పెదాల మధ్య వింతభావాల హాసరేఖ పుట్టాయి.

శారద చీర కుచ్చెళ్లు అటూ యిటూ కదుల్తున్నాయి. కాదు పద్మావతి అన్న శారదాంబగారి చీర కుచ్చెళ్లు. ఈసారి పైకి నవ్వాడు. శారదాంబగారు అర్థమవక భర్తకేసి చూసింది.



ఇద్దరు చైనీస్ సైనికులు



దండమూడి మహీధర్

భారతసైనికుని తుపాకికి గురిఅయిన చైనీస్ సైనికుడు గాయపడి కింద పడిపోయాడు. ఇక ఆటేసేపు జీవించడని భారత సైనికునికి తోచింది.

చైనీస్ సైనికుడు ఎలాగూ మరణిస్తున్నాడు - అతని చివరికోరిక ఏమిటో తెలుసుకుందామని భారత సైనికుడు అతన్ని సమీపించి- 'మంచి నీళ్ళుకావాలా?' అని ప్రశ్నించాడు.

అక్కర్లేదని తల వూపాడు.

'అన్నం కావాలా?'

అక్కర్లేదని చెప్పాడు.

భారతసైనికుడికి అతగాడి ఆఖరికోరిక యేమిటో అవగతంకాక తికమక పడ్డాడు.

'నల్లమందు కావాలా?' అని మళ్ళీ అడిగాడు నవ్వుతూ!

'కావాలి! కావాలి!!' అన్నాడు ఆదుర్దాగా!

"ఇప్పుడు నువ్వు చనిపోవడానికి సిద్ధంగా వున్నావు. నల్లమందు ఎందుకయ్యా?" అని ప్రశ్నించాడు భారత సైనికుడు.

తడబడుతూ చైనీస్ సైనికుడు— 'నాకు నల్లమందే కావాలి!' అని అన్నాడు.

"ఇప్పుడు తింటావా?"

"ఉహుఁ! తినను!"

మరల తడబడుతున్న గొంతుతో — "నా వెంట తీసుకెడతాను!" అని అన్నాడు.

భారత సైనికుల చేతికి చిక్కిన చైనీస్ సైనికుడికి — పిల్లి అరవటం విన్పించింది: 'చ్యావూఁ.... చ్యావూఁ.... మ్యావూఁ! మ్యావూఁ!"అప్పటిదాకా దిగాలుపడినమొహంతో వున్న చైనీస్ సైనికుడి మొహం ఒక్కసారిగా విప్పారింది. పక్కనవున్న భారత సైనికుణ్ని వుద్దేశించి - "చూశావటయ్యా! మీ పిల్లులకు మా నాయకులు చౌ ఎన్ - లై, మావో సె టుంగ్ అంటే ఎంత యిష్టమో? ముద్దుగా 'చావూ' మావూ' అంటున్నాయి" అని అన్నాడు.

అతగాడి మాటలకు భారతసైనికుడు నవ్వి — "ఆ పిల్లితోక పుచ్చుకుంటే — నీ పేరుకూడా చెబుతుంది.

చైనీస్ సైనికుడు ఒక్క అంగలో వెళ్ళి పిల్లితోక నిజంగానే పుచ్చుకున్నాడు.

ఆ పిల్లి కాస్తా గాబరాపడి - కొంచెం దీర్ఘంగా - 'మీయాంగ్ - మ్యాం....గ్.... మింగ్....అని అరవడం సాగించింది.

చైనీస్ సైనికుడు సంతోషంతో ఎగిరి గంతేసి - "ఏమయ్యోయ్! మీ పిల్లికి నిజంగానే నాపేరు తెలిసిందినాపేరు మియాంగ్-షన్- మింగ్!" అని అన్నాడు.

"ఆపిల్లి నోట్లో వేలుపెడితే మీనాన్న పేరుకూడా చెబుతుంది." అని భారతసైనికుడు ఎగతాళిగా అన్నాడు.





చైనీస్ సైనికుడు అలాగే చేశాడు. పిల్లి విధిలేక 'మియావూ' 'మియావూ' అని అరవసాగింది.

చైనీస్ సైనికుడు సంతోషం పట్టలేక— "అవునవును మా అమ్మ మా నాన్నను ముద్దుగా యిలాగే పిలుస్తుంది! అని అన్నాడు—'అవునుగాని బ్రదర్! మీ పిల్లికి మా కుటుంబంలోని పేర్లన్నీ ఎలా తెలుసు?' అని ప్రశ్నించాడు.

"అవునయ్యా! కుటుంబంలోనివాళ్ళ పేర్లు కుటుంబంలోని నాయనమ్మలకూ, అమ్మమ్మలకూ తెలియకపోతే మరింకెవరికి తెలుస్తాయి?" అని భారత సైనికుడు అన్నాడు.

చైనీస్ సైనికుడికి కోపం వచ్చింది:

"అంటే ఈ పిల్లి నాకు నాయనమ్మో, అమ్మమ్మో అవుతుందంటావు! కానేకాదు." అని అన్నాడు. మొహం యింత జేసుకొని!

'అయితే ఈ పిల్లి కూన సాక్షాత్తు నీ మాతృదేవి అయి వుంటుంది!' అని అన్నాడు భారత సైనికుడు నవ్వుతూ. చైనీస్ సైనికులలో ఒకడు "అదేంమాట?" అని గింజుకుంటున్నాడు.

భారత సైనికులలో ఒకడు అన్నాడు గదా: "పిల్లి కళ్ళుమూసుకుని పాలు తాగుతూ లోకం చూడలే దనుకుంటుంది. మీరు కూడా మా సరిహద్దుల్ని దాటుతూ లోకంలో మరోరకంగా ప్రచారం చేస్తున్నారు. మీరు కళ్ళు మూసుకున్న పిల్లులని ప్రపంచరాజ్యాలన్నీ కళ్ళుమూసుకుంటాయనుకుంటారా ఏమిటి?"

"జ్యోతి" సంపాదకవర్గం
సమర్పించు నిశ్చలన చిత్రం

మండువెండలో మంచి కల

[ఎ మిడ్ సమ్మర్ డేస్ డ్రీమ్]


ఫొటోగ్రఫీ — భూషణ్

నటీనటులు — సుజాత, శోభన్‌బాబు

మాటలు, పాటలు — దాశరథి

వీరందరిని అడయారులో లొకేషన్ షూటింగ్‌కి కారులో తీసికెడుతూ	డైరెక్షన్ చూపినది	వి. ఎ. కె. రంగారావు
ఫలానా ఫొటోలో బ్యాగ్రౌండ్ ఇక్కడికి కట్ చెయ్యాలని	ఎడిటింగ్ చేసినది	ముళ్ళపూడి వెంకటరమణ
నాకు చూపించకుండా ఫొటోలు బెజవాడ పంపేశారా అని	నృత్యం చేసినది	రావి కొండలరావు

[ఈ నిశ్చల చిత్ర నిర్మాణంలో పాల్గొని సహకరించిన సుజాత ("భీష్మ" ఫేమ్), శోభన్‌బాబు (చదువుకున్న అబ్బాయి) లకు "జ్యోతి" కృతజ్ఞత.]




పల్లె, పట్నం వచ్చాయి
చెట్టునీడలో కలిశాయి



ప్రేమోపహతుండు పోవుకడకున్
పోదుర్ గదా ప్రేమికల్



పిల్లకి చెలగాటం
పిల్లాడికి ప్రాణసంకటం



కొడవలితో కోమలాంగి
మెడకోయునో, ప్రేముడివేయునో



తీరని దాహం
తీరే సమయం ?



ఇదిగో దాహం
ఏలా సందేహం



దగ్గరవుండీ దూరాలే.
కలిసీ కలియని తీరాలే.



ఒకటే బొండం కోసము
పోటీయే సంతోషము.

ముగ్గురు గుమాస్తాల కథ

[ఆమెతో నలుగురు]



రాచకొండ విశ్వనాథశాస్త్రి

కలెక్టరాఫీసులో కస్పీలు దొరకని సెక్షన్లో పని చేస్తూన్న రవి, "రవికాను, నాపేరు శని" అని తరుచుగా సరదాగా అంటూంటాడు. అతను దుఃఖానికి నవ్వుపూతలు పూసుకోగలడు.

ఓ నెల పదోతారీఖున పొద్దున్నే ఆరుగంటలకి ఇంకా మంచంమీద పడుకొ్కని గాఢనిద్రలో లేని రవిని అతని భార్య గట్టిగా తట్టి లేపి, పక్కన కూర్చొని, అతనికి అసలు విషయం గుర్తు చేసింది.

"ఈ పూట ఎక్కడికైనా వెళ్ళి ఎవరి దగ్గిర్నించైనా ఎలాగైనా తలైనా తాకట్టు పెట్టి ఓ పాతిక పట్టుకొస్తా౯ వన్నారు. గుర్తుందా? మరంచేత, లెండి మరి. వేగిరం లెండి. లెండి. బాబూ లెండి వేగిరం లేచి వెళ్ళి మీకీరోజు ఆ సొమ్ము తేకపోతే నేను మరింక ఈ కాపరం చెయ్యలేను. ఒక్క నిమిషం మరింక బతకలేను. ఆ ఇంటావిడ మళ్ళీ వచ్చిందంటే - ఇప్పుడే చెప్తున్నాను. నామాట నమ్మండి— నే నివాళ ఉరిపోసుకు చస్తానేకాని మరి బతకను. దాన్తోపాటు, దాని మేనల్లుట. వాడు కూడా వస్తాడు. మీరేమో ఆఫీసుకి వెళ్ళిపోతారు. చిట్టిగాడు- స్కూలికి వెళ్తాడు.

నేనూ పాపా బిక్కుకూ బిక్కుకూ మంటూ
కూర్చుంటాం. సరిగ్గా మధ్యానం అయేసరికి
మేనత్తా మేనల్లుడూ తిన్నగా గదిలోకి,
అడగనైనా అడక్కుండా ఒచ్చేసి, ఇదిగో
ఈ మంచంమీదే ఈ పక్కమీదే దదా
యించి కూర్చొని "తే అద్దె తే" అంటూ
గంటదాకా కదల్రు. తలుపు లేసేస్తే తీసే
దాకా దబదబ బాదేస్తారు. ఆ మేనల్లుడు
నోళ్ళయినా విప్పడు. వాడు మాట్లాడు కాని
వాడి నవ్వూ వాడి చూపూ చూళ్లేదు
మీరు. వాణ్నలా చూస్తుంటే వాణ్ని
పొడిచి చంపేయాలనైనా అనిపిస్తుంది.
లేకపోతే, అది చెయ్యలేనప్పుడు. పొడు
చుకు చావాలనైనా అనిపిస్తుంది. నిన్న
మధ్యానం వాళ్ళొచ్చేవేళకి పక్క చుట్టేసి
మంచం ఎత్తేసి దానిమీద నా బ్లూ చీరె
ఆరేసి నేను పెట్టెమీద కూర్చొన్నాను. నా
కర్మ కాలిపోయి వాళ్ళొచ్చేసరికి ఆ చీరె
ఆరిపోయింది వాడు తిన్నగా ఒచ్చి ఆ
చీరె తీసి, మంచం వాల్చుకుని దానిమీద ఆ
చీరె పరుచుక్కూర్చున్నాడు. నెత్తిమీద
నిప్పుల కుంపటి కుమ్మరించేసి వాణ్ని
నిలువునా కాల్చేద్దా మనిపించింది—చేతకాని
కోపం ఎంతొస్తేమట్టుకు ఏం లాభం?- నేనా
చీరె పుటం పెట్టినా మరింక కట్టుకోలేను.
వాళ్ళ డబ్బు వాళ్ళ మొహాన్న పారేస్తే
గాని నేను మరింక బతకజాలనుగాక బతక
జాలను. ఈ అవమానాలు నేను భరించ
లేను. భరించలేను. నిన్నరాత్రి మంచం
మీద పడుకోక్కుండా చాపమీద ఎందుకు
పడుక్కున్నానని మీరంటే నేనేవీ చెప్ప
లేకపోయేను. పెదివె కదిపితే ఏడుపులో
మునిగిపోదు నన్న మాట. మంచంగురించీ
చీరెగురించే కాదు. నిన్న ఆ ఇంటిది ఏం
వన్నదో చెప్పడానికి సిగ్గేసి ఒళ్ళు చచ్చి
పోయి మీకో చెప్పలేకపోయేను. "అమ్మా!
ఆడదాన్ని నన్నిలా హింసించడం బావుం
దా?" అన్నాను. అంతే అన్నాను. దానికి
ఆవిడ ఏం వందో తెల్సా? తబ్బుకొంటే
నా మనసంతా మరిగిపోయింది. ఆపలేని
దుఃఖం ఒస్తోంది. మనం ఎవరియెడల ఏ
పాపం చేసేం? ఏ పాపాలైనా చేసేవాం?
చేస్తే, తెలీక చేసేవేమోగాని తెలిసీ చెయ్య
లేదుకద. కాని, తెలిసీ తీరి కూర్చుని ఇంత
మంది నిరపరాధుల్ని అంతమంది ఇలా ఈ
విధంగా హింసిస్తుంటే, పట్టపగలు పది
మంది యెదటా ఇంతలేసి అన్యాయం ఇలా
జరుగుతూంటే లోకం ఇంకా ఎందుకు
మండి మసై పోడంలేదో నాకు తెలీడం
లేదు. ఇన్ని దుఃఖాలు పెట్టీకంటె, పోనీ,
ఒక్కసారే మనందర్నీ కాల్చి చంపేసి ఆ
దేవుడు వాళ్ళనే హాయిగా బతకనివ్వకూ
డదా? ఎందుకు మనల్ని పుట్టించడం? ఎం
దు కీవిధంగా హింసించడం? అయినా,
కట్టెదుట పాపాల్చేసే మనుషుల్నే 'ఏ
వర్రా ఎందుకు చేసేరు?' అని అడగడానికి
నోర్లేదు మనకి. మరింక ఆ దేవుణ్ని
ఇంకేం అడగ్గలం? కాని ఏడవకుండా
ఉండలేంకద! దానిక్కూడా నోళ్ళు కట్టే
స్తారా? కట్టేసినీయండి. ఏడ్చి మనం సాధిం
చే దేవుంది గనక! కాని నిన్న మధ్యానం
అదన్న మాటలు.... [బోలెడ్డబ్బొ తగలేసి,
ఉత్తిపుణ్యానికి నిన్నూ నీ మొగుణ్నీ ఇందు
మీద పండబెట్టడానికి కొనుక్కోలేదు పిల్లా
నేనీ ఇల్లు! అంత పుణ్యానికే పోవాలంటే
నా మేనల్లుడే ఉన్నాడు. నిన్ను కాకపోతే
నీలాటివాళ్ళని పదిమందిన్తెచ్చి వాణ్ని పండ
బెట్టగల నిక్కడ! తెల్సిందా? ఆపాటిదానికి

నీ మొగుడికెందుకు ఇల్లిచ్చుకోడం? అద్ది
మ్మంటే నోరుందికదా అన్చెప్పి పెద్ద
కబుర్లాడకు! మేం వూం ఆడగలం ఆపాటి
ఆడ్డానికి ఆపాటి నోళ్ళు మాకూ ఇచ్చేడు.
భగవంతుడు. నీకున్న పౌరుషం నీ మొగు
డికే ఉంటే ఆపాటి అద్దెడబ్బులు మా
మొహాన్ని ఎప్పుడో పారేసును. అంత
పాటైనా చేతకానివాడికి ఈ యిల్లూ మంచం
నువ్వూకూడా ఎందుకు? అంతగా కావా
లంటే మా ఇల్లే దొరికిందేంటి? పోయి
ఏ చెట్టుకిందో ఉండరాదా? కాణీ అద్దె
ఇవ్వక్కర్లేదు కద? ఆడదాన్నిట! హింసట్ట!
పెట్టేస్తున్నాంట! ఏం? నా అద్దె
నాకు పారేక నన్నిలా ఎండలో తిప్పి
నన్ను హింసలు పెట్టడం లేదా నువ్వు?
నేనాడదాన్నికానా?! ఆడదెవరో మొగా
డెవరో తెలీకుండానే కాపరం చేసి పిల్లల్ని
కన్నానా?.?] ఆ మాటలన్నీ చెప్పడానికి
నాకు నోర్రావడంలేదు. మనం ఈ యిం
ట్లోంచి పోదాం! చెట్టుకిందికే పోదాం
మనకి ఈ యిళ్ళెందుకు, ఈ వూళ్ళెందుకు
ఈ నౌకరీ చాకిరీ లెందుకు? పక్షులు బతక
డంలేవా! పశువులు బతకడంలేవా! చెట్లకిం
దికే పోదాం. అవీ లేకపోతే ఆపాటి పడి
చావడానికి నూతుల్లేవా?! గోతుల్లేవా?!
అంతకీ ఏదీ లేకపోతే, మహాసముద్రం
లేదా? అందులోకి పోతే అక్కణ్నించి
మనల్నెవ్వరూ పొమ్మన్లేరుకద!" అంటూ
కళ్ళొత్తుకొంది రవిభార్య.

రవి భార్యకి ఇరవైమూడేళ్ళుంటాయి.
ఆవిణ్ని చూస్తే పచ్చగా బరువుగా పళ్ళతో
నిండిపోయి వడదెబ్బకి వడిలిపోయి ఎం
డలో జాలిగా నిల్చున్న లేత బొప్పాయి
మొక్క గుర్తుకొస్తుంది. రవి కంటికి ఆమె
ఎప్పుడూ, తిండిలేని సీతలాగా, ఆకల్తో
అడివిలో తిరిగే దమయంతిలాగా కనిపి
స్తుంది. రవికి ముప్పయ్యేళ్ళున్నాయి, అతను
చీకటికొట్లో ఎండుగడ్డి వేడిలో ముగ్గబెట్టి
బలవంతంగా పండబెట్టిన లేలేత మావిడి
కాయిలా పండిపోయుంటాడు.

అతని తలమీది జుట్టు చాలాకాలంనించీ
రాలిపోతోంది. వర్షంతో తడిసిపోయి పాడై
పోయి చెడిపోయిన కొత్తచీపుర్లా ఉంటున్నా
డిప్పుడతను. వాళ్ళిద్దరికీ ఎనిమిదేళ్ళ
కొడుకూ అయిదేళ్ళ కూతురూ ఉన్నారు.

భార్య చెప్పే మాటలన్నీ వింటూ మం
చంమీద వెల్లకిలా పడుక్కున్న రవి ఆవిడ
తల తన గుండెకి చేర్చుకున్నాడు. అంతా
చెప్పి లేచి ఆమె కళ్ళొత్తుకుంటుంటే, చివ
రికి ఉండబట్టలేక, "అత్తముండనీ అల్లుడు
వెధవనీ చంపేస్తాను." అన్నాడు రవి.

"దేవుడూ గవర్నమెంటూ అంతా
వాళ్ళ పక్షవేం ఉంటే మీరూ నేనూ ఏం
చెయ్యగలం? ఏం చెయ్యలేకపోయినా ఆ
దేవు డొక్కసారి కనిపిస్తే — కనిపిం
చడు. కనిపిస్తే పేదవాళ్ళంతా గుట్లపీకి
చంపేస్తారని భయం! నామట్టుకు నేను ఓ
బుగ్గపోటైనా పొడవకపోతే నా మనసు
శాంతించదు. అందుకే కనిపించడు పెద్ద
మనిషి! పోన్లెండి. ఉణ్నీయండి. అందర్నీ
వాళ్ళ పక్షవేం ఉణ్నీయండి. నిండా ముని
గేక ఇంకేం భయం? భయపడద్దు మనం.
వాళ్ళకి అద్దె ఇవ్వొద్దు మనం. అంతగా
అయితే ఏ బైరాగి సత్రానికైనా పోదాం
కాని వాళ్ళకి అద్దె ఇవ్వొద్దు మనం." అంది
రవి భార్య.

భార్యకి బాధతప్ప మరేం తెలియదని రవికి తెలుసు. తను చెయ్యలేని పను లేవిటో కూడా అతనికి తెలుసు. పెళ్ళి, వాళ్ళని చంపలేడు. పిల్చి దేవుణ్ని పలి కించుకోలేడు. అర్జీ రాసుకునైనా గవర్న మెంటునేదీ అడగలేడు. సంసారంతో బైరాగిసత్రంకి పోలేడు. కట్టగట్టుకు సము ద్రంలోకి ఉరకలేడు.

అందుచేత, సరిగ్గా ఏడోగంటకల్లా, పాతిక రూపాయల అప్పు వేటకి, గది లోంచి బైటికి నడిచేడు రవి.

సుంధపేరు సుధాకర్. కలెక్టరాఫీసులో కొద్దిగామాత్రం కన్నీలు దొరికే సెక్షన్లో పనిచేస్తున్నాడతను. వయసు పాతిక. గుమాస్తా, బ్రహ్మచారి. కొంచెం అం దంగా కొంచెం టెక్కుగా షోగ్గా అతను గుమాస్తాగా మారిన పడుచు బ్రెమ్మనీ కలెక్టర్లా ఉంటాడు.


బట్టలమీద మోజుకొద్దీ పెళ్ళి మాను కున్నాడు సుధ. అతనికి సినిమాలసరదా, నాటకాల పిచ్చికూడా ఉన్నాయి. ఆ పిచ్చి సరదా మోజులకీ పెళ్ళికీ సహజ వైరం ఉంది. పెళ్ళి చేసుకున్న గుమాస్తాల బాధల్ని పక్కన్నిలబడి మరీ చూసేడు సుధ. అందుచేతనే అతనికి భయం పెళ్ళంటే, కాని, అతనికి ఆడదంటే చిక్కని మోజుంది. పెళ్ళి లంకె తగుల్చుకోకుండా అతను చిలక్కొట్లతో కాలక్షేపం చేస్తున్నా డని అందరికీ తెలుసు. అతనికి తల్లి తండ్రి అన్నదమ్ములూ అప్పచెల్లెళ్లూ ఎవరూ లేరు. ఒక చిన్న మేడమీద, ఒక చక్కని చిన్నగదిలో కాలక్షేపం చేస్తున్నాడతను.

సమస్త బంధువుల్తోనూ అలరారుతూన్న గుమాస్తాలతన్ని "లక్కీఛాన్సుగాడు!" అంటారు.

సుధకి టెర్లిన్ షర్ట్స్ అంటే ఇష్టం వున్నట్టే సుశీలకి నైలాన్ చీరెలంటే ఇష్టం ఉండేది.

సుశీల ఒకప్పుడు ఎమ్బీబియెస్ చదువు దామనుకొంది. మరొకప్పుడు సినిమాల్లో చేరిపోదామనుకొంది. ఓనాడు 'కష్టజీవులు' సినిమా చూసి హీరోయిన్లాగ ఏ మంచి కూలివాణ్ణయినా పెళ్ళాడేద్దునా అనుకొంది. మరోనాడు, వాళ్ళ వీధిలోనే ఉన్న సర సుడూ తాగుబోతూ జూదగాడూ దొంగా దగాకోరూ అందగాడూ అయిన నడికొలవు గూండాని అందర్నీ ధిక్కరించి పెళ్ళాడి పరమ పతివ్రతగా ఉంటూ తన పాతివ్రత్య బలంచేత వాణ్ని పరమ భాగవతోత్తముడిగా మార్చేద్దునా అనుకొంది. ఓసారి ఏ అమె రికా అయినా ఎగిరిపోదునా అనుకొంది. మరోసారి, తనని ఏ పడుచు చీఫ్ మినిస్టరో, రాజాసాహెబో, కలెక్టరో లేక నాలుగు కార్లున్న కంట్రాక్టరో పెళ్ళాడకూడదా అను కొంది.

ఆ అనుకోడాలూ ఊహలూ అవన్నీ ఆమెకి పద్దెనిమిదేళ్ళు నిండకముందు. ఇప్పుడుకాదు. ఇప్పుడామెకి ఇరవైరెండేళ్ళు దాటేయి. సుధ పనిచేసే సెక్షన్లో టైపి స్టుగా చేరిన తరవాత సుధని చూసేక అతన్తో పరిచయం అయ్యాక ఆమెకి నగలూ నైలాన్ చీరెలూ అక్కర్లేకపోయేయి. సుధని పెళ్ళాడి ఆ మేడమీద ఆ చక్కని చిన్న గదిలో అతన్తో కాపరం చెయ్యడం. అదే



కావాలనుకొంది; అదే చాలు నదే స్వర్గం అనుకొంది.

మొదటిరోజుల్లో ఓరోజు మధ్యాహ్నం సుధతో ఏదో మాట్లాడుతున్నట్టు మాట్లా డుతూ తన ఫ్లాస్కు తీసి మర్యాదకి ఇచ్చి నట్టు తన కాఫీ కొంత అతని కిచ్చింది సుశీల. అక్కణ్ణించి కాఫీలు ఇచ్చి పుచ్చు కోవడాలు ప్రారంభమయేయి. ఓనాడు ఇద్దరూ కలిసి హోటేల్కి వెళ్ళిన మొదటి రోజున - అతను బిల్లు చెల్లిస్తే, "ఒద్దు మీరివాళ చెల్లిస్తే, రేపు మరెవరైనా చెల్లిస్తా నంటారు." అంది సుశీల. "నేనుండగా మరెవర్నైనా చెల్లించనిస్తానా?" అని అత నంటే సిగ్గునవ్వు నవ్వి మనసులో అతని మాటల్ని దాచుకొంది. మూడుసార్లు అతనితో కలిసి సినిమాకి వెళ్ళి నాలుగోసారి వెళ్ళి నప్పుడుమాత్రం అతన్ని తన కుడి చెయ్యి మాత్రం పట్టుకోనిచ్చింది. ఆ రాత్రి అతనితో రిక్షాలో కూర్చొని రాడానికి చాలా సిగ్గుపడింది. ఓరోజు సాయంత్రం అతను జాకెట్ పీస్ కొనిస్తే "చెప్పకుండా ఎందుకొన్నా"రని మారాం చేసింది. "రేపు టెష్యూచీరె కొంటాను." అని అతనంటే" "ఒద్దు. డబ్బు ఖర్చు." అంది సీరియస్‌గా. అదే సాయంకాలం బాగా చీకటిపడ్డాక బీచిని మసక వెన్నెల్లో అతన్ని ఒక్క ముద్దుమాత్రం పెట్టుకోనిచ్చి ఆ తరవాత ఎందుకో దుఃఖం రాగా కళ్ళు తుడుచు కొంది. తన నతను ఓదార్చబోతే కొంత మేరవరకు మాత్రం ఓదార్చనిచ్చింది.

"టిస్యూచీరె కొనీదా?" అని అతను మళ్ళి అడగ్గా సరేనన్నట్టు తలఊపి, "నీఇష్టం" అంది. అతన్ని పెళ్ళాడ్డంకోసం ఆమె తహతహలాడిపోయింది.

సుధమాత్రం ఆడవాళ్ళు మగవాళ్ళకి మగవాళ్ళు ఆడవాళ్ళకి రాసేకథలు చదివేడు కాబట్టే వాటిలో నాయకుల్లా "నాది ప్రేమా, వాంఛా? ఆమెది వాంఛా లేక ప్రేమా?" అని తర్కిస్తూ కూర్చున్నాడు. తర్కం తేల్లేదు కాబట్టి ఆమెతో పెళ్ళిసంగతి మాట్లాడ్డం మానీసేడు.

సుశీల ఆమర్నాడు ఆఫీసుకి ఆలస్యంగా వచ్చిన సుధని దూరంనించి నవ్వుతూ పలకరించి నవ్వుతోనే దగ్గరకి రమ్మంది. అతను 'పనిలో మునిగిపోయి' రెండుగంటలయేక ఆమెదగ్గరికి వెళ్ళేడు. వెళ్ళేక, అతను ఫ్రీగా మాట్లాడలేకపోడం గమనించి ఆమె కూడా ముక్తసరిమాటల్తో సరిపుచ్చింది. ఆ సాయంకాలం, "ఇంకా పందకాయితాల పనుంది. నాకోసం వెయిట్ చెయ్యకు!" అన్నాడతను. సరేనని వెళ్ళిపోయిన సుశీల ఆ మర్నాడు అతన్ని నవ్వురాకుండానవ్విన పెదవుల్తోపలకరించింది. మాట్లాడ్డంమాత్రం మానేసింది. రెండు, మూడు, నాలుగు. ఐదురోజులు మాట్లాడ్డం మానేసింది. ఆమె తనతో మాటలు మానేసిందన్న సంగతికి బాధపడ్డ సుధకి తనామెతో మాట్లాడలేదన్న సంగతి గుర్తురాలేదు. ఆరోజున మాత్రం ఆమె ఆఫీసుకి వస్తూండగా వరాండాలోనే ఆపి ప్రేమా కోపం అభిమానం అన్నీ ఒక్కుమ్మడిగా ఒక్కప్రశ్నలో ఇమిడ్చి, "టిస్యూచీర కొనేదా, ఒద్దా?" అని బింకంగా అడిగేడతను. సుశీల అతని కళ్ళల్లోకి సూటిగా చూసి, "నా నిర్ణయంతో మరింక పనిలేదు. నిర్ణయించుకోవల్సింది మీరు." అంది 'భావగర్భితంగా'. "నన్ను పెళ్ళాడదల్చుకొంటే చీరెకొను. లేకపోతే నాకు నీ చీరెలూ ఒద్దు, నువ్వూవద్దు." అని ఆమె చెప్తోందని స్పష్టంగా బోధపడింది సుధకి.

"ఇద్దరి జీతాలూకలిపి ఇద్దరికీసరిపోవా?" అనుకొంటూనే ఉన్నాడు ఆరోజల్లా ఆఫీసులో సుధ. కాని, ఇద్దరు ఒకఏడాదిలో ముగ్గురవుతారు. ముగ్గురు మరికొంత కాలంలో నలుగురైదుగురవొచ్చు. అంతలో బాధలమబ్బులూ కష్టాలవర్షాలూ తయారవుతాయి. సినిమా ఉండదు, నాటకాలుండవు; దోసె కాఫీ సిగరెట్లుండవు! చెప్పులుండవు, సైకిలుండదు; బస్సులుంటాయికాని వాటిలో ప్రయాణాలుండవు; పాలు వెన్న రొట్టె ఏదీ ఉండదు: పెరుగు, కక్కులు, కాయగూరలు టూత్‌పేస్టు, హేరాయిలు, పేపర్లు, పత్రికలు నావెల్సు, ఏవీఉండవు. బట్టలు! బట్టలుండవు. గొప్పతగ్గింపుధరల వారాల్లో ఖద్దరు బట్టలు కొనుక్కోవాలి, చవక నూలుగుడ్డలు ఎంచుకోవాలి. అంతకిమించి గత్యంతరం ఉండదు. మరింక -పిల్లలు, జబ్బులు, మందులు, చావులు? ఏంబ్రతుకు బ్రదర్! భయంవేస్తోంది.

"ఏంచెయ్యడం?" అని మధ్యాహ్నం లంచ్‌లో ఓస్నేహితుణ్ని సలహా అడిగేడు సుధ.

"సుధా బ్రదరూ! పెళ్ళాడకముందు ఇన్ని ఆలోచించే గుమాస్తాగాడివి ఆడి మాత్రం ఏం సుఖపడాలి?" అన్నాడతను.

అయితే-సుధకి సుశీలతో సుఖపడాలనే తీవ్రమైనకోరిక మాత్రం లేకపోలేదు.

ఆ సాయంకాలం అతను ఆఫీసునించి రూంకి వస్తూ దార్లో పావలా షేవ్‌చేయించుకొని, రూంకి వచ్చి స్నానంచేసి, బజారుకి వెళ్లేవాళ్ళా ఫుల్‌గా డ్రెస్సై టాయ్‌లెట్ అయి మంచంమీద కూర్చొని, "టిస్యూచీరె కొనడవా, మానవా?" అని తర్కిస్తున్నాడు. అతనికేమీ పాలుపోడంలేదు. అప్పుడతని చేతిలో సరిగ్గా ఇరవైతొమ్మిది రూపాయల నోట్లూ, ఒక ఇచ్చరూపాయీ ఉన్నాయి. ఆలోచించి ఆలోచించి చివరికతను ఆ ఇచ్చరూపాయి టాస్‌చేసి పెళ్లో బ్రహ్మచర్యమో తేల్చిపారేద్దామనుకున్నాడు.

అంతలో బాబులు (అనే జగన్నాధం) వచ్చి సుధపెళ్ళి ప్రయత్నం ఆపుచేసేడు.

"మళ్ళి మా జీతాల్రోజున ఇచ్చేస్తాను ఒక్కముప్ఫయ్! ప్లీజ్ ప్లీజ్! నీగెడ్డంపట్టుకు బతిమాల్తాను." అన్నాడు జగన్నాధమనే బాబులు.

"ఉండండి! మండుతుంది. ఇప్పుడే షేవ్ చేయించేను." అన్నాడు సుధ, ముఖం వెనక్కిజరుపుకొని. (పెళ్ళాడి పాతైపోతే వారానికొకసారే షేవు!)

"అయితే చేతు లిలా ఇయ్యి" అన్నాడు బాబులు.


"ఉండండి. ఎంతకావాలి మీకు?"

"ఒక్కముప్ఫయ్!"

ఆ'ముప్ఫయ్'ని మూడుపైసల్లా ధ్వనింపజేసేడు బాబులు.

"పట్టుకువెళ్ళండి." అని సంతోషంతో ఆ సొమ్ము అతనికిచ్చేసి, "హమ్మయ్య", అని నిట్టూర్చేడు సుధ. చీరె కొనడానికి డబ్బులేదుకాబట్టి అది కొనడవా, మానవా అనే సమస్యేలేదు. అది పరిష్కరించే బాధాలేదు. వచ్చేనెల చూసుకోవచ్చు.

ఆ వచ్చేనెల వచ్చివెళ్ళింది. మరోనెల వచ్చి అదికూడా వెళ్ళింది. ఇంకోనెలకూడా తొందరగావచ్చి లక్షపనులు చక్కబెట్టి చక్కావెళ్ళింది. మూడునెల్లూకూడా కోట్లకొద్దీ జనంచేత కోట్లకొద్దీ పనులు చేయించేగాని సుధచేతమాత్రం టిస్యూచీరె కొని



పించలేకపోయేయి. అంతలో నాలుగోనెల నెమ్మదిగా దొంగలావచ్చి సుశీలని చల్లగా కారెక్కించి ఒక రిటైర్డు పోలీసుఆఫీసర్తో పెళ్ళికి రెజిస్ట్రార్‌వారి ఆఫీసుకి తీసుకుపోయింది.

పెళ్ళిరోజు పొద్దున్నే సుశీల సుధ రూంకి వచ్చి, శుభలేఖ స్వయంగాఇచ్చి, పెళ్ళికి రమ్మని పిల్చి, "మా పెళ్ళికి సాక్షిసంతకం మీరుకూడా చెయ్యాలి. తప్పకరండి," అంటూ నవ్వుతూ అతనిముఖంలోకి చూసి, ఆ వెంటనే కోపంతో ముఖం ఎరుపుచేసుకొని, అంతలోనే దుఃఖంతో వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ నవ్వు అతన్తో, "ఈ పరిస్థితికి కారణం నువ్వేసుమా!" అంది. ఆ కోపం అతన్ని, "నా దుస్థితికి కారణం నువ్వే కదా?" అని నిలదీసి అడిగింది. ఆ దుఃఖం అతన్తో, "నేన్నాశనం అయితే అందుకు కారణం నువ్వే నువ్వే!" అని జలజలా రాల్తూ జాలిజాలిగా చెప్పింది.

అప్పణ్నించీ సుధాకర్ కొంతకాలం దేవదాసుగా తిరిగేడు, తనబాధకి తను (కూడా) కొంతకారణం అని అతనికి తెలుసు. అంచేతనే అతనికి మరీ బాధగాఉంది. కాని, "సుశీల నన్నర్థంచేసుకోలేదు." అని సమాధానపర్చుకొందికి ప్రయత్నం చేసేడు. గుమాస్తాగాడు పెళ్ళిచేసుకొంటే ఐట్టికీ భోజనానికీ వాచిపోయే ప్రమాదం ఉంది కదా: అలాభయపడ్డంలో నాతప్పేంవుంది? సంఘం అలా వుంది. అందుకు నేనేం చేసేది? సంఘంలోఉన్న పెద్దతప్పు నామీత్తోస్తే ఎలా? — అని అతనుబాధపడి చాలా చిరాకుపడ్డాడు. పోనీ, నాతో 'ఇదిగో సుధా! నువ్వు నన్ను పెళ్లాడకపోతే నేను చచ్చిపోతాను, లేకపోతే ఎక్కడికైనా పారిపోతాను. లేకపోతే నీమీద కోపంచేత ఏ ముసిలాణ్నయినా ఎవణ్నయినా పెళ్ళాడేస్తాను!' అని సుశీల స్పష్టంగా చెప్పేస్తే ఎంతబావుణ్ను !....కాదు! నాదే తప్పు. నాదేతప్పు—కాదు!సంఘం దీతప్పు. పువ్వులాటి పెళ్ళిని మాకు పెద్దపులికోరలా తయారుచేసిన పెద్దల సంఘందీ తప్పు!

అలా బాధపడుతూ చిరాకుపడుతూ కాలం గడుపుతున్నాడు సుధ. ఈలోగా సుశీల ఉద్యోగం మానేసింది. ఆమె పెళ్ళి జరిగి అప్పుడే రెణ్నెల్లయింది. రెండురోజుల్నించీ సుధాకర్ మూడ్ పూర్తిగా మారిపోయింది. ఇప్పుడతను లోకులంతా బహు దుర్మార్గులూ పరమరాస్కెల్సూ అనే చీకటి కోపంతో ఉన్నాడు.

ఉదయం ఎనిమిదిగంటలకి అత నటువంటి డార్క్‌మూడ్‌లో ఉండగా రవి నెమ్మదిగావచ్చి భయం భయంగా పాతికరూపాయలు అప్పడిగేడు.

"ఇవ్వను, ఇవ్వనుకాక ఇవ్వను. ఎందుకివ్వాలి?" అనేద్దామనుకున్నాడు సుధ.

కాని అంతలోనే అతనికి కొంచెం, అతి కొంచెం ఒక్క మూడుమిల్లిమీటర్ల చిరునవ్వొచ్చింది. లోకులంతా ద్రోహులనీ దుర్మార్గులనీ ఈ సుధకి తెలుసు. తెలిసినా ఈ సుధాకరుడు వారికి మేలుచెయ్యడం మానడు. ఏదో తెలియనితనంవల్ల ఆమె యెడల ఎట్టితప్పిదం చేసినా ఈ సుధాకరుడు దానశీలుడనీ దయార్ద్రహృదయుడనీ ఆ సుశీలకూడా ఒప్పుకుతీరాలి. అవును ఎంతో మంచివాడు మాసుధ.


ప్రకాశంగా రవితో, "ఇప్పుణ్నాదగ్గిర అయిదున్నాయి. అందాకా పట్టికెళ్ళు. మిగతా ఇరవై ఇవాళ పదో తారీకు కాదూ? ఇవాళే రైల్వేవాళ్ళ జీతాల్రోజు. బాబులు నాకు సొమ్మివ్వాలి. అడిగితెస్తాను. సాయంకాలం రా!" అన్నాడు సుధ. అతనికి రవిని చూసి చిన్నమెత్తు అసూయా ఎక్కువగా జాలీ కలిగేయి. "అయితే, సాయంకాలం నా మాట మర్చిపోకుస్మా! మర్చిపోతే చచ్చిపోతాను!" అంటూ లేచి వెళ్ళిపోబోతున్న రవిని ఆపి,

"రవీ! పెళ్ళిచేసుకున్న గుమాస్తాకి పరమవీరచక్రం ఇవ్వొచ్చు రవీ!" అన్నాడు సుధ.

"మిగతా ఇరవైఇస్తే నాకు ప్రాణాలిచ్చినట్టేలెక్క." అన్నాడు రవి.

జీతాలరోజేకాని బాబులు ఆఫీసుకి వెళ్ళేడు. తోడిగుమాస్తాకి తనజీతం పుచ్చుకొనే ఆథరైజేషన్ లెటరిచ్చి సెలవుపెట్టి ఇంటిదగ్గరే ఉండిపోయేడు.

బాబులికి రవీంద్రనాధ్‌ఠాకూరంటే ఇష్టం లేదు. ఎంచేతనంటే అతనికి కాబూలీభయం ఉంది. చెల్లులేనివడ్డీలు చెల్లించిచెల్లించి మరి చెల్లించలేక చేతులెత్తి నిల్చున్న బాబుల్ని కాబూలీవాడు సివిల్‌జెయిల్‌కి పంపిద్దామని చూసేడు. "నేను ఇచ్చుకోగలిగిన్ని ఇచ్చుట మానివేయడంలేదనిన్నీ, నేను కానీ మిగలకుండా కాలక్షేపం చేస్తున్నవాడి ననిన్నీ" బాబులు కోర్టువారికి నిరూపించుకొని జెయిలు తప్పించుకున్నాడు. జీతంలో మిగతా అప్పులవాళ్ళ కోతలు అప్పటికప్పుడే పోతూనే ఉండడంచేత కాబూలీవాడికి ఆఫీసుగేటు కాయక తప్పిందికాదు.



అందుచేత జీతాలరోజుల్లో బాబులు ఆఫీసుకి వెళ్ళడు.

బాబులు ముఖం, అప్పులవాళ్ళెక్కడ కనిపిస్తారోఅని కనిపెట్టుకు తప్పించుకు తిరిగే యాభయ్యేళ్ళ ముఖంలా ఉంటుంది. అతనిజుట్టు డెబ్భయ్యేళ్ళదాన్లా ఉంటుంది.

అతనెప్పుడూ తోడేళ్ళకి భయపడే ముసిలి కుందేల్లా కనిపిస్తాడు; గడపదాటి వీధిలో కెప్పుడొచ్చి తిరిగినా, పిల్లిఉన్న ఇంట్లో ఎలుకతిరిగినట్టు వారవారలంట తిరుగుతాడు. ఎవరైనా అతన్ని ఇంటికివెళ్ళి పిలిస్తే అతను వెన్వెంటనే బైటకిరాడు. ఆ వచ్చినవ్యక్తి 'క్రూరజంతువు' కాదని నిర్ధారణయితేగాని తలుపుతియ్యడు. ఇంట్లోవాళ్ళని "బాబులున్నాడా ?" అని అడిగితే ఎందుకైనా మంచిదన్చెప్పి వాళ్ళెప్పుడూ "లేరు లేరు"నే జవాబు చెప్తారు. ఆఫీసుకివెళ్ళే టైంకి బాకీదార్లు దారికాస్తారని భయపడి అతను టైంకి రెండు గంటలముందే ఆఫీసుకిపోయి కూర్చుంటాడు. లోనికివెళ్ళేక కాఫీక్కూడా మళ్ళీ బైటకిరాడు. ఆఫీసునించి ఇంటికి రాడంలోకూడా అతను ఎంతోచాతుర్యంచూపిస్తాడు. అతను ఒక్కొక్కప్పుడు ఇంటికి వెళ్ళనేవెళ్ళకుండా స్నేహితుల ఇళ్ళ దగ్గిర ఉండిపోతుంటాడు. అతను కత్తులమీద నడిచేవాడ్లాగా నిప్పులమీద గెంతేవాడ్లాగా కనిపిస్తాడు. కొత్తగావచ్చే కుర్రగుమాస్తాలతో అతను "ఒరిజినల్ గుమాస్తాగాణ్ణి నేనూ! కార్బన్ కాపీగాళ్ళుమీరు." అంటూంటాడు.

బాబులనే జగన్నాధానికి నలభయ్యేళ్ళ వయసులో ఇప్పుడీరోజున, పెళ్ళికాని చదువులేని ఇరవైరెండేళ్ళ కూతురూ, మెట్రిక్కు పాసవని నౌఖరీదొరకని పెళ్ళికాని ఇరవయ్యేళ్ళకూతురూ, చదువుసరిగా అబ్బని పద్దెనిమిదేళ్ళ కొడుకూ, పదకొండోయేటనించీ పెళ్ళికోసం తహతహలాడిపోతున్న పదహారేళ్ళకూతురూ ఎడంకాలు ఎండిపోయిన పన్నెండేళ్ళ కొడుకూ నెత్తిమీదిభారంతో బుద్ధిలో పండుముసలైపోయిన పదేళ్ళ కూతురూ ఉన్నారు. బాబులుభార్య తరుచు కనిపించదు. ఆవిడ పొగల్లో ఉంటుంది. ఆవిడ మనిషిలా ఉన్నప్పుడెలా ఉండేదో బాబులికే సరిగ్గా గుర్తులేదు.

బాబులెప్పుడూ దుఃఖానికి నవ్వుపూతలు పూసి భద్రంగా దాచుకోడు. దాన్ని చిరాకుతో అణచేబోతాడు. కోపంతో చంపేబోతాడు.

సాయంకాలం ఆరుగంటలకి బాబులు ఇంట్లో చిరాగ్గా కూర్చున్నాడు. జీతంఇంకా రాలేదు. సుధవచ్చి పీకలమీద కూర్చొనే టైమవుతోంది. అతన్ని ఎలా తప్పించుకోడం?

"తప్పించుకోడం అవసరమా?" అని కూడా ఆలోచిస్తున్నాడు బాబులు.

సుధంటే బాబులికి అభిమానమూ, కోపమూ కూడా ఉన్నాయి. తన మూడో కూతురికి సుధంటే మోజుందనీ ఆ పిల్లయెడల సుధకి మోజు లేకపోలేదనీ అతనికి తెలుసు. బీదవాడి కూతుర్ని సుధ పాడుచెయ్యకుండా ఊరుకున్నాడనికూడా అతనికి తెలుసు. ఆ పిల్లంటే సుధకుండే మోజు ఆధారం చేసుకొని, తన్ను అతడ్దగ్గిర్నించి అప్పులు లాగ్గలిగేడని కూడా తెలుసు. అందుకే బాబులు తనని చూసి తను అసహ్యించుకుంటాడు. ఆ అసహ్యాన్ని కోపంగా మార్చి ఆ కోపాన్ని ఆ కూతురిమీదికి ట్రాన్స్‌ఫర్‌చేసి ఆమె ఏ చిన్న తప్పు చేసినా ఆమెని చితక్కొట్టి చివరకి "నా పాపానికి నన్నెవరు కొడతారు? ఇన్ని పాపాలు చేయించే - ఆ దేవుడుగాణ్ని - వాణ్నెవరుకొడతారు?" అని పళ్ళు పటపట కొరుక్కుంటాడు.

సాయంకాలం చిరాగ్గా కూర్చున్నాడు బాబులు.

సుధ మంచివాడే. అప్పిచ్చి మళ్ళీ అడిగే మనిషికాడు. కాని ఇవాళ పొద్దున్నే వచ్చి అడిగేడు. కావాలంటే ఓ అయిదు. ఇంకా కావాలంటే ఓ పది కొట్టేసుకునైనా ఇస్తే కాని వీల్లేదన్నాడు. అదీ బాగానే ఉంది. న్యాయంగానే చెప్పేడు. (దీన్ని వాడు పెళ్ళాడేసినా బావుణ్ను.") న్యాయంగా చెప్పినప్పుడు మనం మరోలా ఉంటే మనకింక అప్పు పుట్టదు. పోనీ ఇచ్చేద్దాం సొమ్ము. కావాలంటే మళ్ళీ వాణ్నే అడగొచ్చు.—

అని నిశ్చయించుకున్నాడు బాబులు.

అంతలో ఆరుంపావుకి తోడి గుమాస్తా వచ్చేడు.

"నువ్వివ్వమన్న వాళ్ళందరికీ ఇచ్చేసేను. ఇవిగో రశీదులు. మిగిలినవి ముప్ఫయ్. ఇందులో నా అయిదూ ఇదుగో తీసుకుంటున్నాను. మిగతావి పాతిక. లెక్కెట్టుకో," అంటూ అతను పాతికరూపాయలు బాబులి చేతి కిచ్చేడు.

"నీ అయిదుకీ నాలుగురోజు లాగలేవా?" అని, రాళ్లు కరిగించే స్వరంతో అడిగేడు బాబులు.

"ఆగలే నాగలేను! నాల్రోజులు పోయేక ఎక్కణ్నించైనా తెచ్చి మళ్ళీ ఇస్తే ఇవ్వగల్నేమోకాని ఇప్పుడుమాత్రం ఆగలేను" అని గాభరాగా అన్నాడు తోడి గుమాస్తా. కరిగిపోతానేమోననే భయంతో గడగడ వణికిపోయేడతను. ఆ అయిదూ ఇవ్వకుండా ఉండడానికి మర్నాడు యాభై వేలిస్తానని ప్రామిస్ చేసీగలడతను ఆ సమయంలో.

"వారం రోజుల్లోపల ఎప్పుడు సర్దినా సరే! నీ దయ! " అన్నాడు బాబులు. ఆతరవాత ఎదర వరసలో కొంతదూరంలో కనిపించే మేడమీదిగది చూపించి "చూడారే బాబూ!సుధాకరం రూంలో లైటు వెలుగుతోంది. ఈ ఇరవయ్యూ పట్టుకెళ్ళి నేనిచ్చే నన్చెప్పి వాడికిచ్చేద్దూ," అని తోటి గుమాస్తాకి పని పెత్తాయించేడు. తోడి గుమాస్తా వెళ్లేడు.

కాస్సేపటికి తోడిగుమాస్తా సుధాకరంతో మాట్లాడ్డం ఆ మేడగది కిటికీలోంచి కనిపించింది బాబులికి. అంతలో ఆ గదిలోకి, "రవిగాణ్ణా ఉన్నాడు. రవిగాడేనా? ఆఁవాడే" వచ్చేడు. ఆ తరవాత దీపం ఆపుచేసి ముగ్గురూ అటెక్కడికో వెళ్ళట్టున్నారు.

చలికాలం. సాయంకాలం ఆరుంపావు దాటి పావుగంటయింది. వీధి దీపాలు వెలిగేవున్నాయి. వీధంతా సందడిగా ఉంది. బాబులింట్లో ఇంకా దీపాలు వెలిగించలేదు. చీకటిగా చిరు చలిగా ఉంది. పెద్దకూతుళ్ళు ముగ్గురూ, పక్క వాటావాళ్ళ వారపత్రికలు చదవడానిక్కాబోలు, వెళ్ళేరు. మగపిల్లలింకా ఇంటికి రాలేదు. ఆఖరిదానికి రూపాయిపావలా ఇచ్చి "అరువుకొట్టుకి వెళ్ళి రేపన్ని తెస్తాను. అందాకా రెండు శేర్లు బియ్యం పట్రా తల్లీ" అన్చెప్పి దాన్ని బజారుకి పంపించి గదిలో వాలుకుర్చీలో వాలేడు బాబులు. తీర్చవలసిన ముఖ్యమైన

నెలవారీ అప్పులన్నీ తీరాయి. సుశకి ఇవ్వవల్సినవాంట్లో పది కలిసొచ్చాయి బాబులికి. ఇంకా ఏదో బెంగగా ఉంది. ఏదో ముఖ్యమైన ఘోరవిషయం మర్చిపోయి ఏదో మరిచేసన్నసంగత్తప్ప మరేదీ గుర్తుకి రానివాళ్ళా కూర్చున్నాడతను. ఓసారి ఆఫీసుకికొద్దు కాఫీహోటేల్లో మర్చిపోయిన్నాడు ఇలాగే గిజగిజ లాడేడు. సరిగ్గా అర్ధరాత్రి గుర్తొచ్చిందా సంగతి అనా డతనికి.

అలా ఆలోచిస్తూ కూర్చునేసరికి అలిసిపోయిన ప్రాణానికి విశ్రాంతికోసం అతని వళ్ళంతా రాత్రి తొమ్మిద్దాకా చిన్న కునుకు తీసింది. తొమ్మిదికి అతని పెద్దకొడుకు "భోజనానికి లే నాన్నా!" అంటూ అతన్ని తట్టి లేపేడు. అంతవరకూ మర్చిపోయిన విషయం కొడుకుని చూడగానే అప్పుడు తటాల్న గుర్తుకిరాగా లబో లబో మంటూ కుర్చీలోంచి లేచేడు బాబులు.

రాత్రి పదయింది. ఆలస్యంగా లేచిన చంద్రుడు పాడుబడ్డ డాబాఇంటి వంటరిగది గుమ్మంలోంచి ఆ గదిలోకి విధిలేక చూస్తున్నాడు. చాకింటి తెల్లచీరెలా కాకుండా మాసిన సైనుపంచెలా జాలిగా 'అసహ్యంగా' ఉంది వెన్నెల. వీధంతా నిర్మానుష్యంగా ఉంది. వీధిలో ఎలక్ట్రిక్ దీపాల బల్బులన్నీ అల్లరిపిల్లలు చితగ్గొటగా, ఆ స్తంభాలన్నీ కళ్ళుపోయిన బక్కచిక్కిన పెద్దసైజు ముసలికొంగల్లా కనిపిస్తున్నాయి. రవీ అతనిభార్యా వీధిమెట్టుమీద కాళ్ళు పెట్టుకొని గదిగుమ్మంలో పక్క పక్కల కూర్చొని దగ్గరదగ్గరగా అతినెమ్మదిగా ఏదో మాట్లాడుకొంటున్నారు. అద్దెబాధ తీరినా వాళ్ళల్లో ఇంకేవేవో బాధలు కనిపిస్తున్నాయి, కనిపించకుండా దాగుంటున్నాయి. రాత్రివేళ గుడ్డివెన్నెల్లో చెట్లఆకుల చీకట్లో పాములకి భయపడి లేచిపోయి గూటిఅంచున ముడుచుకు కూర్చున్న గువ్వపిట్టల్లా ఉన్నారు వాళ్ళు.

అంతలో అక్కడకి చింపిరిజుట్టుతో మాసుముఖంతో ఫిడేల్ డొక్కులాంటి ఛాతీతో బాజాకర్రల్లాంటి కాళ్లూచేతుల్తో, వదులైన ముసిలిచొక్కాతో పదునెక్కిన పాత పంచెతో రవికి వేలువిడిచిన మేనత్తకొడుకు బాబులనే జగన్నాధం గోలుగోలునవచ్చి, "పెద్దవాడి పరీక్షకి ఫీజుకట్టాలి. పెనాల్టీతో రేపే ఆఖర్రోజు. కట్టకపోతే ఏడాదివేస్తు. లైఫ్‌లో ఏడాది వేస్టంటే ఎంత ఘోరమో ఆలోచించు, నాయనమ్మ దయుంచి ఆసొమ్ము నాకియ్యి. రేపీపాటికి ఎక్కడైనా తలైనా తాకట్టుపెట్టి — ఇప్పుడుమట్టుకు నువ్వేలాగైనా సర్దాలి!" అంటూ గొల్లునగోలపెట్టి తన గోడుగోడంతా చెప్పుకొని రవి తెచ్చుకున్న సొమ్ము తనకి అప్పిమ్మన్నాడు.

"ఒరే బాబులుబావా! సురదగ్గిర పట్టుకొచ్చిన పాతిక్క ఇవిగో ఇవి మిగిలేయి, నాకో రూపాయుంచి నువ్వోరెండు తీసుకో, కావలిస్తే" అని నెమ్మదిగాచెప్తూ మూడు రూపాయికాగితాలు చూపించేడు రవి.

"తేరా బాబూ తే!" అంటూ ఆ రెండు రూపాయలూ తీసుకొని మిగతా సొమ్ము నీదగ్గరలేదు సుభగాడిదగ్గరలేదు ఎవడిదగ్గిరా లేదు, ఇప్పుడువెళ్ళి మరింక ఎక్కడ ముష్టెత్తడం, ఎవర్నెత్తికొట్టడం, ఏగంగలో కురకడం?" అంటూ బాబులు చేతులు పిసుకున్నాడు, జుట్టుపీక్కున్నాడు; గుండె బాదుకున్నాడు. అయిదునిమషా లలా ఏడ్చేడ్చిన బాబులు ఎందుకోగాని అకస్మాత్తుగా ఆగిపోయి. కొన్నిక్షణాలపాటు అలా నిశ్చలంగా నిశ్శబ్దంగా ఏదోఆలోచిస్తూ నిల్చొని ఆ తరవాత రవివైపు తలెత్తిచూసి, "రవీ: ఒక్కమాట!" అన్నాడు.


ఏమిటన్నట్టు చూసేడు రవి. "మనల్ని ఇలా ఉంచినవాడు దేవుడే అయితే వాడు దేవుడుకాడు; మనల్ని ఇలా ఉంచినవాళ్ళు మనుషులైతే వాళ్ళు మనుషులుకారు. మాకు ఈ చావే చాల్నని మనం ఇలా ఉండిపోతే మనం పశువులం కూడా కాము!" అని, ఉడుకులెత్తిన మరుగునీళ్ళు కుంపటిదిగి చెప్పినట్టు చెప్పి వెళిపోయేడు బాబులు.

వీధిలో మకిలివెన్నెల ఆరిపోయిన పాత దీపాల స్మృతిలా ఉంది. వీధంతా పాత పట్నపు పాడుబడ్డ వీధిలా నిర్జనంగా నిస్సహాయంగా ఉంది. అంతటా చలిచలిగా అతిచలిగా ఉంది. భార్యముఖంలోకి చూసేడు రవి. ఆమె ఎందుకోగాని దుఃఖాన్ని అణచుకోబోతూ అణుచుకోలేక వెక్కివెక్కి ఏడవడం ప్రారంభించింది. అర్ధరాత్రివేళ నట్టడవిలో కటికచీకట్లో కూరుకుపోయిన ఆడపిల్ల ఆర్తనాదంలా ఆ ఏడుపు అతిభయంకరంగా ఉంది. అమితదీనంగా ఉంది.

అలా ఏదో ఆలోచిస్తూ ఆలోచిస్తూ కూర్చున్న రవి కొంతసేపయ్యాక లేచి నిలబడి భార్యని లేవనెత్తేడు. మరి కొంతసేపటికి మసకచంద్రుడు పశ్చిమానికిదిగేడు ●



పాడిందే పాట



నేను రాజకీయ బాధితుణ్ణి

ఇంటి ముందరి బటానీ తీగలోనూ
ఇంటి వెనుక బాదామీ చెట్టులోనూ
అభివృద్ధి అగుపించింది కానీ
నేనే అట్టడుగుకు కుంచించుక
పోతున్నట్టు బాధపడుతున్నాను.

నేను నాటిన బటానీ తీగ పందిరంతా ప్రాకితే
తలదించుక దాని కిందనుంచే వెళ్ళాల్సొస్తున్నది
కాయ అందకుండా పెరిగిన బాదామీ కొమ్మను
రాయిలేందే తాకలేకపోతున్నాను.

విప్లవం లేని విద్యుత్తు జనించదని
దూకుడుగా పడిపోతున్న నీటినుంచి
పాఠం నేర్చుకున్నానుగాని
కాంతిరేఖ షాక్ కొడితే
భ్రాంతి విచ్చి
ఆముదపు దీపమే నయమనుకుంటున్నాను.

ప్రతి గ్రామమూ
పంచాయితీ స్థావరమైపోతున్న ఈ రోజుల్లోనూ
తెల్లగా పూయడంతప్ప మరేమీ తెలియని
మల్లెపూవును చూస్తే జాలివేస్తున్నది.

పొరుగువారి తేనెపట్టులోంచి ఎగిరివచ్చిన
తేనెటీగ మా యింట్లో గులాబీ రసం తాగడం
ఇరుకుగా చుట్టూ గోడలుకట్టుకున్న
ఈ నాడూ తప్పడంలేదు.

జాతీయోద్యమానికి మరెవరి ప్రమేయం లేకుండా
సమిధనయిపోవా లనుకున్న నేను

నా నిమిత్తం లేకుండా జాతీయ ప్రణాళికలు
మూడూ జరిగిపోతుండడం
సహించలేక పోతున్నాను.

దేశంలో నాకు వినా
అందరికీ మేలే జరుగుతున్నట్టున్నది.

(స్వగతం)
మరి నేను తప్పు అంటరూ
ఎంతో కొంత ఏదో అది చేస్తున్నారేమో!

(ప్రకాశంగా)
దశాబ్దిన్నర వెనుక
దేశానికై నిస్వార్థంగా త్యాగంచేసి
అలసిన నేను
దేశం నా కెంతో చేయ్యాల్సున్నదని
ఆవేశపడడంలో అర్థంలేదూ?


(తెరలో)
ఏమో? ఇరవయ్యేళ్ళుగా [ఇన్నాళ్ళుగా]
ఈశ్వరుని కల్పించడానికి కోస్తున్న
నాగమల్లెల మనసులు
ఇంకెన్నాళ్ళయినా ఇట్లే ఉండేట్టున్నాయి.

శిలీముఖంలో కురకడం -
శలభాని కలవాటయినట్లున్నది.

(జనాంతికంగా)
ఐనా నాకు బాగుపడాలనే ఆకాంక్ష
కలిగింది కాని
స్వార్థం పెరిగిందనుకునేరు సుమా!

వ ర వ ర రా వు

దాశరథి మధుమంజరి



ఆమె చెంతకేగు హక్కెవ్వడిచ్చెనో?
గాలి ఆమె పరిమళాలు పీల్చె

మేటి విలుకాండ్రు చచ్చిరి, బోటి చూపు
తూపు ముక్కున గల విషలేపమునకు

బ్రతుకు సొంతము ప్రియురాలి వెదకినాను:
ఇపుడు దేవుని వెదకుట కేగవలసె

పెండ్లి పల్లకిపైన కన్పించు పూలు,
కాని లోపల గలవెన్నొ కరకు ముండ్లు

మమ్ము గూరిచి విన్నట్టి మనిషి యెవరు
ధరణి లైలాను మజ్నూను తలచబోడు

చెలియ నాకోస మిటకు వచ్చినదినేడు!
వేటగాడె ఉచ్చునపడ్డ విధముగాను

ఆమెకు వియోగ, సంయోగమంత ఒకటె,
రాతిబొమ్మకు గుండె యేరీతి కరగు!

పూవుబోణి నడచు త్రోవల, పూవుల
పరువు పరచినాడు మరుడు నేడు

గుండెనెల్ల చీల్చుకొనుట నా కలవాటు,
గొంతు చించుకొనుట కోరబోను

మనసు విచ్చుటయును పుచ్చుకొనుట వేరు,
ముల్లు నీకిష్టమైనచో మల్లె నాకు

కోరికల మొగలిక విచ్చుకొనును లెమ్ము;
మనసు తోటను నేటి కాముని వరించె!

నాకు పెళ్ళయి మా రాణిగారు కాపురానికొచ్చిన కొన్నాళ్ళదాకా రాజభోగం అనుభవించానంటే నమ్మండి. నేనుఏది అడిగితే అగి మరుక్షణంలోనే హాజరయేది నా ముందు. కాని ఆ రాజభోగం కొన్నాళ్ళేనని ముందు చెప్పానుకదూ!



హౌస్ పార్లమెంట్

శ్రీకంఠమూర్తి



దీనికి కారణం నా భార్యకు నామీద ప్రేమలేదేమోనని భావిస్తే మీరు పొరబడుతున్నారన్నమాట! నా భార్యకు నా మీద బోలెడు ప్రేముంది. "హృదయేశ్వరా!" "ప్రాణేశ్వరా!!" వగైరా పదాలతో ప్రారంభమయి, "ఇట్లు మీ చరణదాసి" అన్న వాక్యంతో ముగించబడిన ఉత్తరాలే చెబుతున్నాయి ఆమెకు నా మీద ఎంత ప్రేముందో! మరయితే ఈ మధ్య నన్ను అంత నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నట్టు?

నోరు నొప్పెట్టేదాకా నేను "కాఫీ! కాఫీ!" అని అరుస్తేగాని ఆ గుక్కెడు కాఫీ నే నుండేచోటికి రాదు. అదయినా అరకప్పు కాఫీ తెచ్చి నా ముందు పెట్టేసి గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోతుంది మా ఆవిడ.

పోనీ కన్నతల్లిగదా! మొన్న మొన్నటి వరకూ నా అవసరాలు స్వయంగా తను క్కని అన్నీ అమర్చేదికదా అనుకుని అమ్మను "అమ్మా! కాఫీ అయిందా?" అని అడిగితే "ఇంకా నేనే కావాలేమిరా నీకు కాఫీ చేసివ్వడానికి? నీ పెళ్ళాం వుందిగా అడుగు." అని నిష్కర్షగా అనేస్తుంది.

ఇంట్లో అత్తా-కోడళ్ళిద్దరూ ఎడమొహం పెడమొహం. ఒకరిపొడ మరొకరికి గిట్టదు. ఇంట్లో ప్రతిరోజూ యుద్ధకాండమే అనుకోండి.

"ఇవ్వాళ సాయంకాలం అబ్బాయి రానీ, నీ సంగతేమిటో కనుక్కుంటా!" అని అమ్మ రుసరుస లాడితే, "వస్తే ఏం భయమా? నేనూ చెబుతాను. నన్ను మా పుట్టింటికి పంపించేయండి. నే నిక్కడుండలేను." అని ఈవిడ సాధింపు. ఇద్దరిమధ్యా నలిగిపోతున్నాను.

ఎలాగైనా వీళ్ళ పోట్లాటను మానిపించాలని శతవిధాల ప్రయత్నించాను. సాంసారిక కథావస్తువులతో కూడిన (అత్తా - కోడళ్ళకు సంబంధించిన) సినీమాలన్నీ చూపించాను. ఎన్నో పురాణాలూ, పుణ్యకథలూ, నవలలూ, నాటకాలూ చదివి వినిపించాను. ఉహూఁ ప్రయోజనం లేకపోయిం[illegible] పోనీ ఇంటికి పెద్దకదా అని నాన్నగారి [illegible]రికెళ్ళి "కాస్త వీళ్ళ పోట్లాటను మీరైనా అదుపులో పెట్టండి నాన్నగారూ!" అని వేడుకున్నాను.

"నన్నేం చేయమంటావురా? వాళ్ళు వింటేగా? నువ్వే ఏదైనా ఉపాయం కని పెట్టు" అని తప్పించుకున్నారు నాన్నగారు.

చివరికి చేసేదిలేక నా ఆంతరంగిక మిత్రులను సలహా అడిగాను. వాళ్ళు ఫక్కున నవ్వేశారు.

"ఓస్ ఈ మాత్రం దానికే ఇలా నీరుగారిపోతావేమిట్రా? ఇది అందరిళ్ళల్లోనూ వుండే గొడవే!" అని తేలిగ్గా చెప్పేశారు.

ఇహ లాభం లేదనుకుని రెండు రోజులు ఆఫీసుకు సెలవుపెట్టేసి, నా గదిలో తలుపులు బిడాయించి కూర్చుని తీవ్రంగా ఆలోచించ సాగాను.

ఇలా ఆలోచించగా చించగా ఒక బ్రహ్మాండమైన ఐడియా తట్టింది. వెంటనే ఎగిరి గంతేసి గదితలుపులు రెండూ బార్లా తెరిచి బిగ్గరగా కేక పెట్టాను.

"అమ్మా! ఓసారి ఇట్రా. ఒసేవ్ నువ్వుకూడా. చెల్లాయ్ నువ్వూ, తమ్ముళ్ళూ, నాన్నా అందరూ రండి."

రెండు రోజుల నా మౌనం ఇంట్లో అందరిమీదా బాగా పని చేసిందేమో అందరూ గబగబా వచ్చారు.

"ఇదుగో ఇవాళ్టినుంచీ అత్తా - కోడళ్ళిద్దరూ ఎంతైనా పోట్లాడుకోవచ్చు. నువ్వు కూడా చెల్లాయ్. అందరికీ లైసెన్సు ఇచ్చేస్తున్నాను" అన్నాను.

ఎవరూ నోరెత్తలేదు. గుడ్లు తేలేసి చూస్తూ కూర్చున్నారు.

నేను మళ్ళీ ప్రారంభించాను.

"అయితే ఒక కండిషన్. మీ పోట్లాటంతా నా ముందే జరగాలి. అమ్మా! నువ్వు కోడల్ని తిట్టదల్చుకుంటే దానికి కారణం చెప్పాలి. చెల్లాయ్. నీకూ, వదినకూ కూడా వర్తిస్తా యీ మాటలు. ఇంట్లో నేను లేనప్పుడు మీలో మీరు ఏ కారణంగానూ పోట్లాడుక్కోకూడదు. ఏం? తెలిసిందా?"

అందరూ తల లూపారు యాంత్రికంగా. కాని మా ఆవిడమాత్రం "చాల్లెండి మీ తెలివి" అన్నట్లు చూసింది నా వైపు.

చెల్లాయి ఉండబట్టలేక పైకే అడిగేసింది ధైర్యంగా.

"అయితే ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చుంటావా అన్నయ్యా? మా పోట్లాటలు వినడానికి?"

వెంటనే మరో అస్త్రం ప్రయోగించాను.

"ప్రతి ఆదివారం మధ్యాహ్నం రెండింటికి మీటింగు పెడతాను. మీ గొడవలేమిటో అప్పుడు చెప్పుకోవాలి. నాలుగు గంటలకల్లా మీటింగు అయిపోతుంది."

ముగ్గురాడవాళ్లూ ఆశ్చర్యంతో "ఆఁ!" అన్నారు ఒక్కసారిగా.

"ఆఁ లేదు వూఁ లేదు. నేను చెప్పినట్టు జరిగితీరవలసిందే! ఇంట్లో వంట, భోజనాలు, పిల్లలను బడికి పంపడం, నాన్నగారి పూజ - అన్నీ వేళకు సరిగ్గా జరిగిపోవాలి.... ఆఁ....ఈ రోజు సోమవారం. వచ్చే ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మీటింగు. గుర్తుంచుకోండి" అనేసి గబగబా బయటికి వెళ్ళిపోయాను.

ఆ రోజు సాయంకాలం షికారు బయలుదేరేముందు మా ఆవిడ గదిలోకొచ్చి తవ్వడం ప్రారంభించింది. నేను ఎంతకూ పలకరించక పోవడం చూసి తన మాట మొదలెట్టింది.

"ఏమండీ అత్తగారు నన్ను...." అని దీర్ఘం తీయబోయింది.

మధ్యలోనే ఒక్క ఉరుము ఉరిమాను.

"ఈరోజు ఆదివారం కాదు."

"ఇవ్వాళ నేను సినిమాకు రాను. మీ రొక్కరే వెళ్ళరండి" అని గొణిగింది మూతి ముడుచుకుని.

"నీ ఇష్టం. కాని ఇవ్వాళ నాతో రాకపోయావా, ఇహ జన్మలో సినిమా పేరెత్త కూడదు, అంతే!"

ఆమె మారు మాట్లాడకుండా వచ్చింది.

మర్నాడు భోజనాలకు కూర్చున్నప్పుడు "ఒరే అబ్బాయ్! కాస్త నువ్వయినా చెప్పరా నీ పెళ్ళానికి. అస్తమానం...." అని ప్రారంభించింది మా అమ్మ.

"ఈరోజు ఆదివారం కాదమ్మా" అని ఆమె మాటలు తుంచేశాను.

"అది కాదురా!.... వంట అయ్యేటప్పటికి...."

"అదంతా నాకు తెలీదు. ఆదివారం రెండు గంటలదాకా నేను ఏగొడవావినను." అని ఖచ్చితంగా చెప్పేసి చెయ్యి కడుక్కోవడానికి లేచాను.

ఆదివారం రానే వచ్చింది. ఆరోజు ఉదయంనుంచీ మాయింటి వాతావరణమే మారిపోయింది. ఏదో భయం. ఆతురత. కుతూహలం. అందరి ముఖాలలోనూ ద్యోతక మవుతున్నాయి. ఇంటి పనులు మాత్రం చకచకా జరిగి పోతున్నాయి. నే నిదంతా గమనిస్తూనే వున్నా. ఏమీ ఎరగనట్టు ఉండిపోయాను.

భోజనం కాగానే "రెండు గంటలకు లేపండి " అని అందరికీ వర్తించేటట్టు చెప్పి నాగదిలోకి వెళ్ళిపడుకున్నాను. మా ఆవిడ ఏదో పనివున్నట్టు నాలుగైదు సార్లు గదిలోకి వచ్చి.నన్ను లేపడానికి ధైర్యం చాలక వెళ్లిపోయింది. నేను మెలుకువగానే వుండి ఇదంతా గమనిస్తున్నాను.

రెండుగంటలకు ఇంకా పదినిమిషాలు ఉందనగానే వచ్చింది మా ఆవిడ.

"ఏమండోయ్! కాఫీ అయింది. లేవండి." అంది నన్ను తట్టి లేపుతూ. నేను లేచి కాఫీ త్రాగి మాతమ్ముణ్ని కేకేశాను.

"ఒరేయ్ బుజ్జీ! ఇటు రారా!! కాస్త ఆ జంపకాన ఇక్కడ వెయ్యి. ఒరేయ్ వాసూ! నువ్వు రెండు కుర్చీలు పట్రా. అలాగే నాన్నను కూడా పిలు."

హాలులో మీటింగుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ నిమిషాలమీద జరిగి పోయాయి.

"నాన్నా : మీరిటురండి. ఈ కుర్చీ మీద కూర్చోండి" అని నాన్నగారిని కుర్చీలో కూర్చోపెట్టాను.

ఇంతలో గడియారం రెండుసార్లు మ్రోగింది.

"ఆఁ ! ఇహ అందరూ రావచ్చు" అని చెప్పి నేను కుర్చీలో కూర్చున్నాను.

తమ్ముళ్ళిద్దరూ చెల్లెళ్ళు ముగ్గురూ జంపకానామీద కూర్చున్నారు. అమ్మ గుమ్మంలోనూ మా ఆవిడ గోడవారగానూ నిల్చున్నారు.

నేను గొంతు సవరించుకుని మొదలెట్టాను.

"నాన్నా ! మనింట్లో వుండేది మొత్తం తొమ్మండుగురం. ఈ హైదరాబాదు వంటి పెద్ద నగరంలో నా కొచ్చే 180 రూపాయలతో సంసారం గడపడం కష్టమే ఆయినా భగవంతుడి దయవల్ల ఎలాగో గడిచిపోతున్నది. అలాంటప్పుడు ఇంట్లోవున్న ముగ్గురాడవాళ్ళూ వూరికే వుండలేక ఇలా అస్తమానం పోట్లాడుకోవడం ఏం బాగుంటుంది చెప్పండి. పగలల్లా ఆఫీసులో చచ్చేంత చాకిరీ చేసి సాయంకాల మయేటప్పటికి అలిసిపోయి. ఈఘరోమంటూ ఇల్లు చేరుకునే మగవాళ్ళను. ఇంట్లో అడుగుపెట్టిందే తడవుగా వీళ్ళ పోట్లాటలు విని పరిష్కరించమని వేధిస్తే వాళ్ళ గతేంకాను ? చెప్పండి. కాబట్టి ఇవన్నీ బాగా ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చాను. ప్రతి ఆదివారం హౌస్ పార్లమెంటు సమావేశం కావడం. ఇదే ఆ నిర్ణయం. వారాని కొకసారి నూటిరవై నిమిషాలు వీళ్ళకు ఫ్రీ అన్నమాట. ఆ వ్యవధిలో అందరూ తమ తమ గొడవలను చెప్పి ముగించాలి. ఈ రెండు గంటల టైం దాటిపోయిందంటే మళ్ళీ వారం రోజులదాకా ఎవరూ నోరెత్తడానికి వీల్లేదు. ఏమంటారు ?"

"ఏమన్నా చేసుకోరా నీఇష్టం." అన్నారు నాన్నగారు నిర్లిప్తంగా.

ఒకసారి అందరివంకా చూశాను. అందరూ ఏదో నేరం చేసిన వారిలా తలలు వంచుకుని నేల చూపులు చూస్తున్నారు.

"పోయిన సోమవారం నుంచి నేటి వరకూ మీరు పోగుచేసుకున్న ఫిర్యాదు అన్నీ ఇప్పుడు చెప్పండి వింటాము. మొదటి ఛాన్సు నీకు చిట్టీ ! త్వరగా చెప్పేయ్ ." అన్నాను చెల్లాయి నుద్దేశించి.

చిట్టి మాట్లాడలేదు. ఒకసారి అమ్మ వంకా, మరోసారి వదినవంకా చూసి తల దించుకుంది.

ఆమె మాట్లాడక పోవడం చూసి మళ్ళీ నేనే అన్నాను.

"ఎవరి మనసులో ఏముందో అంతా ఇప్పుడే చెప్పేయాలి. మీటింగు అయిపోయిన తరువాత ఎవరూ బాధ పడకూడదు."

ఈసారికూడా చిట్టి నోరు మెదపలేదు.

"ఇ[illegible]చూడు చిట్టీ ! ఒక్కొక్కళ్ళనూ మూడేసి సార్లు అడుగుతాను. ఆ తరువాత ఛాన్సు దొరకదు. ఊఁ.... మొదలెట్టు."

"................"

"సరే, ఇదివరకే రెండు సార్లడగడమైంది. ఇహ ఆఖరు సారిగా అడుగుతున్నాను. చెబుతావా చెప్పవా? "

"ఇలా నిలదీసి అడిగితే ఏం చెబుతారన్నయ్యా? " బిక్కమొహం వేసుకుని అడిగింది చిట్టి.

"ఇంకెలా అడగాలి? ఊఁ! త్వరగా కానీయి. చూడు అప్పుడే పది నిమిషాలు గడిచి పోయాయి." తొందర పెట్టసాగాను.

ఏం చెప్పాలో తెలీక చివరికి "ఏమీ లేదు" అనేసింది చిట్టి.

"వెరీగుడ్" అనేసి మా ఆవిడ వైపు తిరిగాను.

"ఇహ నీవంతు."

"ఏమీలేదు." ఈ ఒక్కమాట చెప్పేసరికే మొహం చెమటపట్టి. కాళ్ళు వణకసాగా యామెకు.

"ఆఁ! ఏమిటి? ఏమీలేదా? అయితే మరీ మంచిది. అమ్మా! ఇహ నువ్వు మొదలెట్టు." అమ్మవైపు నూటిగా చూసే ధైర్యం లేక కుర్చీ చేతులమీద గోళ్ళతో గీస్తూ అన్న మాటలివి.

"ఒరేయ్, నీకిదేం పోయే కాలం వచ్చిందిరా?, నేరంచేసిన వాళ్ళనడిగి నట్టు ఇలా



నిలదీసి అడిగితే ఏం చెబుతార్రా? " అంత వరకూ బిగబట్టుతున్న కోపాన్నంతా కక్కేసింది అమ్మ. ఆ కోపాగ్ని వేడికి నా మనసెక్కడ కరిగి పోతుందోనని భయపడ్డాను. అలా జరగలేదు.

"ప్రతిరోజూ మీలో మీకు పోట్లాటలెందుకొస్తాయ్ ?"

"ఏమో బాబూ ! నాకలా చెప్పడం చాత కాదు."

"అంటే చెప్పవలిసిం దేమీ లేదనేగా అర్థం ?"

"పోనీ అలాగే అనుకో మహానుభావా ! ఇంతకీ నిన్ననవలసిందేమీ లేదులే. నా ఖర్మం కాలి నీలాంటి సుపుత్రుణ్ని కన్నందుకు మా బాగా చేస్తున్నావు....వచ్చే ఆదివారం వరకూ జరిగినవన్నీ చిట్టిచేత వ్రాయించి పెడతాలే" ఉక్రోషంతో అంది మా అమ్మ.

"అయితే ఇవాళటి కేం లేదన్న మాట !"

"లేదు"

నా మీదినుంచి పెద్దబరువు దిగిపోయినట్లయింది. నాన్నవైపు తిరిగి "నాన్నా ! మీరూ విన్నారుగా అంతా ? ఇహ వచ్చే ఆదివారందాకా ఇంట్లో ఏ గొడవా వుండదులెండి" అన్నాను.

అక్కడితో మా తొలి సమావేశం ముగిసింది.

పిల్లలంతా పెద్దగా అరుస్తూ బయటికెళ్ళిపోయారు. అమ్మ, చిట్టి ఇద్దరూ వంటింట్లోకెళ్ళి గుస గుస లాడుకోసాగారు. మా ఆవిడ రుస రుసలాడుతూ వెళ్ళి మంచంమీద పడింది.

ఆరోజు రాత్రి సినిమాకెళ్ళి వచ్చేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఆ గంభీర వాతావరణం చూసి సందేహిస్తూనే లోపలికి అడుగు పెట్టాను. అయితే భయపడవలసినదేమీ జరగలేదు ఇంట్లో. బాత్‌రూంలోకెళ్ళేటప్పటికి వేణ్ణీళ్ళు సిద్ధంగా వున్నాయి

కాళ్లూ, చేతులూ కడుక్కుని వంటింట్లోకి వచ్చేసరికి భోజనం రెడీ ! అది ముగించి గదిలోకి వచ్చేసరికి పక్క సిద్ధం. ఇన్ని ఏర్పాట్లూ నిశ్శబ్దంగా జరిగిపోతూండడం చూసి లోలోపల సంతోషిస్తూ పక్కమీద వాలానో లేదో ధుమ ధుమ లాడుతూ గదిలోకి ప్రవేశించింది శ్రీమతి.

"ఇంట్లో ఎవరు ఏమన్నారో స్పష్టంగా అదీ వాళ్ళముందే ఎలా చెప్పి చావనండీ ! ఆఁ ! చాల్లెండి దొంగనిద్ర. కట్టుకున్న పెళ్ళాం ఏమైపోయినా మీ కక్కర్లేదు.... సాయంకాలం మీ రటు వెళ్ళగానే ఇంట్లో వాళ్ళందరూ నా మీద ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. మీకు ఏదో మందు పెట్టానట. మిమ్మల్ని లోబరచుకుని ఇంట్లోవాళ్ళనందర్నీ వెళ్ళగొట్టాలని పన్నాగం పన్నానట. పచ్చగా కళకళ లాడుతున్న కాపురాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నానట. ఇంకా ఏమిటేమిటో నోటికొచ్చినట్టల్లా అన్నారు."

వాక్ప్రవాహం ఆగిపోయి కళ్ళల్లోంచి గంగాప్రవాహం మొదలయింది.

ఆ ప్రవాహంలో పడి కొట్టుకుపోయేవాణ్నేమోగాని, అంతలోనే "ఆలికి అలుసివ్వకు" అన్న సామెత గుర్తుకొచ్చి నిగ్రహించుకున్నాను.

"వచ్చే ఆదివారందాకా ఎవరిమీదా ఏ విధమైన ఫిర్యాదులూ చెప్పకూడదు. అందులో నీ తప్పేమీ లేకపోతే మీటింగులో నిర్భయంగా చెప్పుకోవచ్చు. ఎవరికీ భయపడవలసిన అవసరంలేదు" అని చెప్పి ముసుగుతన్ని పడుకున్నాను. ఒకవేళ ఆమె మొహంలోకి చూస్తే మళ్ళీ జావలా అయిపోతానేమోనన్న భయం లోలోపల పీకుతూనేవుంది.

రెండవ ఆదివారం వచ్చింది. మధ్యాహ్నం రెండుగంటలకు మళ్ళీ ఇంట్లో వాళ్ళందరం సమావేశమయ్యాం. అందరికన్న ముందు అమ్మ ప్రారంభించింది.

"ఇదుగో అబ్బాయ్. నేను వంట చేసేటప్పుడు కావలసిన వస్తువు లందించకపోతే, నే నసలు వంటే చేయను."

అమ్మకింత ధైర్యం రావాలంటే ముందే ఆలోచించుకుని పెట్టుకొని వుండాలికదా.

"ఏరోజు నీ కోడలు ఎందుకలా చేసిందో ఆలోచించావా అమ్మా ?"

"అవున్లే తప్పు చేసింది నీ పెళ్ళాం కాబట్టి అవన్నీ ఆలోచించాలేమో ! అలాంటప్పుడు నువ్వేందుకున్నట్లు ? ఈ వెధవ మీటింగు ఎందుకు పెట్టినట్లు ?"

"అది కాదమ్మా ! నీకు కావలసిన వస్తువులు అందించకపోవడానికి కారణమేమిటి అని ?"

"నువ్వు చెప్పవే చిట్టీ."

అమ్మ పురమాయింపుతో చిట్టి కాస్త ముందుకు జరిగి,

"ఇవ్వాళ పొద్దున్నే అన్నం తప్పాలా అందివ్వమని అయిదుసార్లు కేకేసింది అమ్మ" అంది.

అదబడుచు మాట్లాడడం మొదలెట్టగానే శ్రీమతి కెక్కడిలేని కోపమూ వచ్చి మధ్యలోనే అంది :

"నే నప్పుడు బాయిలర్‌లో నీళ్ళు నింపుతున్నానండి. అక్కడే చెక్కమీద బోర్లించానని ఎన్నిసార్లరచినా వినిపించుకోకపోతే నేనేం చేయను చెప్పండి ? ఇంతకూ చిన్నమ్మాయిని పిలిచి చెప్పానుకూడా. అమ్మతో చెప్పమని"

"అవునన్నయ్యా ! వదిన చెప్పగానే నేను వెళ్ళి అమ్మతో చెప్పాను." అంది చిన్నచెల్లెలు.

అందరూ కలసి చివరికి తననే తప్పు పట్టడం సహించలేక పోయింది అమ్మ.

"తనే వచ్చి ఇచ్చివుంటే చేతులరిగిపోయేవా అంట ?" అని కాసేపాగి మళ్ళీ "నీళ్ళు మరిగిపోతున్నాయి. కాసిని చన్నీళ్ళు పోసి రమ్మంటే వున్న నీళ్ళన్నీ పోసి చల్లగా చేసేసింది. ఆ చన్నీళ్ళు పోసుకుని పిల్ల లేమైపోవాలని ?" అంది కోడలివైపు కొరకొర చూస్తూ.

"అమ్మ చెప్పిందంతా నిజమేనా ?" అని అడిగాను మా ఆవిడను.

"అంటే నే నబద్ధాలకోర్ననా. నీ కెందుకే శ్రద్ధ? కం ?" గయ్యిమని లేచింది అమ్మ.

"నువ్వు కాస్త వూరుకోమ్మా. నే నడిగింది నీ కోడలిని. దానికి సమాధానం ఆమే చెప్పాలి. ఊఁ ! చెప్పు"

"..........."

"అలా నోరు మూసుక్కూర్చుంటే కుదరదు."

"మరీ అంత చల్లారలేదండీ ! గోరువెచ్చగా వున్నాయి. నేను అలా ఎందుకు చేస్తానండీ ?" మెల్లిగా నోరు విప్పింది.

"ఏంలేదు. నీళ్ళన్నీ చల్లారిపోయి వున్నాయి. నేను చిట్టిని చూడమన్నాను కూడా" అమ్మ సాధింపు.

"అవును. చల్లగానే వున్నాయి" చెల్లెలి సాక్ష్యం.

"పోనీలేరా. దానికంత గొడవెందుకు?" అన్నారు నాన్న సానుభూతిగా.

"ఇంకెప్పుడూ అలా చేయనులెండి." శ్రీమతి సంజాయిషీ.

కళ్ళల్లోంచి గంగాభవాని ప్రత్యక్షమయింది.

అంతటితో ఆనాటి సభ ముగిసింది.

ఇంటికి మూలస్తంభాల్లాంటి ముగ్గురాడవాళ్ళనూ రెచ్చగొట్టాను గదా ఇహ వీళ్ళ మధ్య బ్రతకడమెలాగా.! అన్న ప్రశ్న బృహదాకారం దాల్చి నిల్చుంది నాముందు. తిన్న తిండి వంటపట్టడంలేదు. రాత్రింబవళ్ళు ఇదే చింత.

మా యింటి వాతావరణమే మారిపోయింది హఠాత్తుగా. ఒకరితో మరొకరు మాట్లాడడమే అరుదైపోయింది. ఇంట్లోని పనులన్నీ సైగలతోనే జరిగిపోతున్నాయి.

అదృష్టవశాత్తూ మధ్యలో రెండువారాలు క్యాంపుకెళ్ళవలసి వచ్చింది. ఈ దుర్భర వాతావరణంలోనుంచి కొన్నాళ్ళపాటయినా తప్పుకుని హాయిగా వుండవచ్చుకదా అని సంతోషమైంది నాకు.

క్యాంపు వెళ్ళి రెండు వారాల తరువాత తిరిగి వచ్చేశాను.

మరో ఆదివారం రానేవచ్చింది.

ఆరోజు సమావేశం అనుకున్నప్రకారం, అంటే రెండుగంటలకు ప్రారంభమయింది.

ఎలా ప్రారంభించాలా అని బుర్ర గోక్కుంటున్నాను. ఇంతలో అమ్మే మొదలెట్టింది :

"ఇంటి యజమాని అయితే మాత్రం నెత్తిమీద కొమ్ము లుంటాయేమిటి ? వేళకు సరిగ్గా వచ్చి తిండి తినక్కర్లా ?" అక్కసుగా అంది.

"నెలకొకరోజైనా కాస్త ఇంటిగొడవలు పట్టించుకోపోతే ఎలాగండీ? ఇంట్లో ఏ వస్తువులున్నాయో, ఏవి లేవో కనుక్కొని తెచ్చిపడేస్తే ఇటు చేసేవాళ్ళకీ అనుకూలం, అటు ఓనేజిమెంట్ సజావుగా వుంటుంది" బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది మా ఆవిడ.

"ఎయినా నీకు బొత్తిగా ఏమీ తెలీదబ్బాయ్! అసలే ఆమెది నాజూకు శరీరం దానికితోడు తొలిచూలు కూడా; ఎంత జాగ్రత్తగా చూసుకోవాలీ ఏం కథ ?"

నా చెవులను నేనే నమ్మలేకపోయాను. అమ్మేమిటి ? అలా మాట్లాడడమేమిటి ?

మొత్తానికి ఆరోజు తాము చెప్పవలసిన మాటలను మరొకరిచేత చెప్పించి అందరూ మంచివాళ్ళయిపోయారు. టపాకాయల్లా పేల్తున్నాయి మాటలు. నాకు జవాబుచెప్పడానికి కూడా వ్యవధినివ్వటం లేదెవరూ. ఆ ధాటికి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరయి పోయి. నోరు వెళ్ళబెట్టి కూర్చుండిపోయాను. ఒళ్ళంతా చెమట పట్టేసింది.

"ఇవాళ మేం మందరం చిక్కడపల్లి గుడి కెళ్ళాలనుకుంటున్నాం. మళ్ళీ చీకటి పడేలోగా వచ్చి వంట చేసికోవాలి" అంటూ లేచి వెళ్ళిపోయింది మా ఆవిడ-నా జవాబు కెదురు చూడకుండానే. ఆవిడ వెనకాలే అందరూ లేచి వెళ్ళిపోయారు.

నా బుర్రనిండా ఏవేవో ఆలోచనలు పుట్టుకొచ్చాయి.

"వీళ్ళందరూ ఎలా ఒకటయ్యారు ?"

లేచి పచార్లు చేయ నారంభించాను. నా పచార్లకు హాలు, పడకగది, వంటిల్లు, వసారా ఇవేవీ చాలలేదు.

ఎంత ఆలోచించినా జవాబు వెతుక్కోలేకపోయాను. చివరికి వినుగుపుట్టి నాన్నగారి ముందు వెళ్ళి నిలబడ్డాను. నాన్న గురకపెడుతున్నారు కుర్చీలోనే.

"నాన్నా : నాన్నా :"

"ఏరా ? ఏమంటుంది ?" ఉలిక్కిపడి కళ్ళు తెరిచారు నాన్న.

"మరేంలేదు. ఇహ ఇవ్వాళటినుంచి ఆదివారం సమావేశాన్ని ఆపుచేస్తున్నాను."

నాన్న మాట్లాడలేదు. కాసేపు ఆలోచించి.

"ఆపుచేస్తున్నాననకు. కొంతకాలం వరకూ వాయిదా వేస్తున్నానని చెప్పు. మళ్ళీ ఎప్పుడైనా పనికివస్తుంది నీ యీ 'రామబాణం' " అన్నారు.

ప్రవల్లిక


ఏ నిశ్శబ్ద ప్రపంచాలమధ్య
ఏంవిటి నీ కళ్ళు మాట్లాడుతున్నాయి
ఉత్తర ధ్రువంలో మంచువంటి తెల్లని
హృదయంగలదానా ఆడదానా
ఎన్ని పూర్వజన్మల స్మృతుల జాడలు
ఈ క్షణంలో నీ కనురెప్పల నీలి నీడలు

నక్షత్రాలమధ్య ఆకాశంవంటి
నల్లని కళ్ళదానా ఓ ఆడదానా
సృష్టి ముందటి చీకట్లోంచి ఏరుకున్న
సౌందర్యాన్ని నీ కళ్ళల్లో నింపుకున్నావు
సృష్టిచివర లయంలోని శూన్యాన్ని నన్ను
స్పష్టమవని కామంతో బంధించుకొన్నావు.

చీకటివంటి నీ విచిత్రవీక్షణాకర్షణకి
సంధ్యాగగనంమీద ఎర్రని ఆందోళనని నేను
క్షితిజ రేఖలా వొంగిన నీ భుజాలు వొంపుదగ్గర
చెదరి విరిగిన సముద్రపు కెరటాన్ని నేను
ఆడదానా అద్భుతమైనదానా [illegible]క్యణత్ వీణా
అర్థంలేని నన్ను చుట్టుకొన్న [illegible]రమార్గానివి నువ్వు.

దట్టమైన అడవులలోని నిగూఢ రహస్యాలు
దాచుకున్న కన్నులుకలదానా ఆడదానా
స్వర్గనరకాల సరిహద్దులమధ్య నిలిచి నీవు
సమ్మోహమంత్రం జపించే శృంగారావధీ। విధీ।
నాకు తల్లివి నెచ్చెలివి చెలివి
నన్ను కౌగలించుకున్న పెద్దపులివి.

బాలగంగాధర తి[illegible]



ఆలోచనకి అందని పూర్వస్మృతిలాగా. రైలు అనుమానంతో కదిలింది. ప్రయత్నాలకి లొంగని ఆశల్లాగ దృష్టిని దాటుకొని దీపాలు వెనక్కి పోతున్నాయి. ప్లాట్‌ఫారమ్ వెనక్కి జరిగిపోయింది.

ఆలోచనలు వద్దనుకొంటున్నా ముందుకు త్రోసుకుపోతున్నాయి. నగరం 'చీకటితెర' వెనక చెరిగిపోతోంది. ఈ నగరంలోనే తన ఆశలూ, ఆనందం అన్నీ చెరిగిపోయాయి. గతం మనస్సుని కదిలించి, కళ్ళలో నీటిని త్రిప్పింది. పడమటి ఆకాశంలో మెరిసే ఒంటరి నక్షత్రం కంటి నీటిలో వెయ్యి వెలుగులుగా చెదిరిపోయి— అంతలో చీకటయింది.

రైలుకూత తట్టిలేపింది. చుట్టూచూసింది ఆమె. కంపార్టుమెంటులో ఎంతోమంది లేరు. ఓమూల నిద్రపోతున్న వృద్ధుడూ

రైలు పరుగును గమనిస్తున్న కుర్రవాడూ, మరి నలుగురూ ఎదురుగా కనిపించారు. ఇవతలి చివరి కిటికీ చల్లగాలికి తోడుగా తను. తన కెదురుగా సీతాపతి రైలు కదిలిన అరగంటకి గుర్తుపట్టింది. అవును. సీతాపతే. సందేహం లేదు. నుదుటి మీద చిన్న మచ్చ. ఎప్పుడూ నవ్వుతున్నట్టుండే పెదాలూ — బాగా గుర్తు. తను పై బల్లల నీడలో వుండిపోయింది. అతనింకా చూడలేదు. అతనిపక్కనే — భార్య కాబోలు - కూచొని కునుకుతోంది. వొడిలో చంటిపిల్ల. రైలుదీపం వెలుగులో సీతాపతిలో మార్పుని గమనించడానికి ప్రయత్నించింది ఆమె. చాలా మారిపోయాడు. పెదాలమీద నవ్వు కాస్తా చెరిగి, పట్టుదల సిద్ధమవుతోంది. తనకి తెలిసిన సీతాపతికి ఇరవై రెండేళ్ళు. ఇప్పుడు ముప్పదేళ్ళ సీతాపతి.

భర్తతోపాటు విజయవాడతో సంబంధం తీరిపోయి రెండేళ్ళయింది. జీవితంలో తను యింతగా ఎప్పుడూ నష్టపోలేదు. చిరునవ్వుతో, స్మితవదనంతో పలుకరించే భర్త లోపించాడు. అప్పుడు వాటి విలువ అర్థమయేదికాదు. ఆడదానికి కొన్ని అవకాశాలూ, ఆశలూ జారిపోయాక మెలకువ కలుగుతుం దనిపించింది. అప్పటి సుఖం, ఆ రోజులూ, కృష్ణానదిముందు గడిపిన రాత్రులూ, ఇప్పటి ఒంటరితనంమీనా, నిస్సహాయతమీనా పగ తీర్చుకుంటున్నట్లున్నాయి; అనుభవాలకంటె, జ్ఞాపకాల శిక్ష ఎంత ఘోరమైనదో యిప్పుడర్థమవుతోంది—ఏమయినా ఈ కలవరం కరిగిపోయేదికాదు.

ఆలోచనలు తెరలు తెరలుగా కమ్ముకుంటున్నాయి మనస్సులో. చీకటిమధ్య ఎక్కడో వెలుగు మెరిసి అంతలో మాయమయింది.

తను విశాఖపట్నంలో ఉంటున్న అన్నయ్య ఇంటికి వెడుతోంది. అన్నయ్యని చూడగానే పుట్టెడు దుఃఖం. తనమీద సానుభూతిని చూపడానికీ, దుఃఖాన్ని పంచుకోడానికీ యింకెవ్వరున్నారు—ఈ అన్నయ్య తప్ప.


ఎదురుగా సీతాపతిభార్య చీరకొంగు సవరించుకొని, నుదుటి కుంకుమ సరిచేసుకొంది. తనూ చీరకొంగు సవరించుకొంది. నుదుట కుంకుమ లేదు. జీవితమంతా తనతో బ్రతకడానికి ఎన్నిక చేసుకొన్న నేస్తం హఠాత్తుగా దాన్ని చెరిపేసిపోయాడు. కలలోలాగా ఆ సంతోషం కరిగిపోయింది.

కన్నీరు చేతిమీదపడినా చలివేస్తోంది. నరాల్ని కొరికే చలి.

సీతాపతి చలిగాలికి వణికి, పైమీదవున్న శాలువాను చుట్టూ తిప్పుకొంటున్నాడు.

ఎనిమిదేళ్ళక్రితం సీతాపతికి తనమనస్సు చెప్పిన నిర్వచనాన్ని ఊహించుకొన్నది. ఎనిమిదేళ్ళక్రితం సీతాపతిని తను 'పతీ' అని పిలిచింది. అతను 'సీలీ' అనేవాడు. అలామరొక్కరే తరువాత పిలిచారు. ఇప్పుడిక ఎవరూ పిలవరు.

కె. వివేకానందమూర్తి



తనూ, పతీ ఓ కాలేజీలో చదివారు. తనకు ప్రేమంటే ఏమిటో పతిని చూశాకనే తెలిసింది. అతని కళ్ళు తనకు 'కోరిక' మీద మొదటిపాఠాన్ని నేర్పాయి. అప్పట్లో తనకు పతినిగురించి పూర్తిగా తెలియక పతికి ప్రేమంటే తెలియదనుకొన్నది.

పతి, తన అన్నయ్యకిప్రాణస్నేహితుడు. వాళ్ళస్నేహం తనకి అవకాశాన్ని కల్పించింది. పతి అన్నయ్యకోసం వచ్చేవాడు. తను పతికి అట్లా మనస్సులో దగ్గరపడడానికి అన్నయ్యతో స్నేహమే కారణం. అన్నయ్యా పతీ గంటల తరబడి మాట్లాడుతూండేవారు. వాళ్ళ మాటలకి కాలం ఎప్పుడూ చాలనట్లే అనిపించేది. పతి ఎంతసేపువున్నా తొందరగానే వెళ్ళిపోయినట్టనిపించేది. తనకు మధ్యలో కలుగజేసుకుని మాట్లాడాలని ఉండేది. కాని ఇరవై ఏళ్ళ యౌవనానికి ధైర్యం చేతకాలేదు - సిగ్గూ, పిరికితనం తప్ప. కళ్ళు మాట్లాడుకునేవి.

ఇప్పుడతనికళ్ళు చూసింది. చీకట్లో దేన్నో వెతుకుతున్నట్టున్నాయి. ఆమెవేపు

చూడడంలేదు.

రైలు ఎంతకీ తరగని దూరాన్ని గుండె పగులకొట్టే లయతో చీల్చుకుపోతోంది. ఆ 'లయ'కు క్రమంగా విసుగు కలుగుతోంది.

ఆ రోజుని తాను మరచిపోలేదు. అన్నయ్య యింట్లో లేడు. క్రితంరాత్రే ఉద్యోగరీత్యా పక్కవూరు వెళ్ళాడు. పతి, రోజూలాగే యింటికి వచ్చాడు. బాగా గుర్తు. మబ్బువేసిన ఆకాశం - ఉక్కిరి బిక్కిరయిన మనస్సులాగ. డాబా మెట్లపైన మోకాళ్ళమీద తల ఆనించుకు కూర్చుంది తను. టకటకా బూట్లు చప్పుడు చేసుకొంటూ వచ్చి తన కిందిమెట్టుమీద కాలు ఆనించి ఆగాడు పతి. ఒక్క క్షణం గుండె ఆగినట్టనిపించింది. అంత దగ్గరలో పతిని ఎప్పుడూ చూడలేదు. అతనూ త్రుళ్ళిపడ్డాడు. అన్నయ్య లేడని తెలిసింది.

"మిమ్మల్ని చూడలేదు. ఏమీ అనుకోకండి." వెళ్ళిపోతూ అన్నాడు.

తను అతని ముఖం చూసింది. అంత భయపడతాడేం? మగవాళ్ళలో పిరికితనం, భయం బాగుండవు. "అన్నయ్య రాత్రి వరకూ రాడని తెలుసు. "కూచోండి. ఏ క్షణాన్నయినా అన్నయ్య వస్తాడేమో" అన్నాక తనకే నవ్వొచ్చింది. అతను నిజంగానమ్మాడు. అబద్ధానికి అంత విలువ వుందా అనిపించింది. కాని ఆ ఒక్క సాయంకాలం తన జీవితంలో ఎంత పెద్ద జ్ఞాపకాన్ని మిగిల్చిందా అనిపిస్తూంటుంది. ఆరోజు తను ప్రయత్నంతో పతిని ఆపకపోతే, ఇవాళ ఇట్లా పతిని చూడగానే ఆలోచనలు తెగిపోయి ఉండకపోను.

ఎన్నాళ్ళుగానో పరిచయం వున్న మిత్రుల్లాగ ఇద్దరూ మాట్లాడడం ప్రారంభించారు. గంటన్నరసేపు విసుగుదలతో కూచున్నాక నవ్వొచ్చింది.— "అన్నయ్య రాడనుకోండి. ఏం చేస్తారు?" అన్నది తను.

"అంటే?"

"నేను అబద్ధం చెప్పాననుకోండి—"

ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు. "అందమైనవాళ్ళు అబద్ధం చెప్పకూడదు. అయినా చెప్పారుకనక - క్షమిస్తాను"— అన్నాడు.

మనస్సు చివుక్కుమంది — ఎందుకలా చెప్పానా అని. కాని చెప్పకపోతే ఇవాళ ఈబాధ ఎలా దక్కుతుంది.

ఆతర్వాత చాలాసార్లు మాట్లాడుకున్నారు పతీ, తనూ. అతని కళ్ళు ఎప్పుడూ తనని పరీక్ష చేస్తూండేవి. తను మరీ చురుకుగా మాట్లాడితే, "ఇంత తెలివి ఉండడం మంచి అమ్మాయికి అర్హతకాదు." అన్నాడు ఓరోజు.

"అంటే."

"ఆడది అమాయికంగా ఉంటేనేఆనందం కలుగుతుంది. తెలివిగా,గొప్పగా మాట్లాడే స్త్రీని చూస్తే నాకు భయం వేస్తుంది—" నవ్వాడు.

ఆ మాటలు ఎందుకన్నాడో తెలీదు. ఆ రోజు అలా మాట్లాడకపోయినా బాగుణ్ననిపిస్తుంది. కాని ఆ రెండు మాటలనుగురించే ఆమె ఎన్నో నెలలు ఆలోచించింది. జీవితంలో మంచి స్నేహాన్ని ఎన్నుకోవడంలో తప్పటడుగు వేస్తున్నా ననిపించేది. చివరికి ఓరోజు అన్నయ్య 'పతి' విషయం అడిగితే ఇష్టంలేదని తను తల వూపింది. అన్నయ్య ఆశ్చర్యపోయాడు. కారణం అడిగితే ఒక్కటే కనిపించింది.

"అతను పిరికివాడు. ఆడదానిలో చొరవను సహించలేనంత పిరికివాడు. అందుకని వద్దు" అని. అన్నయ్య మాట్లాడలేదు.

పతి మళ్ళీ తనకి కనిపించలేదు. తరువాత రెండేళ్ళవరకూ తన జీవితంలో చెప్పుకోదగ్గ సంఘటన లేవీ జరగలేదు. రెండేళ్ళ తరువాత తనకి ఒక యింజనీరుతో పెళ్ళయింది. విజయవాడలో కాపురం. భర్తతో యాంత్రికంగా రోజులు గడిచింది—ఏడాదిన్నర గడిచింది—మోటారు సైకిలు ప్రమాదంలో భర్త చనిపోయాడు. ఆర్ద్రతతోకూడిన భావాలు తన్ను ఏడిపించాయి. తన దాంపత్య జీవితం విజయవాడలో గడిచింది. భర్త తన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఇప్పుడు తను విజయవాడ విడిచిపెట్టి వెళ్ళిపోతోంది.

చలిగాలి భరించలేక ముసలాయన ఫ్యాను ఆపుచేశాడు. సీతాపతి నవ్వుతూ మాట్లాడుతున్నాడు. ఆమె నిశ్శబ్దంగా వింటోంది— ఎంత అన్యోన్యంగా వున్నారు! భార్యకి భర్తకు అంతకంటె కావలసిందేముంది? వారి అన్యోన్యత, తన మనస్సులో ద్వైధీభావాన్ని మరింత కుదిపింది. ఒక్కసారిగా మనస్సులో భావసంచలనం కలిగింది.ఒక్క క్షణం - పతి తనవాడయినట్టు, ఎవరో పతిని వశపరచుకొన్నట్టు అనిపించింది. తనకు తెలియకుండానే తనలో జుగుప్స ప్రవేశించింది. రెండేళ్ళ పరిధిలో పతి సమక్షంలో జీవితం, అనుభూతులు అన్నీ గుర్తుకొచ్చి మరింతగా మనస్సుని కోతపెట్టాయి.....ఈ ఆలోచనలు మనస్సులో వున్న కాస్త బిగువునీ హరాయించేస్తున్నాయి. ఇప్పుడిక ఏమనుకొనీ లాభంలేదు. - పతికి పెళ్ళయిపోయింది. భార్య దొరికింది. స్త్రీత్వానికి మంచి బహుమతి - కూతురు. ఆ పరిపూర్ణతకి అర్థం తనకు తెలీదు. తెలిసివుంటే బాగుండేదన్న తపనే మిగిలిపోయింది. ఇప్పుడు అనవసరంగా ఈ ఆలోచనలు కదిలాయి. ఎన్నాళ్ళయింది తను సుఖంగురించి ఆలోచించి.... ఇప్పుడు 'పతి' మళ్ళీ పాత జీవితాన్ని గుర్తుచేశాడు. స్త్రీ సహజమైన కోరికా, మనస్తాపం, యిప్పుడు తన మనస్సుని పతినిగురించి ఆలోచించినందుకు కోత కోస్తున్నాయి. పెళ్ళయిన పతిగురించి తనకీ ఆలోచన కూడదు. వారి దగ్గరతనం, అన్యోన్యం తనకి తెలియకుండానే తనమీద పగ తీర్చుకొంటున్నట్లున్నాయి. ఎందుకని? వారి జీవితాలతో తనకేం సంబంధం? ఎంత నచ్చజెప్పినా మనస్సు రాజీ పడడంలేదు. ఒక్క వాక్యంతో, ఒక్క అభిప్రాయంతో తమ జీవితాలు విడిపోయాయన్న కించ గుర్తుకొస్తోంది. ఒక్క అడుగులో తప్పిపోయిన గుర్రపుపందెంలాగ తన జీవితం ఓడిపోయింది.

భోరున ఏడవాలనిపిస్తోంది. ఎనిమిదేళ్ళలో పాత ఆలోచనలు వచ్చినప్పుడల్లా దుఃఖం ఇచ్చినంత హాయి మరేదీ యివ్వలేకపోయింది.

ఏలూరుస్టేషన్లో రైలు ఆగింది. ప్లాట్‌ఫారం దీపాలకాంతి తన ముఖంమీద పడింది. పతి తన్ను చూసి యిప్పుడు గుర్తుపడతాడేమో:—భయమేసింది. ప్రేమించి కోల్పోయిన స్త్రీగా తన్ను భార్యకు పరిచయం చేస్తే ?— తన్ను పతి చూడకూ

డదు. — ముఖం దించుకుని తొందరగా ప్లాట్‌ఫారమ్‌లోనికి దిగిందామె.

గుర్తుపట్టగానే ఎట్లా పలుకరిస్తాడో? ఆ ఒక్కవాక్యం తనని పోగొట్టుకునేందుకు కారణమయిందన్న బాధ అతనికి వుందా?- మగవాళ్ళ అవకాశాన్ని వెదుక్కొని త్వరగా దాటుకుపోతారు. - ఆడవాళ్ళ గతాన్ని పట్టుకు వ్రేలాడుతారు. భార్యతో యిందాకటి అతని నవ్వుగుర్తుకొచ్చాక ఆ ఆశ కూడా మాసిపోయింది. తను అతనికి జ్ఞాపకం ఉండి ఉండదు.

రైలుదిగి, పూలమ్మేవాడి దగ్గరకు నడిచాడు పతి. ఆమె దూరంగా నిలబడింది. పోయి కూర్చుందామనుకున్నది. - ఎవరో పిలిచారు.

"నీలవేణీ!"

గుండె పగిలింది.— ఆ పిలుపు ఎనిమిదేళ్ళ పాతది. కాని అలా పిలిచాడేం? పిలవకపోయినా బాగుణ్ణు. ఇక తప్పించుకుపోవడం సాధ్యంకాదు. దగ్గరికి వచ్చాడతను. అబ్బ! ఎంత దగ్గరికి!

" నువ్వు 'నీలీ' అని పిలిచేవాడివి అప్పుడు"—

అతను ఆశ్చర్యపోతున్నాడు. "ఏమిటి నువ్వా?—ఇక్కడ!! — ఆశ్చర్యం—" తను మాట్లాడకపోతే మరీ ఆశ్చర్య పోతున్నాడు. ఇద్దరికీ కూడా మాట్లాడ్డానికి మాటలు కరువయ్యాయి.

"త్వరగా తెచ్చిపెట్టండి. రైలు కదులుతోంది" అని హెచ్చరిస్తోంది భార్య.

" ఎక్కడ కూర్చున్నావు ? " అంటున్నాడు.

"నీకు ఎదురుగానే"

అడగవలసిన ప్రశ్నలు తప్ప అన్నీ అడుగుతున్నాడు.

"అరె! నేను చూడలేదే!"

"అవును చూడలేదు."

"చాలా మారిపోయావు నువ్వు."

"అవును మారిపోయాను."

"నన్ను గుర్తుపట్టావా?"

"ఆఁ. గుర్తుపట్టాను."

"మరి పలకరించలేదేం?"

"ఏం మాట్లాడాలో తెలియలేదు."

"చాలా విచిత్రంగా కలిశాం ఇవాళ".

"........................"

"చాలా ఆశ్చర్యంగా వుంది నాకు"

"............."

ఆ స్టేషన్లో తను ఏడుస్తుందేమోనని భయమేసింది. అటువంటి ప్రశ్నలతో ఎంతకోత పెడుతున్నాడో అతనికి అర్థంకావడంలేదు.

"లోపలికి రా"

"నీభార్యకు నన్నెలా పరిచయంచేస్తావు" అన్నది చాలాసేపటికి. అతను తుళ్ళిపడ్డాడు. నావేపు వింతగా చూశాడు. అంతలోనే ఫక్కున నవ్వాడు.

"నా భార్యకు నిన్ను పరిచయంచేసే ప్రమాదంలేదు."

తాను దిమ్మెరబోయింది. "అయితే యిదంతా తెలుసా ఆవిడకి?"

రైలుపెట్టెలోంచి విచిత్రంగా మా వైపు చూస్తున్న ముఖం చూశాను.

"ఆ ప్రమాదంలేదు. మాఆవిడకి నిన్ను పరిచయంచేసే ప్రమాదం ఎన్నటికీరాదు. రైలుకదులుతుంది. పద." అన్నాడు తొందరగా.

పతి మల్లెపువ్వులతోనూ, తను ఉరు

కుతున గుండెతోనూ రైలెక్కారు. వాళ్ళ ఎదురుగా తను ఎందుకుకూర్చున్నదా అన్న బాధ ఎక్కువయింది. ఇందాకటికంటే పెద్ద బాధ యిది.

"ఈమె నీలవేణి. ఎనిమిదేళ్ళక్రిందటి పరిచయం. వాళ్ళ అన్నయ్యా, నేనూ చదువుకున్నాం" అన్నాడు ఆమెతో. ఆమె చంటి పిల్లని వాళ్ళోకి మార్చుకుని సమస్కారం చేసింది.

"ఈమె మా వదినె. అన్నయ్య, మద్రాసునుంచి ఢిల్లీ యింటర్వ్యూకివెళ్ళాడు. నేనీమెని యింటికి తీసుకువెళ్తున్నాను.-ఇది మా అన్నయ్య కూతురు." అని నవ్వుతున్నాడు. పతి నవ్వే ఆరోజుల్లో తనకి కోరిక అంటే ఏమిటో చెప్పినంతబలంగా పతి అంటే ఏమిటో చెప్పలేదు.

ఒక్కక్షణం గుండె కొట్టుకోవడం ఆగిపోయినట్టయింది.

భార్యకాదు - భార్యకాదు - అని వెయ్యి గొంతులతోమనస్సుఅరుస్తోంది. ఇందాకవాళ్ల మాటలూ-నవ్వులూ - తను ఆలోచనలను ఎంతగా పెంచుకుంది! ఎంత దురభిప్రాయపడింది?-!

"ఎంతవరకూ వస్తున్నారు?" అన్నది ఆవిడ పతి చేతిలోనిమల్లెపువ్వులు తీసుకుని.


"విశాఖపట్టణం."

"మేము రాజమండ్రిలో దిగిపోతాం." కొన్ని మల్లెపువ్వులుతీసి తనకివ్వబోయింది ఆమె. తాను తీసుకోలేకపోయింది.

"పువ్వులంటే నాకెంతో యిష్టం-పెట్టుకోండి. "

"ఫరవాలేదు. మీరుపెట్టుకోండి - నా కా అదృష్టం తీరిపోయింది."తనకు ఏడుపు ఆగలేదు. ఆమె వెంటనే బాధపడింది.

"తెలియక అడిగాను క్షమించండి.— అవన్నీ కాసేపు మరచిపొండి. బాధపడి



ప్రయోజనంలేదు" ఆమె వ్యథితురాలయింది. ఆమె మల్లెపువ్వులుతురుముకోలేదు. ప్రక్కన పెట్టేసింది.మల్లెపువ్వులు గుబాళించాయి. మల్లెపువ్వుల మత్తులో పాతఅనుభవాలు జ్ఞాపకాన్ని పట్టుకు వేధించాయి.

చంటిపిల్ల ఏడిచింది. ఆమె పిల్లని సముదాయించడంలో మునిగిపోయింది - ఆ అనుభవం తనకి కొత్త-ఆ పిల్లఏడుపు తనస్త్రీత్వంలో అసమగ్రతను ప్రకటిస్తోంది.

గంటక్రితం తన ఆలోచనలు, తన భావాలు ఒక్కసారిగా మనస్సుని తూట్లుపడేటట్లుచేశాయి. తనకు తనమీదే అసహ్యంవేసింది. పతితో రెండేళ్ళ పరిచయం యిప్పుడు తన మనస్సుమీద, తన ఆశల మీద రాజ్యం ఏలింది.

చంటిపిల్ల నిద్రపోయింది. పతి వదినగారికి కునుకుపట్టింది.పతిమాత్రం మౌనంగా కూచొన్నాడు. చీకటివేపు చూస్తున్నాడు. చీకటిలాంటి గతాన్ని ఆ నిశ్శబ్దంలో చదువుకొంటున్నాడు కాబోలు. నవ్వొచ్చింది.

అంతలోనే తనమనస్సు ఎందుకో తేలికయిపోతున్నట్లుంది. ఆమె భార్యకాదు. వారిద్దరి అన్యోన్యం నిజంకాదు. ఆ పిల్ల పతి కూతురుకాదు. తను వూహించిన స్వర్గ సుఖం పతి అనుభవించడంలేదు. ఎంతోతేలికయిపోయింది మనస్సు. గాలిలో తేలిపోతున్నట్టుంది తనకు. ఎందుకని? పతి సుఖం తను వూహించినంతగాలేదనా?- ఏమో? అతనికీపెళ్ళై వుండవచ్చు. నాలుగేళ్ళగా అతనివిషయం ఏమీతెలియదు.భార్య, పిల్లలూ వున్నారేమో-ఏమైనా ఇంతవరకూ చూసినదంతా నిజం కాలేదు. మనస్సు గంతులు వేస్తోంది.

చీకటి రైలుకిదూరంగా మరీదట్టంగాపేరుకొంటోంది. బరువైనగంటలు అర్ధరాత్రి వేపు జరుగుతున్నాయి.

నిశ్శబ్దం ఆసరాగా చేసుకుని మళ్ళీఆలోచనలు కట్లుతెంచుకున్నాయి. ఇంటిదగ్గర పతి భార్య వుండిఉంటుంది. అతనికి ఎందరు పిల్లలో? ఆమెతో అన్యోన్యంగా ఉంటాడో? ఉండేవుంటాడు - పతిలో ఏరకంగానూ, విచారం, విషాదం కనిపించడంలేదు. అందుకని భార్యమీద అసంతృప్తివుండి వుండదు. అదృష్టవంతుడు పతి. తనకాఅదృష్టందక్కలేదు. తనజీవితంలో అప్పుడే చివరి అధ్యాయం వచ్చేసింది. పతి జీవితానికి యింకా ప్రారంభమే అయింది - అతనిభార్య ఎలా వుంటుందో? అడిగితే బావుణ్ను.

కిటికీకి ఆనుకొని నిద్రపోతున్నాడతను. తనకు ఎంతప్రయత్నించినా నిద్రపట్టడం లేదు. పతిభార్యనుగురించి ఆలోచన ఇప్పుడే రేగింది.చల్లగాలి మరీఎక్కువైంది. ఆలోచనలమధ్య ఎప్పుడు వెనక్కి జారబడిందో తెలియదు. వంటిచుట్టూవున్న కొంగు విసురుగా ఒక్కసారి ముఖానికి కొట్టుకుంటే తెలివొచ్చింది. గోదావరినదిమీదనుంచి మెల్లగా పాకుతోంది రైలు. పతిలేచాడు. పాపనిచేతుల్లోకి తీసుకుని 'చూడు వదినా' అంటున్నాడు.

ఆమె చిన్నపిల్లలాగ నవ్వుతూ అటు తిరిగి కూచుంది-ఇటుతిరిగితే పతికి తనుఎదురయింది.

"మా వదినెకి ఇలాంటి ప్రయాణాలు క్రొత్త." నవ్వుతూ భుజంమీదపిల్లని పొందికగా ఎత్తుకున్నాడు. పిల్లలుఉన్నారేమో.

ఆమెకు వినిపించకుండా అడిగింది హఠాత్తుగా.

"మరి నీభార్యకో"

తెల్లబోయాడు, అంతలో బిగ్గరగా నవ్వాడు. వదినె త్రుళ్ళిపడి ఇటుతిరిగింది, "ఏమిటది?" అంటూ.

తనలో వణుకు పుట్టింది.

"చూడువదినా, నాభార్యగురించి అడుగుతోంది ఈమె" నవ్వుతున్నాడు. ఆమెకూడా పక్కున నవ్వింది. అంతలో తనముఖంలో ఆశ్చర్యాన్ని గమనించి ఆగిపోయింది. గోదావరి వంతెనకింద ఇనుపరేకులు విరిగినట్లు శబ్దంవస్తోంది; నది రోదిస్తున్నట్టు, చల్లగాలి చెవుల్ని రాసుకుపోతోంది.

"మా మరిదికి పెళ్ళికాలేదండి" అంటోంది వదినెగారు. మళ్ళీ గుండె ఆగినంతపనయింది-

నిజమా!!—ఎందుకని ? ? — ఎందుకు పెళ్ళిచేసుకోలేదు పతి ? రాజమండ్రి దగ్గర పడుతోంది. అక్కడ దిగిపోతారు వాళ్ళు. ఎందుకు పెళ్ళిచేసుకోలేదు. తనవల్లనేనా?- తను ఆరోజు కాదని త్రోసివేయడం కారణమా ? తనమీద ఆశతోనే మానేసివుంటాడా?- ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి-గోదావరి చల్లగాలి ఉడికిపోతున్న ఆవిరిలాగ చెవులకు తాకుతోంది. రైలు చప్పుడు వినిపించడంలేదు.

ఆలోచనలు —ఆలోచనలు-

పతి పెళ్ళిచేసుకోకపోవడానికి అదే కారణమయితే ఎంతబాగుణ్ను!. మనస్సు ఉరకలువేస్తోంది - నిజంగా తలచినట్లే తనకోసమే బ్రహ్మచారిగా వుండిపోయాడా పతి?- అంతప్రేమవుందా తనమీద?- ఈ ఎనిమిదేళ్ళూ అతనిమనసులో తన ఆలోచనలే ఉన్నాయా?—పతిముఖం క్షణకాలం దీక్షగాచూసింది. బెడ్డింగులు సర్దుతున్నాడు. తనవేపు చూడడంలేదు—

తన ఆలోచనే అతనిలో ఇంతవరకూ వుంటే ? ఎంతబాగుణ్ను!-? ఉంటే ఏం లాభం:- కాని వుంటే, ఎంతబావుణ్ను— ఇక తోచనివ్వడంలేదు మనస్సు-? ఆ ఆలోచన ఉన్నదీలేనిదీ తెలుసుకోవడానికి ఏప్రశ్న వేస్తే సమాధానం చెప్తాడు?

రైలు లంఘించి గోదావరిస్టేషన్ దాటిపోతున్నట్టుంది. ఈమధ్యన పదిగంటలు ఆలస్యమయితే ఎంతబాగుణ్ను?-

"మనఇంటికి ఓసారిరమ్మను వదినా:" అంటున్నాడు పతి,ఆమె యిటుతిరిగిఆహ్వానించింది.

"వస్తాను. వస్తాను." అన్నది తను గాభరాగా - కాని వచ్చిఏంలాభం? - ఎలా వచ్చేదీ?- అనుకునేంతలో మరోఆలోచన-

ఆయన పోయినవిషయం పతికితెలుసా? ఏం ఆలోచిస్తాడో తెలిస్తే?

తన ఒంటరితనం అతనికేమైనా ఆశనిస్తుందా?-

తెల్లబోయిచూస్తాడా?- అప్పుడింకా తన గురించి ఆలోచిస్తాడా?-

రాజమండ్రి ప్లాట్‌ఫారందీపాలు దూరంగా కనిపిస్తున్నాయి. పిల్లని తనచేతిలోకి తీసుకున్నాడు పతి.

తనమనస్సుతీసే పరుగులు అతనికితెలిస్తే బాగుణ్ను. ఎలా?- ఇన్నిప్రశ్నలు ఇలాగే మిగిలిపోతే - మరోక్షణంలో గుండె పగులుతుంది.

రైలు ఆగుతూచేసిన శబ్దం పది అగ్నిపర్వతాలు బ్రద్దలయినట్లనిపించింది. పదినె దిగింది.

కూలీలు సామానులు తీస్తున్నారు.

ఎవరో ముసలాయనవచ్చి ఆమెనుపలకరిస్తున్నాడు-మామగారుకాబోలు - పతి దిగిపోతాడా-తనని పలకరించడా?-

ఒకేప్రశ్న —

"మరి వెళ్తాను నీలవేణీ - ఎప్పుడన్నా ఇక్కడదిగు - ఆర్ట్సుకాలేజీలో లెక్చరర్ని నేను."

"పతీ !"

ఆశ్చర్యపోయి ఆగాడు పతి.

కంపార్టుమెంటులో గొడవగావుంది.

గార్డు ఈలవేశాడు.

తండ్రి పిలుస్తున్నాడు.

కిటికీదగ్గరగావచ్చి 'చెప్పు' అన్నాడు.

అతనికళ్ళ ఇంకానవ్వుతున్నాయి-

"ఆయన పోయారు తెలుసా ?"

"అవును. పాపం. పేపర్లో చదివాను. మీఅడ్రసు తెలీదు. రాసేవాణ్నే." మనస్సు ఇక బాధవద్దని మూలిగింది. అతనిలో సానుభూతితప్ప ఇంకేమీలేదు.

మనస్సు ఆరాటంలో మరొకప్రశ్న —

"పతీ: ఎందుకు పెళ్ళిచేసుకోలేదు నువ్వు?—నాగురించా ?-" చివరిమాట మనస్సులోనే మిగిలిపోయింది. అడగాలనిపించింది. అడిగేశాననుకొన్నది.

"మూడేళ్లక్రితం డబుల్ టైఫాయిడ్ వచ్చింది. రక్తంబాగా పోడయిందట. గుండె బాగాపీరసమయిపోయింది. పెళ్ళి చేసుకోవద్దని డాక్టర్లన్నారు. వస్తాను.

ఇక్కడ దిగడం మరచిపోకు."

పతికదిలాడు.

అంతేనా?-


అంతచిన్న కారణమా?- రైలుకదిలింది. మనస్సులో వెయ్యి అగ్నిపర్వతాలు బ్రద్దలయ్యాయి. రాజమండ్రి ప్లాట్‌ఫారం దీపాలు వెనక్కి జరుగుతున్నాయి - మనస్సులో మహారణ్యం తగులబడిపోతోంది. పతి అడుగుల బరువుతనంతో, తన హృదయపు బరువుతనం ప్రతిఫలపడంలేదు. పతి వెళ్ళేవైపు వెలితిగా చూసింది. నిట్టూర్చింది.

రైలెక్కిన పాతనీలవేణికాదు యిప్పుడు తను - ఏంజరిగింది? ఏదో జరిగింది. మళ్ళీ తేరుకోలేనిదెబ్బ-చీకటిలోతలదూర్చిదుఃఖం ఆపుకొన్నది.

ప్లాట్‌ఫారమ్ వెనక్కి జరిగిపోయింది. ●



మెదడుకు మేత



పక్కబొమ్మలో మొత్తం నాలుగుపెద్దవలయాలు, వాటిమీద నాలుగు వరసలలో 16 చిన్నవలయాలు వున్నాయి. చిన్న వలయాలలో ఒక్కొక్కదానిలోఒక్కొక్కఅంకె చొప్పున, 1 నుంచి 16వరకు అంకెలనువేస్తే, ఏవరసలోని అంకెలనుకూడినా34 రావాలి.

అంతేకాదు. బొమ్మలో నాలుగుపెద్దవలయాలున్నాయి గదా. అన్నిటికంటె లోపలి వలయంమీదగల నాలుగు చిన్నవలయాలలోని అంకెల మొత్తంకంటె దానితరువాతపెద్దవలయంమీదవేసినఅంకెలమొత్తం 16 ఎక్కువ వుండాలి.దానికంటె దానితరువాత వలయంమీదఅంకెల మొత్తంకూడా 16 ఎక్కువ వుండాలి. అలాగే దానికంటె దానితరువాత-అంటే, ఆఖరి పెద్దవలయంమీదవేసినఅంకెలమొత్తం16 ఎక్కువవుండాలి.

ఈ మాదిరి ఫలితాలు వచ్చేవిధంగా మీరు అంకెలను 1 నుంచి 16 వరకు చిన్నవలయాలలో వేసుకుంటూ పోవాలి. మీరు ఎంత త్వరగా వేయగలిగితే అంత గొప్పవాళ్ళన్నమాట.

సమాధానం

కింద ఎడమవరుసలో వెలుపలినుంచి లోపలికి 16, 9, 8, 1-కుడివరుసలో 13, 12, 5, 4 - పైన ఎడమ వరుసలో 15, 10, 7, 2 - కుడివరుసలో 14, 11, 6, 3 వెయ్యండి.



తెలుగోపనిషత్

పరభాష యైనటువంటి ఆంగ్లభాష చాలా గొప్ప భాషయని పలువురి యభిప్రాయము. ఒకప్పుడు - ఆంగ్లభాషలోని పదములు మన తెలుగు భాషనుంచి పుట్టినవేయని, నేను సోదాహరణముగా నిరూపించగలను. తమకు తెలీదా యేమిటి? — తిలకించండి.

'లేకుండుట' యనుదానికి, మనము 'అన్' అని వాడుదుము. ఉదాహరణముగా 'ఆరోగ్యము' - అనారోగ్యము. ఈ 'అన్' ఆంగ్లేయుడుకూడా వాడేస్తున్నాడక్కడ! 'అన్‌హెల్త్' 'అన్‌కైండ్' మొదలైనవి. అదేవిధముగా-

అనవసరము - అన్‌నెసెసరీ
విల్లు - విల్
రాయలు - రాయల్
లక్ష - లాక్
లక్క - లాక్ (మరోమాట దొరకలేదు ఆంగ్లేయుడికి)
ఇరుకుగా - ఇర్కుసమ్
మనిషి - మాన్
నిమిషము - నిమిట్ (మినిట్ అని రూపాంతరము)
బందిపోటు - బాండిట్
పందికొక్కు - బాండికూట్
మేస్త్రీ - మాస్టర్
ముంగిస - మంగూస్
బాధపడుట - బాదర్ అగుట లేదా, బాదరేషన్
విషము - విషస్
చీర - శారీ
బ్రాహ్మడు - బ్రాహ్మిన్
కష్టములు - కష్టమ్స్
తెలుగు - టెలుగు

ఇదేవిధంగా మన భాషనుంచే ఆంగ్లము జనించినదని జెప్పుటకు ఇంకను పెక్కు యుదాహరణములు గలవు.

— తెలుగుమేష్టరు.

చిత్రరథుని

చైత్రయాత్ర

ఫిలింతారల ఉత్సవం

సినిమాకళ నేడు ప్రజలకళ. చిత్రలేఖనం వలె, కవితవలె అది కొందరు మేధావులకో, పండితులకో మాత్రం కాదు. పండిత పామరులందరి కళ అది.

అందువల్లనే, ప్రజల కష్ట నిష్ఠురాలలో సినిమా కళాకారులు మొదటినుంచి పాలు పంచుకుంటున్నారు.

రాయలసీమ క్షామం సందర్భంలోను, గోదావరి వరదల సమయంలోను, సినిమా కళాకారులు తమ కళాప్రదర్శనల ద్వారా నిధులు సేకరించారు.

అలాగే చైనా దురాక్రమణ ప్రతిఘటనకు జాతీయ రక్షణ నిధి సేకరణ కృషిలో

"దేశంకోసం" నాటికలో నాగేశ్వరరావు, కృష్ణకుమారి





రాజసులోచన నృత్యం

మన సినీకళాకారులు యథాశక్తి పాల్గొన్నారు.

ఇటీవల హిందీ సినిమా కళాకారులు బొంబాయిలోను, హైదరాబాద్‌లోను ప్రదర్శనలిచ్చి జాతీయ రక్షణనిధికి తోడ్పడ్డారు.

తెలుగు చలన చిత్రకళాకారులు కూడా ఈ కృషిలో తాము వెనుకబడి లేమని నిరూపించుకున్నారు. జాతీయ రక్షణనిధికి తాముకూడా శక్తివంచన లేకుండా కృషి చేద్దామని నిర్ణయించుకున్నారు.

సుప్రసిద్ధ సినీడైరెక్టర్ శ్రీ పి. పుల్లయ్య కన్వీనర్‌గా జాతీయ రక్షణనిధి సేకరణకు సినీకళాకారుల సంస్థ ఒకటి ఏర్పడింది.

వీరు మొన్న 16, 17, 18 తేదీలలో విజయవాడ, హైదరాబాద్, కర్నూలులలో ప్రదర్శన లిచ్చారు. ప్రతిచోట ప్రదర్శనలకు లక్షలాది ప్రజలు వచ్చి తమ అభిమానకళాకారులను చూసిఆనందించారు.

ఈ ప్రదర్శనలలో రాజసులోచన నృత్యం, ఘంటసాల గాత్ర పాట, రఘురామయ్య ఈలపాట, రమణారెడ్డి మ్యాజిక్‌లతో పాటు అయిదు నాటికలు వున్నవి.

"దేశం కోసం" అనే నాటికలో నాగేశ్వరరావు, కృష్ణకుమారి, సూర్యకాంతం, లింగమూర్తి, రమణారెడ్డి, మిక్కిలినేని, జయంతి నటించారు.

కదనరంగంలో దుమికి, దేశసేవ చేయాలని కాంక్షించేకన్నా బిడ్డలు కళ్ళ ఎదుటే వుండాలని కోరే కన్నతల్లిలో దేశభక్తిని రేకెత్తించడానికి బంధుమిత్రులు ఆడిన నాటకమే ఈ నాటికలో ఇతివృత్తం.

దేశంకోసం అజ్ఞాతంగా ఆత్మార్పణచేసిన కుటుంబం గాథ "అజ్ఞాత వీరులు" దీనిలో ఎస్. వి. రంగారావు, సావిత్రి, జగ్గయ్య, కన్నాంబ పాల్గొన్నారు.

భారతదేశంపై అలెగ్జాండర్ దండయాత్ర

"అజ్ఞాతవీరులు" లో రంగారావు, సావిత్రి

"రక్తతర్పణం" లో ఒక దృశ్యం







"దొంగాటకం" లో పేకేటి, రేలంగి, గిరిజ

చేసినప్పుడు ఆగ్రీక్ వీరుని ఎదిరించిన వీరాధివీరుడు పురుషోత్తముని గాథ ఇతివృత్తం గాగల "దేశభక్తి" నాటకంలో కాంతారావు, రాజనాల, సత్యనారాయణ నటించారు.

"దొంగాటకం" అడుగడుగునా నవ్వించి కవ్వించే హాస్యనాటిక. దీనిలో రేలంగి, గిరిజ, పేకేటి నటించారు.

నీఫాలో చైనీయుల దుష్కృత్యాలు, దేశభక్తుల ఆత్మాహుతులను కళ్ళకుకట్టినట్లు చిత్రించే నాటిక "రక్తతర్పణం." దీనిలోని నటీనటులు జమున, జగ్గయ్య, గుమ్మడి, లక్ష్మీరాజ్యం, పద్మనాభం.

రాష్ట్రప్రజారక్షణ మండలి ఆధ్వర్యాన ఈ ప్రదర్శనలు జరిగాయి.

కళ కళకోసంకాక, ప్రజలకోసమేనన్న సత్యాన్ని మన చలనచిత్ర కళాకారులు మరొకసారి నిరూపించారు.

స్త్రీకి ఐశ్వర్యం అంటే వల్లమాలిన ప్రేమ అని అంటుంటారు. కాని నిజానికి ఎంత సంపద వున్నప్పటికీ తగినవాడు తగినవాడు లేనట్టయితే ఆమెకు సుఖశాంతులు లభిస్తాయనడం వట్టిమాట. ఒకవేళ లభించినా కాకిలాంటి శోకం మాత్రం గివ్వచిన్నగా పూసుకోమ. ఈమా, జోమూలేని భార్యాభర్తలమధ్య విద్వేషాలను, అనుమానాలను కల్పిస్తుంది. దానితో ఆ యిద్దరి జీవితానికి ఎసరు ఏర్పడవలసివస్తుంది. ఇలాంటి సమయంలోనే ఎవరో ఒకరు లోకులమాటలు వినలేక ప్రాణపరిత్యాగానికి

జోడుగా చూడవలసిన "ఈడూ జోడూ"



"ఈడూ జోడూ"లో మణిమాల

సంసిద్ధమవడంకూడా సంభవిస్తుంది.

అందువల్లనే ఈడూ-జోడూ అయిన దాంపత్యం వుండడం ఎంతోఅవసరమని, జీవితంలో సంతోషం, శాంతి లభించడానికి ఇది ముఖ్యమని పెద్దలు చెబుతుంటారు.

ఈ విషయాన్నే ఇతివృత్తంగా తీసికొని అనుపమావారు తీసిన "ఈడూ-జోడూ" చిత్రం ఇటీవలనే ఆంధ్రలో విడుదల అయింది.

చిత్రంలో కథ యిది:

పార్వతమ్మ పేద కుటుంబీకురాలు. భర్త ఏనాడో ఈలోకాన్ని వదలిపోవడంతో ఒక్కగానొక్క కూతురు శాంతను చూసుకొని ఆమె జీవితాన్ని నెట్టుకవస్తోంది.

పార్వతమ్మ స్నేహితురాలు సుందరమ్మ తనకొడుకు వేణును శాంతకుయిచ్చి వివాహం చేస్తానని మాట యిస్తుంది.

అయితే వేణు పెరిగి పెద్దవాడయి డాక్టరేట్ పొందడంతోను, అనుకోకుండా సంపద వచ్చిపడడంతోను సుందరమ్మ తన వాగ్దానాన్ని విస్మరిస్తుంది.

పార్వతమ్మ తోటికోడలు రంగమ్మ లోకంలో ఏది బావున్నా అది తనకే చెందాలని ఆరాటపడేవ్యక్తి. తన కోర్కెను సాధించేనిమిత్తం ఎంతటి నీచానికి అయినా పాల్పడే మనిషి. ఆవిడకుకూడా ఒక్కతే కూతురు శోభ. కాలేజీలో చదువుతోంది. శోభకు తనకొడుకు అంజికి పెండ్లిచేయాలని రంగమ్మ ముద్దులతమ్ముడు చలపతి ఆశిస్తుంటాడు.

అయితే డాక్టరుకోర్సు పూర్తిచేసి స్వగ్రామానికి తిరిగివచ్చిన వేణుపై రంగమ్మ కన్నుపడుతుంది.

అతనికి తనకూతురును యిచ్చి వివాహం చేస్తే అటుసంపదా, ఇటు డాక్టరుచదివిన అబ్బాయి లభిస్తాడని ఆమె పొంగిపోతుంది. కాని వేణును తనఅల్లుడిగా చేసికొనడానికి శాంత అడ్డంకిగావుంది. ఈ అడ్డును ఎలాగయినా తొలగించివేయాలని ఆమె ఆలోచిస్తుంటుంది.

ఆ వూరిలోనే లక్ష్మీపతి అనే షావుకారు వున్నాడు. అయన మొదటినుంచి వేణు కుటుంబానికి అండదండలుగా వుండి వేణు పైకిరావడానికి ఎంతో సాయపడ్డాడు. అలభిమానంతోచే వేణుకు స్వగ్రామంలోనే చనిపోయిన తన భార్యపేరిట ఆసుపత్రిని నిర్మించియిస్తానని లక్ష్మీపతి మాట యిస్తాడు.

ఇలావుండగా రంగమ్మ తన కబుర్లతో సుందరమ్మను వల్లికొట్టిస్తుంది. ఆస్తిమీద మోజున్న సుందరమ్మ శోభను తన వేణుకిచ్చి పెండ్లిచేయడానికి అంగీకరిస్తుంది.

సుందరమ్మ భావమేమిటో తెలిసిపున్న పార్వతమ్మ కూతురు భవిష్యత్తును గురించిన దిగులుతో వ్యాధిగ్రస్తయై మంచం పడుతుంది. తాను శాంతనుతప్ప మరొకరిని వివాహం చేసికొనననని వేణుయిచ్చిన మాటతో ఆమె సంతోషంగా కన్ను మూస్తుంది.

ఇదివిన్న సుందరమ్మ ఆరోగ్యం పాడవుతున్నదన్న మిషతో వేణును పట్నం పంపించివేస్తుంది.

తల్లిచనిపోయిన నక్షత్రం మంచిది కాకపోవడంతో శాంత పినతల్లి రంగమ్మ యింట్లోనే తలదాచుకొనవలసిన అవసరం ఏర్పడుతుంది. మొదట్లో అనునయించిన రంగమ్మ రానురాను శాంతను రంపపుకోత పెట్టనారంభిస్తుంది. శాంతను ఎవరికైనా ఇచ్చి వివాహంచేస్తే తనదారికి అడ్డంలేకుండా పోతుందని తమ్ముడు చలపతితో సంబంధాలు చూడమని ప్రేరేపిస్తుంది.

ఈ సమయంలోనే లక్ష్మీపతి కులగురువు ఆ వూరు వస్తారు: మళ్ళీ పెళ్ళి చేసికొంటే గాని లక్ష్మీపతి బాగుపడదని చలపతి ఆయనకు చెబుతాడు. గురువుగారు

"ఆప్తమిత్రులు"లో ఎన్. టి. రామారావు, రాజసులోచన



తిరిగి వివాహం చేసికొనవలసిందిగా ఆదే శించడంతో లక్ష్మీపతి కాదనలేక పోతాడు. చలపతి శాంతను వధువుగా నిర్ణయిస్తాడు. రంగమ్మ రొట్టెవిరిగి నేతిలో పడినట్ట యింది. శాంత ఎంత వద్దన్నా వినక లక్ష్మీ పతికి యిచ్చి వివాహం చేస్తుంది.

ఈ తతంగమంతా తెలియని వేణు స్వగ్రామానికి వచ్చి అసలు విషయాన్నివిని నిశ్చేష్టుడవుతాడు. లక్ష్మీపతి ఇంటికివెళ్ళి శాంతను దూషిస్తాడు. లక్ష్మీపతి ఆసు పత్రిలో పనిచేయడానికి నిరాకరిస్తాడు.

అతని కోసం కట్టిన ఆసుపత్రిలో అతను పనిచేయకపోతే దానిని మూసి వేస్తానని లక్ష్మీపతి తెలియజేస్తాడు.

ఆసుపత్రిని మూసివేస్తే గ్రామీణ ప్రజలు ఎంతో బాధపడతారని, అంతే కాకుండా తాను అనేక అపవాదులకు గురి కావలసి వస్తుందని అందువల్ల ఆసుపత్రిలో పనిచేయడానికి వప్పుకొనాలనిశాంత వేణుని అభ్యర్థిస్తుంది.

ఈలోపుగా శోభ వేణుల వివాహానికి లగ్నం పెట్టుకొనాలని రంగమ్మ, సుంద రమ్మ నిశ్చయిస్తారు. అయితే తనకీ సం బంధం అవసరం లేదని వేణు తిరస్క రించి వెళ్ళిపోతాడు. దానితో వేణూ రోజూ లక్ష్మీపతి యింటికి శాంతకోసం వెళుతుం టాడని రంగమ్మ సుందరమ్మకు చెబు తుంది. ఇదివిన్న సుందరమ్మ తనకొడుకును భ్రష్టుణ్ణి చేయడానికి యత్నిస్తున్నదనే కోపంతో శాంత యింటికివెళ్ళి ఆమెను దూషించింది. లక్ష్మీపతి కలుగజేసికొని సుందరమ్మను నాలుగు చివాట్లు పెట్టి ఇంట్లోనుంచి వెళ్ళగొట్టిస్తాడు.

లోకం తనమీద వేస్తున్న అపవాదు లను శాంత భరించలేక పోతుంది. శోభను పెండ్లి చేసికొనకపోతే చనిపోతానని వేణును బెదరిస్తుంది. దీనితో వేణూ శోభను పెండ్లి చేసికొనడానికి అంగీకరిస్తాడు.

వేణూ శోభల వివాహం నిశ్చయమైన దని తెలిసికొన్న చలపతి శాంత, లక్ష్మీ పతుల వివాహసమయంలో రంగమ్మ చేసిన ఘనకార్యాన్ని యిట్టే బయట పెట్టే స్తాడు. శాంతకు పుస్తెకట్టినది లక్ష్మీపతి కాదని, తప్పత్రాగి లక్ష్మీపతి మైకంలో వుండగా లైట్లను ఆర్పించివేసి రంగమ్మే సూత్రధారణ చేసినదని అతను వెల్లడి స్తాడు.

ఇదివిన్న లక్ష్మీపతి మండి పడతాడు. తనకు పెండ్లే జరగలేదని తెలిసికొన్న శాంత ఆత్మహత్యకు పాల్పడుతుంది. అయితే లక్ష్మీపతి సకాలంలోవచ్చి ఆ ప్రయత్నాన్ని విరమింప జేస్తాడు.

శాంతకు జరిగిన అన్యాయాన్ని గ్రహించిన లక్ష్మీపతి తనకు శాంతకు జరిగిన వివాహం చెల్లనేరదని కోర్టులో రుజువుచేసి ఇటు అంజీ శోభలకు, అటు వేణు శాంతలకు వివాహం జరిపిస్తాడు.

లక్ష్మీపతిగా కారెక్టర్ యాక్టర్ గుమ్మడి వెంకటేశ్వరరావు చూపిన నటన ఈ చిత్రం లో శిఖరాగ్రాన్ని చేరుకొన్న దనడంలో ఎట్టి అతిశయోక్తి లేదు. లక్ష్మీపతి పాత్ర, లక్ష్మీపతిగా గుమ్మడి నటన చిత్రానికి జీవం పోశాయి.

స్వార్థపరుల మోసాలకు గురి అయి చివరకు మంచివారి తోడ్పాటుతో తన



అనురూపవారి "అనురాగం" లో భానుమతి, గుమ్మడి.

కోరిన వ్యక్తిని చేబట్టిన పల్లెటూరుపిల్లగా జమున. ఆమె ప్రియునిగా జగ్గయ్య చాలా ప్రజ్ఞతో నటించారు.

శోభగా నటించిన మణిమాలకు మంచి భవిష్యత్తు వున్నదని చెప్పవచ్చు.

ఇతర పాత్రలను ధరించిన సూర్య కాంతం, హేమలత, రమణారెడ్డి, చదల వాడ, చలం ప్రభృతులు యథోచితంగా నటించారు.

మంచి సాంఘికసమస్యను ఇతివృత్తంగా ఎన్నుకొని దానిని సమర్థంగా రూపొందిం చిన తిలక్ అభినందనీయుడు. పెండ్యాల సంగీత దర్శకత్వంలో ఘంటసాల, సుశీల, శ్రీనివాస్ ప్రభృతులు పాడినపాటలలో రెండుమూడు వినసొంపుగా వున్నాయి.

ఈ చిత్రానికి మాటలను పినిశెట్టి, పాట లను ఆరుద్ర వ్రాశారు. ఫొటోగ్రఫీని వి. ఆర్. చౌదరి, కళను తోట నిర్వ హించారు.

అవీ—ఇవీ

శ్రీ. ఏ.పి.వారి తాజా చిత్రంలో సూర్య కాంతం, పద్మనాభం, రమణారెడ్డి, వాసంతి ప్రభృతులు పాల్గొన్న ఒక హాస్యరస

సన్నివేశాన్ని యిటీవల సారథీ స్టుడియో స్‌లో చిత్రీకరించారు.

ప్రత్యగాత్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నాగేశ్వరరావు, కృష్ణకుమారి, గుమ్మడి, సంధ్య, ప్రభాకర్ రెడ్డి ప్రభృతులుకూడా నటిస్తున్నారు.

కొసరాజు, నారాయణరెడ్డిగార్లు వ్రాసిన రెండు పాటలను ఇటీవలే మరో చిత్రంలో రికార్డు చేశారు.

శ్రీ ఎ. వి. సుబ్బారావు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఆంధ్రలో నవయుగా ఫిలిమ్స్ వారు విడుదల చేస్తారు.

అనురాగం :

రామినీడు దర్శకత్వంలో అనుపమా వారు తీస్తున్న "అనురాగం" చిత్రంలో భానుమతి, గుమ్మడి ముఖ్యపాత్రలను ధరిస్తున్నారు.


హరనాథ్, వాసంతి కలసిపాడే ఒక పాట చిత్రీకరణ జరగడంతో చిత్రం పూర్తి అవుతుంది. చిత్రంలో హరనాథ్ - వాసంతి కలసిపాడే ఈ పాటను సి. నారాయణరెడ్డి వ్రాశారు. ఇది తెలంగాణలోని ఒక జానపద గేయం ఆధారంగా వ్రాయబడింది.

భానుమతి పాడిన "శరణం భవే," "విన్నపాలు వినవేలా" మొదలైన గీతాలను ఇటీవలే రికార్డు చేశారు.

జి. వరలక్ష్మి, ఎస్. జానకి, చలం, గిరిజ, రేలంగి, పేకేటి, రమణారెడ్డి, ఛాయాదేవి, మోహనదాస్, కె. వి. ఎస్. శర్మ, నాగయ్య ప్రభృతులు కూడా నటిస్తున్న

"ఆప్తమిత్రులు" లో మరొక దృశ్యం





ఈ చిత్రానికి సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు. టి. హనుమంతరావు, డి. సూర్యనారాయణగార్లు చిత్ర నిర్మాతలు. రిలీజ్ విజయా—వాణీ ఫిలింస్.

కలవారి కోడలు :

కృష్ణకుమారి, ఎన్. టి. రామారావు నాయికా నాయకులుగా నటిస్తున్న రఘురాం ఫిలిమ్స్‌వారి "కలవారి కోడలు" చిత్రంలోని కొన్ని ఘట్టాలను ఇటీవల న్యూటోన్ స్టుడియోస్‌లో చిత్రీకరించారు.

నార్ల చిరంజీవి వ్రాసిన పాటను ఎస్. జానకి ఆలాపించగా రికార్డు చేశారు. దానికి టి. చలపతిరావు బాణీని కూర్చారు.

చిత్రానికి మాటలు నార్ల చిరంజీవి వ్రాస్తున్నారు. దర్శకుడు-నిర్మాత కె. హేమాంబరధరరావు, సహనిర్మాత ఏ. పూర్ణచంద్రరావు. విడుదల—వాణీ.

ఎం.ఎస్. రామారావుపాటలు :

ఎం. ఎస్. రామారావు పాడిన రెండు గేయాలను కొలంబియా వారు రికార్డు చేశారు. జి. ఇ 22 793 నంబరుగల ఈ రికార్డు ఈ నెలాఖరు నాటికి అమ్మకానికి సిద్ధమవుతుంది.

మహాకవి జయదేవ వ్రాసిన రెండు అష్టపదులు ఈ రికార్డులోని అంశాలు. వాటికి ఎం. ఎస్. రామారావే స్వయంగా బాణీలను కూర్చారు.

బందిపోటు :

జానపద చిత్రాలను తీయడంలో ఖ్యాతి గాంచిన విఠలాచార్య దర్శకత్వంలో రాజలక్ష్మివారు తీస్తున్న జానపద చిత్రానికి "బందిపోటు" అని పేరు పెట్టారు. ఇందులో ఎన్. టి. రామారావు, కృష్ణకుమారి

రాజసులోచన, గుమ్మడి, రమణారెడ్డి ప్రభృతులు నటిస్తున్నారు. ఆగస్టులో విడుదల కాగల ఈ చిత్ర నిర్మాతలు సుందర్‌లాల్ నహతా, డూండీ.

* * *

వారం క్రిందట సి. నారాయణరెడ్డి గారితో పనివుండి వారు ఫిలింసెంటర్లో వున్నారని తెలుసుకొని అక్కడకు వెళ్ళాను. వారు వ్రాసిన పాటఒకటి రికార్డింగ్ జరుగుతున్నదపుడు. "నీ చిరునవ్వులలో పూచిన పువ్వులలో" అని మొదలయ్యే యుగళగీత మది. గోకుల్ ప్రొడక్షన్స్ తరఫున దోనేపూడి కృష్ణమూర్తి నిర్మిస్తున్న "తిరుపతమ్మ కథ" అనే చిత్రానికి ఎం. బి. వాల్కే చేత రికార్డు చేయబడినది. సుశీల ఘంటసాల ఆ పాటకు తమ కంఠాలను అందించారు.

ఈ చిత్రంలో నాయికానాయకులు కృష్ణకుమారి, ఎన్. టి. రామారావు. తదితర తారామండలం గుమ్మడి, రాజసులోచన, రమణారెడ్డి, చదలవాడ, మిక్కిలినేని, సుజాత, సత్యనారాయణ, ఛాయాదేవి, సూర్యకాంతం, రమాదేవి, సురభి బాలసరస్వతి. ఇంతకుముందు "మాంగల్యం", "ఎమరీత" చిత్రాలకు దర్శకత్వం వహించి పరవాలే దనిపించుకున్న బి. ఎస్. నారాయణ ఈ చిత్రానికి దర్శకుడు. మూడు పాటలు ఆశతో "చేరినాను, మోసముచేయకు మోహన, నన్నే పెండ్లాడవలె" బి.శంకర్రావు (తల్లీ బిడ్డలు) ఆధ్వర్యాన రికార్డుచేశారు. ఆ తరువాత అదే స్థానాన పామర్తి (సతీ తులసి) నియమించబడిన తరువాత మరొక నాలుగు పాటలు చేయబడ్డాయి. ఇంక రెండు పాటలు త్వరలోనే చేస్తారు. ఇంతవరకు పాటలను వ్రాసింది సి. నారాయణరెడ్డి, దాశరధి, వేణుగోపాల్ దాశరథి వ్రాసిన ఒక జావళి పాట రాజసులోచన అభినయించుతుండగా చిత్రించబడుతుంది. ఘంటసాల, సుశీల, జిక్కి, మాధవపెద్ది, పిఠాపురం పాడారు. రచన బొల్లిముంత శివరామకృష్ణ. ఛాయ రామచంద్ర. పదకొండురీళ్ళు తయారైంది. ఆగస్టులో కృష్ణద్వారా ఆంధ్రలో, పూర్ణద్వారా సీడెడ్, నైజాములలో విడుదలవుతుం దనుకుంటున్నారు.

క్రిందటి నెల రఘురాంవారి "కలవారి కోడలు" షూటింగ్ మొదటిరోజని తెలిసి న్యూటోన్ స్టూడియోకి వెళ్ళాను. సెట్‌మీద వెళ్ళగానే కనపడింది వీణవాయించే మారెళ్ళ రంగారావు. ఇదేమిటి యిక్కడ వున్నారు అని అడిగితే అప్పుడు షూటింగ్ జరుగుతున్నది ఒక వీణపాట అనీ, ఆ పాటకు తగినట్లుగా ప్రేక్షకదపడం చూడటానికని వచ్చానని అన్నారు. ఆ వీణపాట తెరమీద యెవరు వాయిస్తారోతెలుసా? డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి. నన్ను చూడగానే అసలు విలన్లకు తెలియనివిధంగా ఒక చిరునవ్వు గిరవాటేసి దర్శకులు కె. హేమాంబరధరరావు చెబుతున్నదానిపై మనస్సు కేంద్రీకరించారు. చిత్రంలో వారి చెల్లి అయిన కృష్ణకుమారి, ఆమెకు కాబోయే భర్తఅయిన ఎన్. టి. రామారావు సెట్‌పైకి రాగానే షాట్ తీశారు.

పాట నార్ల చిరంజీవిది. స్నేహపు విలువను తెలిపేది. మంచిరచన.నడకనుచూపేది. వరస చేసింది టి. చలపతిరావు. తక్కిన తారాగణం గురించిఅడిగితేదర్శకులు యింకా నిర్ణయించలేదనిఅన్నారు.

కె. హేమాంబరధరరావు ఆరోజు సాయంత్రం ఆఫీసులో ఒక చల్లనివార్తచెప్పారు. ఈ చిత్రంలో ఒక చక్కనినృత్య సన్నివేశం వుంటుందని. మధురాతిమధురమైన ఆ వస్తువును షూటింగ్ అయేదాకా గోప్యంగానే వుంచుతానని వారికి మాట యివ్వటం జరిగింది. కాబట్టి అంతవరకు అది రహస్యం.

తాజ్‌మహల్ :

ఆంధ్రదేశంలో అక్కడక్కడ ఆడుతున్న చిత్రం పుష్పా పిక్చర్స్‌వారి సంపూర్ణ వర్ణ చిత్రం "తాజ్‌మహల్." ఈ చిత్రంలో మొగల్ వంశీయుల చరిత్ర తూచా తప్పకుండా చెప్పబడి వుంటుందనే దృష్టితో వెళ్ళేవారికి పూర్తిగా ధోకా యిస్తుంది చిత్రమైన చిత్రం. కాని ఏవో నాలుగు చారిత్రకమైన పేర్లు, సరదాగా కాలక్షేపానికి పనికివచ్చే చిత్రం కావాలనుకునే వారిని ఈ "తాజ్‌మహల్" యెంతైనా మురిపిస్తుంది. లేలేత రంగుల సొబగుతో యెంతైనా అలరిస్తుంది. ఇంపైన సంగీతపు సొంపుతో యెంతైనా సంతృప్తి పరుస్తుంది.

జహంగీరు పాదుషా తనయుడు ఖుర్రం యువరాజు. అర్జుమంద్ బానూ అనే అమ్మాయిని, నూర్జహా మహారాణి అన్న కూతుర్ని ప్రేమిస్తాడు. నూర్జహా మాట కాదని అర్జుమంద్‌నే పెళ్ళి చేసుకొంటాడు. కోపించిన రాణి మరొక కుమారుడు షారియార్‌కి తన భర్త మరణం తరువాత పట్టం కడుతుంది. మామగారైన అసిఫ్‌ఖాన్, మిత్రుడైన ఉదయపుర ప్రభువు కరన్‌సింగ్ అండదండలతో షారియూర్‌ని ఓడించి షాజహాన్ పేరుతో ఖుర్రం గద్దె నెక్కుతాడు. అర్జుమంద్ ముంతాజ్‌మహల్‌గా మారుతుంది. ఆమె జ్ఞాపకార్థం కట్టించిన పాలరాతి భవంతియే తాజ్‌మహల్. ఇవి చరిత్ర చిలవలు. సినిమాకథకుడైన ఖమర్ జలాలాబాది పలవలు చాలా వున్నాయి. చరిత్రను మరచితే బాగానే వున్నాయి. అయినా యిది సినిమా మరి. అన్నిలక్షలు వెచ్చించి నిర్మించినపుడు పాఠ్యపుస్తకపు వాస్తవాలకంటె ప్రజారంజకపు కల్పనలకే ప్రాధాన్యం వుండాలి.

పాత్రల గౌరవానికి యేమాత్రం భంగం కలుగకుండా దర్శకత్వం వహించినది ఎం. సాదిఖ్. ఉర్దూలోనే అర్థమయేటట్లు సంభాషణలు వ్రాసినది ఖమర్ జలాలాబాది. అదే పద్ధతిలో అందమైన పాటలు వ్రాసింది సాహిర్ లుధియాన్వి. ఆమని కోయిలకు చిగురు మావి మారు లేత పచ్చ యెంత ఆహ్లాదం కలగిస్తుందో అంతే ఆహ్లాదం అన్ని రంగులు కలిగించేలా కళను ఊహించింది ఎ. ఎమజద్. మొగలు తోటల్లో నీటిని విరజిమ్ము చిత్రయంత్రాలలో సరస సంగీతాన్ని చిమ్మింది రోషన్.

జహంగీరే మళ్ళీ అవతరించాడా అన్నంత ఘనంగా ఆ పాత్రకు ప్రాణప్రతిష్ఠ చేశాడు రెహమాన్. షాజహాన్ కూడా యింత అందంగా వుండి వుండదేమో అనిపించనట్లు ఆవేషాన్ని ధరించినది ప్రదీప్ కుమార్. ఈమె యింత అందంగా వుంటే ఆనాటి ముంతాజ్ యెంతటి సౌందర్యవతియో అనిపించినట్లు చేసినది బీనారాయ్. నూర్జహా ఠీవి, డాబు, దర్పం, ముసలితనంలో కూడా అందం కనిపింప జేసినది వీణా. ఇంకా చాలామంది వున్నారు.

ఈ చిత్రానికి నిర్మాత ఎ. కె. నాడియాద్వాలా.

మీలోమీకు పోటీ

వెయ్యి నూట పదహార్ల బహుమతి

ఇది పత్రికా ప్రకటనల యుగం. లిటిగేషన్ల దగ్గర్నుంచి, లిమిటెడ్ కంపెనీల మీటింగులదాకా అన్నీ దినపత్రికలలో డబ్బిచ్చి ప్రకటించక తప్పదు. ప్రాంతీయ పత్రికల్లో వేలం నోటీసులు తప్పనిసరి. ఈనాడు హరిశ్చంద్రుడు తన భార్య చంద్రమతిని వేలం వేస్తే నోటీసు ప్రకటించక మానడు. సదరు నోటీసు ఎలా వుంటుందో వూహించి పంపించడమే ఈ నెల మీలోమీకు పోటీ విషయం. యథావిధిగా వచ్చిన వాటిలో 'నారద' గారికి నచ్చిన దానికి వెయ్యినూటపదహారు నయాపైసలూ కచ్చితంగా ఇచ్చుకుంటాం.

పోయిన నెల పోటీ రిపోర్టు 'నారద' గారు ఇలా వ్రాస్తున్నారు:

"మీలోమీకు పోటీ ఎందుకు పెట్టానా అని నాలో నేను నాలుగు గంటలసేపు నానాబాధా పడ్డాను. వచ్చిన ఎంట్రీలు ముప్పాతిక మూడు వంతులు బాగులేవు. పాతికలో నాలుగోవంతు బాగా, మహ బాగా వున్నందువల్ల ప్రాణం లేచి వచ్చింది. ఈ పోటీ నెల నెలా నిర్వహించ వచ్చుననే ధైర్యం కలిగింది. పోటీదారులలో చాలా మంది ఒక విషయాన్ని మరచిపోయారు. శ్రీయుతులు పింగళి, మల్లాది, కొసరాజులు ఎలా వ్రాస్తారో వూహించి ఎంట్రీలు పంపించమంటే, ఇంతకు ముందు ఎలా వ్రాశారో, అలాగే ఆ మాటలూ, అవీ కొద్ది మార్పులతో తిరగరాసి పంపించారు. ఆ కవులు తమ్ము తాము యిమిటేటు చేసినట్టే వుందిగాని వారి పద్ధతులలోని సారం చాలా ఎంట్రీలలో లేదు.

రాజమండ్రినుంచి ఆర్. రంగనాథరావుగారు పంపిన కొసరాజు పద్ధతి కొద్దిగా నేను ఆశించిన దానికి దగ్గరలో రావడానికి ప్రయత్నించింది.

"వన్నెలు తరిగీ చిన్నెలు పెరిగిన
చిన్నదానా! రాబడి
పన్నులు పెంచీ పండుగ చేస్తే
పూల వాన!"

అన్నది కొసరాజుగారు తమ పాత పాట దాటలో నడిచినట్టుంది.

బెజవాడనుంచి వెంపటి సుబ్బారావుగారు పంపిన పింగళి వారి పద్ధతిలోని మచ్చు తునకలు రెండు చూడండి.

ఆమె; "సుంకరి! నీ యొక్క బింకాలు తెలిసెను
అంకెకు చేరిన హాని సుమా, టక
బొంకులు మానుట మేలు సుమా!

అతడు; జవ్వని! నీ వన్నె మవ్వము పెంచెద
కవ్వించితే కరిగిపోతి సుమా, రివు
రివ్వున వలచుట రీతి సుమా!"

ఇందులో మొరార్జీ సమాధానం, ఎన్నికల వాగ్దానంకన్నా నమ్మలేనంత దీనిగా వుంది.

గుంటూరునుంచి యస్. సుందరమూర్తిగారు పంపిన కొసరాజువారి పద్ధతి మెచ్చుకొనేటట్టు వుంది.

కుర్రాడు: బంగారమ్మ! బంగారమ్మ! బంగారమ్మా! నీ
కొంగు కూస్త తగిలితే కంగారమ్మా! బలే
కంగారమ్మా! నాకు
కంగారమ్మా!

కుర్రది: భండారయ్య! భండారయ్య! భండారయ్యా! నీ
జెండా ఎగరేయకోయ్! దండాలయ్య! నీకు
దండాలయ్యా! కోటి
దండాలయ్యా!

మల్లాది రామకృష్ణశాస్త్రిగారి పద్ధతి వూహించిన పది మందిలోనే కాక, వచ్చిన ఎంట్రీలన్నింటిలోనూ వుత్తమంగా వున్నది మద్రాసునుంచి టి. వి. యస్. శాస్త్రిగారు పంపినదే! దానికే వెయ్యినూటపదహార్లు (షరా: నయాపైసలు) ఇవ్వమని సిఫార్సు చేస్తున్నాను. ఇదుగో దాని పూర్తి పాఠం.

అపరంజి: మగరాయ! తగదురా! నా
మయిచాయ కొరకాయ వలదురా!

మొరార్జీ: పసిడికూనా! నీ యాన! నీ
మిసిమి హొరంగు తరగదే నెరజాణ!

అపరంజి: కన్నియ వన్నియ కలచినచో
పన్నుల రాయడ! నీ కన్నులు చల్లనగునటరా!

మొరార్జీ: పదునాల్గు లోకాలు గెలువ, చెలువ!
పదునాల్గు వన్నెలు తగవా! ॥మ॥

మీ సాహిత్య పరిచయం

ఈ క్రింది పది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి రెండేసి మార్కులు. సమాధానం చెప్పడానికి వ్యవధి క్షణంలో సగం, ఇరవైకి ఇరవై మార్కులూ వస్తే మీరు చాలా గొప్పవారు. 20—15 మధ్య వస్తే బ్రిలియంట్ (బహుశా మీరెప్పుడూ "బ్రిలియంటైన్" వాడుతూ వుండి వుండాలి.) 15—10 మధ్య వస్తే ఫరవాలేదు. 10 కి లోపున మార్కులు వస్తే....సారీ.

1. ఉత్తర హరివంశం రాసినకవి : శ్రీనాథుడు, ఎర్రాప్రెగ్గడ, సోమన, కేతన.

2. పింగళి సూరన రాసిన కావ్యం : పారిజాతాపహరణం, రాఘవ పాండవీయం, క్రీడాభిరామం, సింహాసన ద్వాత్రింశిక.

3. ఈ క్రింది పద్యపాదంతో ప్రారంభమయ్యే కావ్యం : "శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షో ముఖాంగేషు...."

4. "వనకుమారి" రాసిన కవి : రాయప్రోలు, జాషువా, విశ్వనాథ, రామిరెడ్డి.

5. కృష్ణశాస్త్రిగారి రచన : గిరికుమారుని ప్రేమగీతాలు, తృణకంకణం, ప్రవాసం, హృదయేశ్వరి

6. ఈ క్రిందివారిలో నోబెల్ సారస్వత బహుమతి పొందిన అమెరికన్ రచయిత : టి. ఎస్. ఇలియట్, యూజీన్ ఓనీల్, విలియం సారోయాన్, మార్క్‌ట్వేన్.

7. "లవ్స్‌లేబర్స్‌లాస్ట్" అనే నాటకం రాసింది : బెర్నార్డ్‌షా, షెరిడన్, షేక్స్పియర్, గోల్డ్‌స్మిత్.

8. కాళిదాసు రాసిన కావ్యం : కిరాతార్జునీయం, కాదంబరి, శిశుపాలవధం, రఘువంశం.

9. "రసగంగాధరం" అనేది : నాటకం, కావ్యం, అలంకార శాస్త్రగ్రంథం, వ్యాకరణ గ్రంథం.

10. "మృచ్ఛకటికం" అనే నాటకం రాసింది : భాసుడు, శూద్రకుడు, మురారి, భట్టనారాయణుడు.

సమాధానాలు

1. సోమన 2. రాఘవ పాండవీయం 3. శ్రీమదాంధ్ర మహాభారతం 4. రామిరెడ్డి 5. ప్రవాసం 6. యూజీన్ ఓనీల్ 7. షేక్స్పియర్ 8. రఘువంశం 9. అలంకార శాస్త్రగ్రంథం 10. శూద్రకుడు.

స్నేహపారిజాతం

వి.ఎ.కె. రంగారావు

'మంచి మనసు తెలిపేదీ స్నేహము
మనిషి విలువ నిలిపేదీ స్నేహము'

అని కవి మాటలు. సహృదయుల మనసులలో మెదిలే సాధారణ సుహృద్భావాన్నే కవనపుశాణంతో నగిషీలుచెక్కి, మాత్రల సూత్రమున నిలిపిన నార్ల చిరంజీవి మాటలు. కవి పలికినట్లు మానవజీవితలతను సురభిళ సుమాలను పూయించేదీ స్నేహమే. మనసుకూ మనసుకూ అనురాగపు వంతెనలు వెలయించేదీ స్నేహమే. ఈ విధంగా స్నేహం గురించి కావ్యాలు వ్రాయవచ్చును గాని స్నేహమనే పదానికి నిర్వచనం కనుగొనటం దుస్సాధ్యం. వ్యుత్పత్తి అర్థంకాకపోయినా హితముకోరువాడు స్నేహితుడు అని అనిపించక మానదు. అంతమాత్రాన స్నేహానికి అర్థం మంచి కోరటం అనుకుంటే అది రేఖామాత్రమైన నిర్వచనమే అవుతుంది. ఈ ఉన్నతస్నేహానికీ ప్రేమకూ తేడా చాల తక్కువే. ప్రేమంటే సాధారణంగా సినిమాలలో చూసే, నవలలలో చదివే, కథలలో తారసిల్లే అర్థంలేని వ్యర్థ మోహంకాదు. పైమెరుగులకు భ్రమసి మోసపోయే మోహమూ కాదు. స్నేహంతో సరిపోల్చినపుడు ప్రేమంటే నిస్వార్థమైన ఉత్తమప్రేమ అనే నిశ్చితార్థం. ఈ విధంగా సరిపోల్చినపుడు రెంటికి ఉత్తమాన్వయం చేయటమే జరుగుతుంది.

అయితే ప్రేమికులకు, స్నేహితులకు భేదమే లేదా అని అడుగుతారేమో! లేకేం, ఉన్నది. చాలా సూక్ష్మమైనది. ఆ భేదం గురించి తెలుసుకునేముందు వివిధతరగతుల స్నేహం, స్నేహితులగురించి, ప్రేమా, ప్రేమికులగురించి తెలుసుకోవాలి.

స్వప్రయోజనం కోసం యితరులతో స్నేహాన్ని మనమే పెంపొందించుకున్నపుడు ఆ స్నేహం సాధారణ ధర్మమవుతుంది. స్వప్రయోజనం అన్నపుడు ఆ పదం దేనికైనా వర్తించవచ్చును. ధన, బల, వస్తు, స్థితి, వాహనాది ప్రయోజనాలలో ఏది వాంఛించినా అది స్వప్రయోజనంక్రిందే వస్తుంది కదా! ఇందులో స్వార్థం స్థూలంగా చూచినా తెలియకపోదు. కలిగినవారిచుట్టూ కలిగించుకోవాలనుకునేవారు తిరుగుతూ యేర్పరచుకొనే స్నేహమే యిది. విద్యావంతునిచుట్టూ విద్యార్థియై తిరిగినా, ధనికునిచుట్టూ అర్థార్థియై తిరిగినా ఒక విధమైన స్నేహమే అది. మొదటివ్యక్తికి కీడు కోరనంతవరకు ఈ బాంధవ్యం స్నేహంగానే పరిగణింపబడుతుంది. ఇటువంటి సాధారణ ధర్మానికి చెందిన స్నేహం, యిచ్చే వ్యక్తికి కూడా కొంత సంతోషాన్ని యివ్వగలుగుతుంది.

ఇతరుల మంచికోరి, యితరులకు ఏదో విధమైన సహాయం చేద్దామనే ఉద్దేశంతోనే స్నేహం కొనసాగిస్తే అది మధ్యమ ధర్మమవుతుంది. మధ్యమ ధర్మమవటానికి కారణం ఈ స్నేహంలో ~~ఉపకారం~~ సహాయం చేద్దామనే కోరిక ఈడేరటానికి అవకాశం, ఆ అవకాశంలో కొంత స్వార్థానికి

ప్రవేశం వున్నది కనుక. మానసిక బంధాలలో ఏదో అనిర్వచనీయమైన లోపాన్ని, మనోగతమైన యేదో యేకాకితనాన్ని అనుభవించేవారు అవలంబించే మార్గమిది. పుచ్చుకునే వ్యక్తినికొంత చికాకుపరచే అవకాశం లవలేశం వుందీ మార్గంలో.

మనమంచి, మరొకరిమంచి అనే ప్రసక్తి లేకుండా కేవలం నిర్లిప్తంగా ఆ వ్యక్తి మానసిక సాన్నిహిత్యాన్నే కోరుకున్న స్నేహం ఉత్తమ ధర్మానికి చెందిన దవుతుంది. దీనికి కారణం ఈబాంధవ్యంలో స్వార్థానికి చోటు లేకపోవడం. ఇటువంటి ఉత్తమధర్మ స్నేహం స్వర్గవిహారానికి మారుపేరు. ఇటువంటి స్నేహం నెరపే వారితో అపార్థాలు, అనర్థాలు వాటిల్లటం అసంభవం. ఏది యేమయినా, యెవరేవిధంగా ప్రవర్తించినా ప్రశ్నించకుండా అర్థంచేసుకొనే స్తోమత వీరికుంటుంది.

ఇక ప్రేమలోవున్న త్రివిధ ధర్మాలు.

సాధారణ ధర్మం: తన అహాన్ని, ఆత్మను సంతృప్తిపరచటంకోసం యితరులను ప్రేమించటం. ప్రేమించటం అనేకన్న ప్రేమిస్తున్నానని అనుకోవటమంటే సమంజసంగా వుంటుంది. నిజానికి వారు ప్రేమించేది యెదుటవ్యక్తినికాదు, ఎదుటవ్యక్తిచూపే అనురాగంలో ప్రతిబింబించే తమ మూర్తినే. ఇటువంటి ప్రేమకు ఈనాడు వున్న ప్రాచుర్యాన్నిబట్టి దీనిని సాధారణధర్మ మనవలసి వచ్చినదికాని, పర్యవసానాలనుబట్టి ఆలోచిస్తే రాక్షసధర్మమనే అనాలి. ఈ విధంగా ప్రేమింపబడిన వారికి మరొక నరకమంటూ వుండదు. నిమిషనిమిషానికి తన కబంధహస్తాలలో నలిపి, స్వార్థచింతనతో వ్యక్తిత్వాన్ని నిర్మూలించి, భావస్వాతంత్ర్యానికి సహితం గొడ్డలిపెట్టు పెట్టగల ప్రేమ నరకయాతన తుల్యముగాక మరేమవుతుంది?

మధ్యమ ధర్మం: పరస్పరం ప్రేమించుకొని, ఒకరి ప్రేమ వ్యక్తీకరణనుండి మరొకరు ఆనందానుభూతి పొందుటనది. ఈ మార్గంలో యెదుటవ్యక్తి ప్రేమలో లోపం కనబడినపుడు రెండవవ్యక్తి ప్రేమకూడా నిర్వీర్య మవుతుంది. ఈ విధంగా ప్రేమించే వ్యక్తుల బాంధవ్యాలు పరస్పరాధారంతో ప్రాకిన లతలు. ఒకదాని బలహీనత త్వరితకాలములోనే రెండవదానిలో బొడచూపక మానదు. అందువలన యిది మధ్యమ ధర్మము.

ఉత్తమ ధర్మము: ఎదుటివారి ప్రేమతో సంబంధం లేకుండా నచ్చిన వ్యక్తిని తోచిన విధంగా ప్రేమించటం. ఇచ్చట ఒకవిషయం గుర్తుంచుకోవటం ముఖ్యం. ఈ ఉత్తమధర్మ ప్రేమకూ అమలిన శృంగారతత్వానికీ యెటువంటి సంబంధమూ లేదు. అమలిన శృంగారతత్వంలో యిరువురు పరస్పరానురాగరంజితులైనా వారికి శారీరక సంబంధం వుండకూడదు. ఈ ఉత్తమ ధర్మంలో ప్రేమించేవారికి శారీరకబంధం బహిష్కృతం (సామాజిక నిబంధనల ప్రసక్తి ఇచట అప్రస్తుతం) కాదు. కాని, ఈ విధంగా ప్రేమించేవారు తమకు తామై శారీరక సంబంధం కోరరు. కోరినా అది యెదుట వ్యక్తికి ఆనందదాయకమనే వుద్దేశంతోనే అయివుంటుంది. ఆ యెదుటి వ్యక్తికూడా ఈ మనశ్శారీరక సంయోగం తనకోసం కోరకపోతే అది ఉభయత్రా ఉత్తమధర్మ మవుతుంది. ఇటువంటి ప్రేమతో ఉపమించటానికి భూతలస్వర్గము, అమృతప్రాయము అనే మాటలూ అసర్థాలే. ఆ యెదుటివ్యక్తి తనకోసం సుఖాన్నికోరిన పక్షంలో అది ఉత్తమ మధ్యమధర్మాల ఉత్తమ సంయోగమే అవుతుంది. మొదటిదాని అంతస్తులో కాకపోయినా యిదీ ఆనందదాయిని అనే ఒప్పుకోవాలి.

ఇప్పుడు నిదానంగా ఆలోచించి చూస్తే తెలుస్తుంది. మొదటి రెండుధర్మాల స్నేహానికీ ప్రేమకు తగుమాత్రం తేడావున్నా ఉత్తమధర్మానికి చెందిన ప్రేమకూ స్నేహానికీ భేదం బహుస్వల్పం. ఈ రెండు ఉత్తమధర్మాలూ మానసోల్లాసాన్వేషకులకు ఆచరణీయాలు.

JYOTI. JUNE'63 *Regd. No. A 368*

